
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

ప్రకాశం
జిల్లా వార్తలు

ఆదివారం 10, ఆగస్టు 2025



ఘనంగా ఆదివాసీ దినోత్సవం

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఒంగోలులో శనివారం ఘనంగా నిర్వహించారు. గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన సభలో డీఆర్వో ఓబులేసు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, గిరిజన సంక్షేమాధికారి వరలక్ష్మి, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఆదివాసీలు ప్రభుత్వ పథకాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు అలరించాయి.

7



వైభవంగా చెన్నయ్య శాంతి కల్యాణం

మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామికి శాంతి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు శ్రీపతి అప్పనాచార్యులు శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించి తరించారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షించారు.

- ఆంధ్రజ్యోతి, మార్కాపురం





ముండ్లమూరు తహసీల్దార్ కార్యాలయం

పైసలిస్తేనే పనులు



- అవినీతికి కేరాఫ్ తహసీల్దార్ కార్యాలయం
- ముండ్లమూరులో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్ల ఇష్టారాజ్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- శంకరాపురం 1బీ రికార్డు మాయం

ముండ్లమూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరు తహసీల్దార్ కార్యాలయం అవినీతికి చిరునామాగా మారింది. పైసలు ఇస్తేనే పనులు జరుగుతున్నాయి. అవి ముట్టకపోతే సంబంధిత ఫైలుకు కొర్రీ వేస్తూ నెలల తరబడి తిప్పుకుంటున్నారు. సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పైఅధికారుల పేర్లు చెప్పి వేలాది రూపాయలు గుంజుకొంటున్నారు. రెవెన్యూ రికార్డుల్లో తప్పులు ఉన్నా, ఒకరి భూమికి మరొకరి పేరు పడితే సరిచేసేందుకు వేల రూపాయలు వసూలు చేసిన వీఆర్వోలు లేకపోలేదు. రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. ఇటీవల సచివాలయాల్లో ఉద్యోగంలో చేరిన గ్రామ సర్వేయర్ల పని 'మూడు పువ్వులు.. ఆరు కాయలు' అన్నచందంగా ఉంది. కొలతలకు వెళ్లిన సర్వేయర్లు తాము చెప్పిందే వేదమంటూ వేలాది రూపాయలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఎకరానికి రూ.2వేల నుంచి రూ.5వేల వరకు తీసుకుంటున్నారు. ముండ్లమూరులోని సర్వే నంబరు 200లో 120 ఎకరాల భూమి ఉంది. ఈ మొత్తం ఎఫ్ఎల్ఆర్‌లో 48 మందికి సమాన భాగాలుగా ఉన్నట్లు

మిగతా 6వ పేజీలో

ఆనందం ఆవిరి

సాగర్ కాలువల్లో తగ్గిన నీటి పరిమాణం

- రెండో జోన్‌కు సరఫరాను తగ్గించిన అధికారులు
- భారీగా వరి నాట్లు వేస్తున్న అన్నదాతలు
- కొన్నిచోట్ల నార్లు పోస్తున్న వైనం
- నీరు నిలిచిపోవడంతో ఆందోళన
- డ్యాంలకు వరద ఆగడంతోనే అంటూ ఇరిగేషన్ అధికారుల సమాధానం



దర్శి బ్రాంచ్ కాలువలో తగ్గిన నీటి పరిమాణం

నెలరోజులు ముందుగానే సాగు నీరొచ్చిందన్న ఆనందం వారం తిరగకుండానే ఆవిరైంది. సాగర్ కాలువల్లో ఒక్కసారిగా నీటి ప్రవాహాన్ని తగ్గించి వేశారు. ఇలా ఎందుకు చేశారో అర్థంకాక ఆయకట్టు రైతులు అయోమయానికి గురవుతున్నారు. గత వారం రోజులుగా కాలువలకు పుష్కలంగా నీరు సరఫరా అవుతుండటంతో రైతులు వరి సాగును ప్రారంభించారు. బోర్ల కింద గతంలో నార్లు పోసిన వారు ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. మిగిలిన వారు నార్లు పోస్తున్నారు. ఈక్రమంలో సాగర్ కాలువల్లో నీటి పరిమాణం పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మొదట్లోనే ఇదేం పరిస్థితి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దర్శి ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : సాగర్ కాలువల్లో శనివారం నీటి పరిమాణం గణనీయంగా పడిపోయింది. ఒక్కసారిగా సరఫరా తగ్గిపోవటంతో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 4.5 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టు ఉంది. అందులో దర్శి ఎన్ఎస్‌పీ డివిజన్ పరిధిలోనే లక్ష ఎకరాలు ఉంది. సాధారణంగా దర్శి డివిజన్‌లో 60శాతం భూముల్లో వరి సాగు చేస్తారు. మిగిలిన భూముల్లో ఆరుతడి పంటలు వేస్తారు. ఈఏడాది ముందుగానే శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు పూర్తిగా నిండటంతో రైతులు ఎంతో ఆనందపడ్డారు. ఎగువన వరదలు

మిగతా 6వ పేజీలో



దర్శి ప్రాంతంలో వేస్తున్న వరినాట్లు

'ఆటల్లో అవినీతి' పై విచారణ?

ఎస్‌జీఎఫ్ నిధుల దుర్వినియోగంపై డీఈవో కిరణ్‌కుమార్ సీరియస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిధుల వినియోగంలో అవినీతికి పాల్పడిన వారిలో కలవరం మొదలైంది. నిధుల దుర్వినియోగంపై డీఈవో కిరణ్‌కుమార్ స్పందించారు. విచారణకు సిద్ధమయ్యారు. ఏజీఎఫ్ నిధుల వినియోగంలో సెక్రటరీ చేతివాటంపై శనివారం ఆంధ్రజ్యోతిలో 'ఆటల్లో అవినీతి' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై కలెక్టర్ కార్యాలయం నుంచి డీఈవోను వివరణ కోరారు. దీంతో ఎస్‌జీఎఫ్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, అలాగే సెక్రటరీపై వచ్చిన ఆరోపణలపై ఆయన సీరియస్ అయినట్లు సమాచారం. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో క్రీడాపోటీలకు ప్రభుత్వం కేటాయించిన నిధులు క్రీడాకారులకే వినియోగించగా జిల్లాలో మాత్రం అందుకు భిన్నంగా జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. వాస్తవాలు నిగ్గుతేల్చేందుకు

మిగతా 6వ పేజీలో



ఉపాధిపై ప్రభుత్వం దృష్టి

- జిల్లాలో 200 మందికి బేల్దారి పనిలో శిక్షణ
- పక్కాగృహాల నిర్మాణాల్లో వేగం పెంచే దిశగా చర్యలు

7

పాత కక్షలతో కత్తితో దాడి

- ఒకరికి తీవ్ర గాయాలు

కొని.. పక్కనే తాగేయ్!

- మందుబాబులకు పక్కాగా కిక్కు
- ఇక ఎక్కడపడితే అక్కడ తాగడం కుదరదు
- మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూంలు
- జనాభా ప్రాతిపదికన బార్ లైసెన్స్‌లు
- ఎక్సైజ్ శాఖకు ఆదాయం

ఒంగోలు క్రైం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విచ్చలవిడిగా రోడ్ల పక్కన మద్యం తాగడాన్ని ఆపడమే లక్ష్యంగా ప్రభుత్వం పాత విధానాన్ని అమలుచేయనుంది. మద్యం షాపుల పక్కనే సిట్టింగ్ కోసం పర్మిట్ రూంల ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. దీంతో మద్యం దుకాణాలు మినీ బార్లుగా మారబోతున్నాయి. రోడ్ల పక్కన మద్యం తాగి అకతాయిలు గొడవలు సృష్టిస్తున్నారు. దీంతో ప్రయాణికులు, పాదచారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పర్మిట్‌రూంల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. మందుబాబులకు మద్యం దుకాణం వద్దనే గ్లాసు, నీళ్లు, తినుబండారాలు దొరికే అవకాశం లభించింది. ఉమ్మడి జిల్లాలో 278 మద్యం దుకాణాలు ఉన్నాయి. పర్మిట్ రూంకు ప్రత్యేక లైసెన్స్ కోసం రూ.5 లక్షల చొప్పున సుమారు ఏడాదికి రూ.13.9 కోట్లు అబ్కారీ శాఖకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.



వచ్చేనెల 1 నుంచి నూతన బార్ల విధానం

రాష్ట్రంలో నూతన బార్ల విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. జనాభా ప్రాతిపాదికన బార్ల లైసెన్సులు ఇవ్వనున్నారు. ఈ విధానం వచ్చేనెల 1 నుంచి అమలులోకి రానుంది. లాటరీ పద్ధతిలో లైసెన్సులు మంజూరు చేయనున్నారు. ఈ బార్లలో కూడా గీత కార్మికులకు 10శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. 50 వేలలోపు జనాభా ఉన్న ప్రాంతంలో లైసెన్స్ ఫీజు రూ.35లక్షలు, 5 లక్షలు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, 5 లక్షలపైన జనాభా ఉన్న ప్రాంతంలో రూ.75 లక్షలు బార్లకు లైసెన్సు ఫీజుగా నిర్ణయించారు. అదేసమయంలో బారుకు కనీసం 4 దరఖాస్తులు విధిగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దీంతో ప్రస్తుతం 25 బార్లు ఉండగా ఒంగోలులో 15, మార్కాపురం 5, పొదిలి, కనిగిరి, గిద్దలూరు, దర్శి చీమకుర్తిలలో ఒక్కో బారు ఉంది. ఈ మేరకు ఒంగోలు, మార్కాపురంలలో బార్ లైసెన్స్ ఫీజు రూ.55 లక్షలు, మిగిలిన 5 ప్రాంతాలలో రూ. 35 లక్షలుగా నిర్ణయించారు. దీంతో అప్లికేషన్ ఫీజు రూ.5లక్షలుగా నిర్ణయించే అవకాశం ఉంది. అంటే ఒక్కో బార్‌కు కనీసం 4 చొప్పున 25 బార్లకు 100 అప్లికేషన్‌లు వస్తే ఫీజు రూపంలోనే రూ.5 కోట్లు లభించే అవకాశం ఉంది. లైసెన్స్ ఫీజు ద్వారా ఏడాదికి భారీగానే ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ధర తగ్గించినా ఆగని నోబిడ్లు

- కనిష్ఠ ధర కిలో రూ.140.. గతం కన్నా రూ.10 తగ్గింపు
- అయినా లోగ్రేడ్‌ల కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు



ఒంగోలు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పొగాకు మార్కెట్‌లో నోబిడ్ బేళ్లను తగ్గించేందుకు బోర్డు అధికారులు తీసుకుంటున్న చర్యలు ఏమాత్రం ఉపకరించడం లేదు. దాదాపు నెలన్నరగా కిలో కనిష్ఠ ధర రూ.150తో వేలం నడుపుతున్న అధికారులు, నోబిడ్‌లను ఆపడం కోసం ఆ ధరలను తగ్గించారు. శుక్ర, శనివారాలలో కనిష్ఠ ధర రూ.140గా పెట్టారు. అలా కిలోకు రూ.10 తగ్గించినా ఆ బేళ్లను కొనేందుకు వ్యాపారులు ముందుకు రాక నోబిడ్‌లు గణనీయంగా ఉంటున్నాయి. కనిష్ఠ ధరలు తగ్గించినప్పటికీ శుక్ర, శనివారాల్లో సగటున ఇంచుమించు 26శాతం బేళ్లు నోబిడ్ అయ్యాయి. శుక్రవారం దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాలకు 7,349 బేళ్లను అమ్మకానికి రైతులు తీసుకురాగా 4,873 కొనుగోలు చేశారు. సుమారు 33.70 శాతం బేళ్ల తిరస్కరణలు జరిగాయి. శనివారం 6,877 బేళ్లు తీసుకురాగా 4,534ను కొనుగోలు చేశారు. అంటే ఈసారి కూడా దాదాపు 34శాతం బేళ్లు తిరస్కరణలు

మిగతా 6వ పేజీలో

పీ4 సర్వేలో పట్టణాలు ఫర్వాలేదు!

ప్రథమ స్థానంలో ఒంగోలు, రెండో స్థానంలో కనిగిరి

- ఆఖరి స్థానంలో పొదిలి మునిసిపాలిటీ
- పేదరికం లేని సమాజం కోసం ప్రభుత్వం కృషి



ఒంగోలులోని గద్దలగుంటలో పీ4 సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టిన పీ4 సర్వేలో పట్టణాలు ఫర్వాలేదు అనిపించాయి. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా చేపట్టిన ఈ సర్వే జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది. పట్టణాల వరకూ చూస్తే జిల్లాకేంద్రమైన ఒంగోలు కార్పొరేషన్ ప్రథమ స్థానంలో, కనిగిరి రెండో స్థానంలో ఉంది. కాగా పొదిలి మునిసిపాలిటీ 50 శాతం కూడా పూర్తిచేయకపోవడంతో ఆఖరి స్థానంలో నిలిచింది.

పీ4 సర్వే అంటే?

స్వర్ణాంధ్రలో భాగంగా ప్రజాప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పేదరికంలో దిగువన ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించి వారి ఆర్థిక ప్రమాణాలను పెంచాలని నిర్దేశించుకుంది. అందులో

మిగతా 6వ పేజీలో

మేనమామపై మేనల్లుళ్ల దాడి

● ఆస్తి వివాదాలే కారణం

● చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడు

చీరాల, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి) : అవివాహితుడైన మేనమామను ఇంటి నుండి తరిమేసేందుకు మేనల్లుళ్లు తీవ్రంగా దాడిచేసి గాయపరి చారు. ఈఘటన శనివారం మున్సిపల్ పరిధిలోని నవాబ్ పేటలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం షేక్ లాల్‌బీకు అవివాహితుడైన షరీఫ్, ఆషా సంతానం. అయితే గతకొంత కాలం క్రితం భర్తతో విభేదించిన సోదరి ఆషా కుమారులిద్దరితో పుట్టింటికి వచ్చేసింది. అయితే ఇటీవల ఆమె భర్త రోడ్డు ప్రమాదంలో మరణించాడు. రెండు నెలల క్రిందట తల్లి లాల్‌బీ కూడా వయోభారంతో మృత్యువాత పడింది. తాజాగా సోదరితో ఇంటి హక్కు విషయమై విభేధాలు చెలరేగాయి. ఈనేపథ్యంలోనే శనివారం కర్రలతో తలపై దాడిచేయగా రక్త స్రావంతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

భార్యపై కత్తితో భర్త దాడి

● చికిత్స పొందుతూ బాధితురాలి మృతి



మృతి చెందిన సుబ్బమ్మ

సంతమాగులూరు ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : భార్యను భర్త కత్తితో నరికి ఘటన మండలం లోని ఏల్చూరు గ్రామంలో శుక్ర వారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.., సల్లూరి మేరీబాబుతో సుబ్బమ్మకు(35)కు ఇరవై ఏళ్ల క్రితం వివాహమైంది.. వారికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వివాహం తర్వాత నిందితుడు మేరీబాబుకు మద్యపానానికి బానిసయ్యాడు. దీంతో తరచూ ఇంట్లో వేధింపులకు గురిచేస్తుండడంతో సుబ్బమ్మ, ఏల్చూరు ఎస్సీ కాలనీలోని చర్చి బజారులో సొంత ఇంటిని నిర్మించుకొని తన పిల్లలతో కలిసి అక్కడే నివసిస్తోంది. అయినప్పటికీ నిందితుడు ఆమె ఇంటికి వెళ్లి వేధించడం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఇంటి ఆరుబయట మంచంపై నిద్రిస్తున్న సుబ్బమ్మపై నిందితుడు మేరీబాబు కత్తితో తలపై నరికాడు. దీంతో సుబ్బమ్మ తలపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను వెంటనే 108 వాహనం ద్వారా నర్సరావుపేటలోని వైద్యశాలకు తరించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బమ్మ మృతి చెందింది. కాలనీకి చెందిన గేరా అంజయ్య ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట్రావు తెలిపారు. నిందితుడు మేరీబాబు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

బల్లికురవ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలమవారిపాలెం గ్రామ పంచామతీ శివారు అయిన జమ్మలమడ కాలనీకి చెందిన గద్దల హనుమంత్ అను వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఓ బాలికపై అత్యాచారం చేసి గర్భవతిని చేయడంతో బాధిత మహిళ ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు

అద్దంకి,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాయపాలెంలో ఇంటి స్థలం వివాదంపై జరిగిన ఘర్షణపై పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. దిరిశాల పార్వతి, నార్నె లక్ష్మీప్రియల ఫిర్యాదుల మేరకు శనివారం రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

14న పోలేరమ్మ, అంకమ్మ ప్రతిష్ఠ మహోత్సవం

బల్లికురవ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామంలో పోలేరమ్మతల్లి, అంకమ్మతల్లి దేవాలయాల ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 14న నిర్వహించనున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో వెంకటేశ్వరస్వామి నామాల ప్రతిష్ఠ కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం నుంచి ప్రతిష్ఠ క్రతువు ప్రారంభమవుతుందన్నారు. గురువారం ఉదయం 11.58 గంటలకు ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం అన్నదానం గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బల్లికురవ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేమవరం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రానైట్ పరిశ్రమలకు వెళ్లే విద్యుత్ సరఫరాకు ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఏ సురేంద్రబాబు తెలిపారు. వేమవరం, మల్లాయపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో కోత ఉంటుందన్నారు.

గవర్నర్ నజీర్‌ను కలిసిన ఎమ్మెల్యే కొండయ్య



గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల వ్యక్తిగత పర్యటనలో ఉన్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఎమ్మెల్యే కొండయ్య మార్యద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి కుశల ప్రశ్నలు వేశారు. అయితే కొండయ్య ఎమ్మెల్యేగా అధికారం చేపట్టిన అనంతరం ఇప్పటికి చీరాల గవర్నర్ పర్యటన ఇది మూడవసారి. అయితే గతంలో రెండుసార్లు ఆ సమయంలో ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో శనివారం మొదటిసారిగా గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కొండయ్య కలిశారు.

ధర తగ్గించినా ఆగని నోబిడ్లు

(5వ పేజీ తరువాయి)

జరిగాయి. అదేసమయంలో శుక్రవారం నోబిడ్ బేళ్లు 26.29 శాతంగా ఉండగా శనివారం 25.70శాతం ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే కనిష్ఠ ధరలను బోర్డు అధికారులు తగ్గించినా నోబిడ్ బేళ్లు మాత్రం తగ్గడం లేదు. కాగా శనివారం మార్కెట్‌లో అత్యధికంగా కలిగిరి కేంద్రంలో 46.43 శాతం బేళ్లు నోబిడ్ అయ్యాయి. అలాగే పొదిలిలో 37.16 శాతం, ఒంగోలు-1లో 32.02 శాతం, కనిగిరిలో 31.27 శాతం, కందుకూరు-2లో 31.22 శాతం బేళ్లు నోబిడ్ అయ్యాయి.

పీ4 సర్వేలో పట్టణాలు ఫర్వాలేదు!

(5వ పేజీ తరువాయి)

భాగంగా పీ4 సర్వే చేయిస్తోంది. పేదరికంలో దిగువ ఉన్న వారి స్థితిగతులు తెలుసుకొని వారికి అండగా నిలిచేందుకు కొందరిని మార్గదర్శకులుగా నియమించి ఆర్థిక అసమానతలు తొలగించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. రానున్న ఐదేళ్లలో పేదరికం లేని సమాజ స్థాపన చేయాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

పీ4సర్వేలో గుర్తించిన గృహాలు

కార్పొరేషన్/మునిసిపాలిటీ	సర్వేలో గుర్తించినవి	సర్వే శాతం
ఒంగోలు	9,537	99.45%
చీమకుర్తి	1,527	85.16%
దర్శి	1,398	90.37%
గిద్దలూరు	715	49.97%
కనిగిరి	2,445	99.15%
మార్కాపురం	2,857	90.84%
పొదిలి	1,284	49.96%

జ్వరాలతో జర జాగ్రత్త

● రెండు మండలాల్లోనూ బాధితులు

● జిల్లా యంత్రాంగం ఆదేశాలతో అప్రమత్తమైన అధికారులు



ఫీవర్ సర్వేపై మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గానికి జ్వరం భయం పట్టుకుంది. గత కొద్ది రోజులుగా సుమారు నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇక టైఫాయిడ్, వైరల్‌ఫీవర్లు వెలుగు చూస్తున్నాయి. దీంతో చీరాల ఏరియా వైద్యశాలలో రోజు వారీ ఓపీల సంఖ్య సైతం పెరుగుతోంది. ఇటీవల ఇతర జిల్లాల్లో డెంగీ మరణాలు కూడా చోటు చేసుకుంటుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒకవైపు నియోజకవర్గంలో కోర్టు వివాదాల కారణంగా పంచాయతీ ఎన్నికలు జరుగలేదు. ఈ క్రమంలో నిధుల్లేక గ్రామాలు అధ్వానంగా ఉంటున్నాయి. జీతాలు అందకపోవడంతో పారిశుధ్య కార్మికులు అంతంత మాత్రంగానే విధుల్లోకి వస్తున్నారు. దీంతో గ్రామాల్లో శానిటేషన్ పూర్తిగా మూలన పడింది. రెండు రోజులుగా జిల్లా యంత్రాగం జోక్యంతో కొంత మేరకు పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నారు. ఈక్రమంలోనే శనివారం ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్‌గా గోపీకృష్ణ చీరాల మండల పరిధిలోని తోటవారిపాలెంలో ఎంపీడీవో శివన్నారాయణ, ఈవోఆర్డీ రామకృష్ణ ఆధ్వర్యంలో పారిశుధ్యంపై ప్రత్యేకడ్రైవ్ నిర్వహించారు. చెత్తసేకరణతో పాటు రహదారుల్లోని మురుగు నీటి నిల్వల ప్రాంతాల్లో బ్లీచింగ్ చేయించారు. మరోవైపు ఫీవర్ సర్వేపై ఆరా కూడా తీస్తున్నారు. అయితే మున్సిపాలి టీల్లో కూడా కొన్ని ప్రాంతాల్లో చెత్తా చెదారం, వ్యర్థ జలాలు పెరిగిపోయాయి. ఈ క్రమంలో అధికారులు ప్రజల ఆరోగ్యరీత్యా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

పారిశుధ్యాన్ని మెరుగు పరచాలి

సంతమాగులూరు : పాతమాగులూరు గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహణ మెరుగు పరచాలని జిల్లా పరిషత్ ఒంగోలు డిప్యూటీ సీఈవో, అద్దంకి నియోజకవర్గ ప్రత్యేక అధికారి బాలమ్మ అధికారులకు సూచించారు. శనివారం పాత మాగులూరు గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో పారి శుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. కాలనీలలో ఇంటింటికి వెళ్లి డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించా రు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి జిర్రా విజయ్‌బాబు, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఈవోపీఆర్‌డీ శివరాం ప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేశాం

బల్లికురవ : సీజనల్ వ్యాధులు రాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం రాత్రి మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో దోమల నివారణకు గ్రామ పంచాయతీ చేపడుతున్న ఫాగింగ్‌ను అయన పరిశీలిం చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాలలో రోడ్ల వెంబడి చెత్త, మురుగు లేకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. డెంగ్యూ జ్వరా లు రాకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో పాండురంగస్వామి, పంచాయతీ కార్యదర్శి షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అవిశన జ్యోతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలల్లో మురుగు కాలువలు శుభ్రపరచడంతో పాటు మురుగు నీరు ఎక్కడ నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోలన్నారు. అవరష్మైన ప్రాంతాలల్లో బ్లీచింగ్ చల్లాలని, అయిల్ బాల్స్ వంటివి వేయాలని సూచించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు ప్రభుత్వ పథకాలు, అమలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జ్వరాల సర్వేపై నిర్లక్ష్యం వద్దు

అద్దంకిటౌన్ : గ్రామంలో పంచాయతీ, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, డ్రైడే, జ్వరాల సర్వేపై నిర్లక్ష్యంగా వ్యహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. శనివారం మండలంలోని గోపాలపురం గ్రామంలో డ్రైడే, జ్వరాల సర్వేను ఎంపీడీవో పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఆర్‌వీఎస్ ప్రసాదరావు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : విషజ్వరాలు ప్రబలకుండా సంబంధిత శాఖాధికారులు గ్రామాలలో తక్షణ చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి అనంతరాజు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని బూదవాడ, కల్లంవారిపాలెం, చినమల్లవరం గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నీటి నిల్వ ఉన్నచోట అయిల్‌బాల్స్ వేయించి ఎబేట్ స్ప్రే చేయించారు. బూదవాడ, రామకూరు గ్రామాలలో దోమల బెడద నివారించేందుకు శనివారం పూర్తిస్థాయిలో ఫాగింగ్ చేయించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుమంత్ తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య, ఆర్.డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య, కార్యదర్శి రాంబాబు, పంచాయితీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు స్థానిక నేతలు పాల్గొన్నారు.

తిరుమలలో అన్నదానానికి కూరగాయల సరఫరా

● లారీలో 10 టన్నుల తరలింపు

● భక్తిని చాటుకున్న మిధున్ చౌదరి

నాగులపాలెం (పర్చూరు), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : తిరుమల అన్నదానానికి పర్చూరు మండలం నాగులపాలెం నుంచి శనివారం గ్రామానికి చెందిన కొత్తపల్లి మిధున్ చౌదరి 10 టన్నుల కూరగాయలను తరలించి భక్తిని చాటుకున్నారు. దీనికి సంబంధించి గ్రామస్థుల నేతృత్వంలో ప్రత్యేక లారీని ఏర్పాటు చేసి లక్షమంది భక్తులకు అన్నదానంలో వినియోగించేలా సరఫరా చేశారు. తిరుముల తిరుపతి దేవస్థానానికి కూరగాయలను తరలిస్తున్నారన్న వార్త తెలియడంతో పెద్దఎత్తున గ్రామస్థులు పాల్గొని వివిధ రకాల కూరగాయల సేకరించి లారీలో తిరుమలకు తరలించారు. విజయవాకు చెందిన శ్రీ వెంకటేశ్వర భక్తి సమాజం ఆధ్వర్యంలో కూరగాయలను స్వామివారి ఆలయానికి పంపిణీ చేస్తున్నట్లు మిధున్‌చౌదరి తెలిపారు. కార్యక్రమంలో యలమంచి ఈశ్వరరావు, సోమేపల్లి సోదరులు, కొల్లా సుభాష్‌బాబు, అడ్డగడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నాగులపాలెం నుంచి తిరుమల నిత్య అన్నదానానికి కూరగాయలను తరలిస్తున్న దృశ్యం

బస్టాండ్‌ను పరిశీలించిన రవాణా అధికారి



ఇంకొల్లు బస్టాండును పరిశీలిస్తున్న సామ్రాజ్యం

ఇంకొల్లు, ఆగస్టు 9,(ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా ఆర్టీసీ రవాణా అధికారి డి.సామ్రాజ్యం శనివారం ఇంకొల్లు బస్టాండును పరిశీలించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాల ఏర్పాట్లపై పూర్తిస్థాయిలో సమాచారం, సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా ఆమె ఇంకొల్లు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంకొల్లు మండల ప్రయాణీకుల సంఘం అధక్షులు మోహనకృష్ణ ఆమెను కలిసి సమస్యను వివరించారు. చీరాలకు ప్రస్తుతం నాలుగు సర్వీసులు మాత్రమే తిరగడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఇంకొల్లు నుంచి ప్రధాన పుణ్యక్షేత్రాలకు, విజయవాడ, బెంగుళూరుకు బస్సు సర్వీసులు నడపాలని విన్నవించారు. పావులూరు రోడ్డులోని ఆర్టీసీ డిపో స్థలాన్ని ఆమె పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న డిపో స్థలాన్ని బాగు చేయాలని చీరాల డిపో మేనేజరు శ్యామలను ఆదేశించారు. గ్రామానికి నడిబొడ్డున ఉన్న ఇంకొల్లు బస్టాండులో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు.

శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ

అద్దంకి,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం లో పౌర్ణమి సందర్భంగా శనివారం లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. శనివారం రోజే శ్రావణ మాసం పౌర్ణమి కూడా కలిసి రావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకుపూజలు, వాహనపూజలు, అర్చనలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. లక్ష తమలపాకుల పూజలో పాల్గొన్న ఉభయదాతలను సత్కరించి ఆశీర్వదించారు. గొర్రెల కాపరులు తమ గొర్రెల మందలతో వచ్చి ఆలయ ప్రదక్షణలు చేశారు.

అమ్మ ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, ఆగస్టు9:(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మ ఆశ్రమంలో శనివారం మండలంలోని వలపర్ల జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తాని కొండ రత్నకుమార్ పేదలకు, వృద్ధులకు అన్నదానం చేశారు.

ఆనందం ఆవిరి

(5వ పేజీ తరువాయి)

కొనసాగడంతో అధికారులు సాగర్ కాలువలకు కూడా నిండుగా నీరు వదిలారు. ప్రస్తుతం ప్రవాహం తగ్గడంతో సరఫరాను తగ్గించారు.

నెలాఖరుకు రెండో జోన్‌కు నీరు విడుదల

సాగర్ కుడి కాలువ పరిధిలోని రెండో జోన్‌కు అనగా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ఈనెల చివరి వారంలో కానీ, సెప్టెంబరు మొదటి వారంలో కానీ సాగుకు అధికారికంగా నీరు విడుదల చేయడం జరుగుతుందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ వదిలింది వరద నీరు అని స్పష్టం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు సాగర్ నీటి పంపిణీ వాటాలను పరిగణలోకి తీసుకొని అందుకు అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంది. సాగర్ కుడి కాలువకు ప్రభుత్వం 132 టీఎంసీల నీటిని కేటాయించింది. అందులో మొదటి జోన్‌కు 57శాతం, రెండో జోన్ పరిధిలోని ఉమ్మడి ప్రకాశంకు 43శాతం నీరు సరఫరా చేస్తారు. ఈ నిబంధనలకు అనుగుణంగానే అధికారులు తొలి జోన్‌కు విడుదల చేసిన నెలరోజుల తర్వాత రెండో జోన్‌కు సరఫరా చేస్తారు. అందుకు అనుగుణంగానే ఆగస్టు చివరి వారంలో కానీ, సెప్టెంబరు మొదటి వారంలోకానీ రెండవ జోన్‌కు అధికారికంగా నీరు విడుదల చేసి మార్చి వరకు అందించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

గుంటూరుకు మాత్రమే సాగునీరు

ప్రస్తుతం సాగర్ కాలువలకు ఎందుకు నీరు విడుదల చేశారని అధికారులను అడగ్గా వరద నీరు వృథాగా సముద్రంలోకి వెళ్తుండటంతో మంచినీటి చెరువులకు, ఇతర అవసరాలకు ఉపయోగించుకుంటారనే ఉద్దేశంతో విడుదల చేసినట్లు తెలిపారు. ఇప్పుడు వరద నీరు తగ్గడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు వద్ద (ప్రకాశం బార్డర్) నీటి పరిమాణం పూర్తిగా తగ్గించినట్లు చెప్పారు. ప్రస్తుతం మొదటి జోన్ పరిధిలోని గుంటూరు జిల్లాకు మాత్రమే పంటల సాగుకు నీరందిస్తున్నట్లు తెలిపారు. రెండో జోన్‌కు ఈనెల చివరి వారంలో లేదా సెప్టెంబర్ మొదటి వారంలో నీరు విడుదల చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈవిషయాన్ని అధికారులు ముందుగానే తెలపకపోవడంతో కాలువలకు పుష్కలంగా రోజులు తరబడి నీరు సరఫరా కావడంతో సాగుకు నీరు విడుదల చేశారనే ఉద్దేశంతో రైతులు ముమ్మరంగా వరినాట్లు వేసే కార్యక్రమం చేపట్టారు. ఈ పరిస్థితుల్లో సాగర్ జలాల సరఫరా ఆపివేస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.


వరినారు ఎండిపోతోంది



సాగర్ కాలువలకు వారంరోజులుగా నీరు సరఫరా అవుతుండటంతో పైర్లు సాగు చేసుకోవచ్చనే ఉద్దేశంతో వరి నార్లు పోశాం. అకస్మాత్తుగా కాలువకు నీటి పరిమాణం తగ్గింది. ప్రధానంగా ఒంగోలు బ్రాంచ్ కాలువకు రెండు రోజుల క్రితం కట్టలు పొర్లిపోయేలా నీరు విడుదల చేసిన అధికారులు ఇప్పుడు పూర్తిగా తగ్గించారు. వరి నార్లు వేసుకునే రైతులకు నీటి సరఫరా ఎందుకు నిలిచిపోయిందో అర్థంకాక అల్లాడుతున్నారు. వెంటనే సాగుకు నీరు విడుదల చేసి నష్టపోకుండా చూడాలి.

- మారం వెంకటేశ్వరరెడ్డి, తూర్పుచౌటపాలెం

లేత వరినాట్లు దెబ్బతింటున్నాయి



సాగర్ కుడికాలువకు నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. తాము బోర్ల కింద కొద్దిరోజులు క్రితం నార్లు పోశాం. సాగర్ కాలువలకు పుష్కలంగా నీరు విడుదల చేయడంతో పంటల సాగుకు అందిస్తున్నారన్న ఉద్దేశంతో వరి నాట్లు వేశాం. అధికారులు ఆకస్మికంగా నీరు నిలపడంతో ఇబ్బందిపడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఎండలు వేసవిని మరిపిస్తున్నాయి. లేత వరినాట్లకు నీరు లేకపోతే ఎండిపోయే ప్రమాదం ఉంది.

- ఆకుల రాంబాబు, చెరువుకొమ్ముపాలెం

కోలాహలంగా పోలేరమ్మ తల్లి కొలుపులు

పంగులూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమంజులూరులో గ్రామదేవత పోలేరమ్మతల్లి కొలుపులు శనివారం ఘనంగా నిర్వహించారు. తమ ఇష్టదైవంగా భావించే పోలూరమ్మకు పొంగల్లు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రెండవ రోజు ఆదివారం అమ్మవారి పూజాకార్యక్రమాల అనంతరం గ్రామంలో భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు కరణం రామారావు, పెంట్యాల ఆంజనేయులు తెలిపారు.

పైసలిస్తేనే పనులు

(5వ పేజీ తరువాయి)

చూపుతోంది. అయితే ఆ భూములను విజయవాడ ప్రాంతానికి చెందిన కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు 2019-22 మధ్య కొనుగోలు చేశారు. సమభాగాలుగా రావాల్సిన భూమిలో కొందరి పేరుపై ఐదు ఎకరాలు, మరికొందరి పేరుతో ఆరు ఎకరాలు చూపి ఆన్‌లైన్ చేయించుకున్నారు. అసలు హక్కుదారులు కాని వారు కూడా భూములను విక్రయించగా కొనుగోలు చేసిన వారి పేర్లు ఆన్‌లైన్‌లో చేర్చారు. ఈ వ్యవహారంలో భారీ మొత్తంలో చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనికి సూత్రధారులుగా పనిచేసిన అధికారులకు గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రజాప్రతినిధులు అండగా నిలిచారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మారెళ్ల పంచాయతీ పరిధి గంగన్నపాలెంలో ఇద్దరి మధ్య ఏర్పడిన భూవివాదంలో కూడా పెద్దఎత్తున నగదు చేతులు మారింది. ఈవిషయమై ఒక వర్గం వారు ఇటీవల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని కలసి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఇంకా మండలంలోని పలు గ్రామాల్లో భారీ ఎత్తున రికార్డులు తారుమారు చేసి అర్హులైన భూ యజమానులకు సైతం అన్యాయం చేశారు. వీరిలో కొందరు కోర్టులను కూడా ఆశ్రయించారు.

శంకరాపురం గ్రామ 1బీ రికార్డు మాయం

మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన సంబంధించి మాన్యువల్ 1బీ రికార్డు మాయమైంది. గ్రామానికి చెందిన మేడికొండ కృష్ణారావు తమకు అన్యాయం జరిగిందంటూ హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా 2018 నుంచి 2022 వరకు పనిచేసిన అధికారులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో ప్రస్తుత తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు ఆ సమయంలో పనిచేసిన ఇద్దరు తహసీల్దార్‌లు, ఇద్దరు డీటీలు, అప్పట్లో పనిచేసి ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేసి ఉన్న ఒక వీఆర్వోపై పోలీసు స్టేషన్ కేసు నమోదు చేశారు. ఇటీవల అనేక మంది భూములు కొన్న వ్యాపారులు తహసీల్దార్ కార్యాలయంలో వీ ఆర్వోలను ఆశ్రయించి పనులు చేయించుకుంటున్నారు.

రీసర్వేలో తప్పుల తడకలు

రీసర్వేతో చాలామంది రైతుల పొలాల విస్తీర్ణం తగ్గింది. తమ భూమి తగ్గిందంటూ బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దీన్ని ఆసరా చేసుకొని వీఆర్‌వోలను, సర్వేయర్లు అందినకాడికి దండుకుంటున్నారు.రికార్డుల్లో విస్తీర్ణం సరి చేస్తామంటూ వేలాది రూపాయలు గుంజుకుంటున్నారు.

ఫిర్యాదులు అందితే చర్యలు

- ఎల్.లక్ష్మీనారాయణ, తహసీల్దార్, ముండ్లమూరు

మండలంలో వీఆర్వోలు కానీ, గ్రామ సర్వేయర్‌లుకానీ పనులు చేస్తామంటూ నగదు తీసుకున్నట్టు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరూ పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. న్యాయబద్ధంగా ఉంటే పనిచేస్తారు. ఎవరైనా డబ్బులు తీసుకున్నట్టు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే సస్పెండ్‌కు సిఫార్సు చేస్తా.

రేపు జార్జి ఫార్మసీ కాలేజీలో జాతీయ స్థాయి వర్క్‌షాప్

మార్కాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు రోడ్డులోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఫార్మసీ కాలేజీలో ఈ నెల 11న జాతీయ స్థాయి వర్క్‌షాప్ జరుగనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ప్రసన్నకుమార్ తెలిపారు. కాలేజీలో శనివారం జరిగిన కార్యక్రమంలో వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విస్కోసిటీ అండ్ రియోలజీ అనే అంశంపై ఈ వర్క్‌షాప్ జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ వర్క్‌షాప్ ద్వారా ఫార్మాస్యూటికల్, ఇతర సైన్స్ ఫీల్డ్స్‌లో విస్కాసిటీ, రియాలజీ కొలతల ప్రాముఖ్యాన్ని ప్రాక్టికల్‌గా నేర్చుకునే అవకాశం పొందుతారన్నారు. పరిశ్రమల్లో ఉపయోగించే బ్రూక్ ఫీల్డ్ విస్కోమీటర్‌పై శిక్షణ పొందడం ద్వారా వారి ప్రాక్టికల్ నైపుణ్యాలు, పరిశోధన సామర్థ్యం, ఉద్యోగావకాశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఈ వర్క్‌షాప్‌నకు కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ దిశానిర్దేశం చేస్తారన్నారు. కార్యక్రమంలో కోకన్వీనర్‌లు ఎస్‌డీ ముహీబ్ రెహమాన్, బి.శ్రీనిధి, అకడమిక్స్ డీన్ డాక్టర్ వై.సునీత, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.అశోక్ బాబు, ఆఫీస్ అడ్మినిస్ట్రేటర్ కె.కృపాల్ పాల్గొన్నారు.



వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్, అధ్యాపకులు

పీహెచ్‌డీ స్కాలర్‌ల సమావేశం

స్థానిక జార్జి ఫార్మసీ కాలేజీలో శనివారం పీహెచ్‌డీ స్కాలర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పీహెచ్‌డీ పరిశోధనలో నాణ్యతను పెంపొందించాలన్నారు. నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం కల్పించాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పబ్లికేషన్‌లు సాధించే దిశగా మార్గదర్శనం చేయాలన్నారు. కాలేజీలోని డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు రీసెర్చి ఫోరంను సమర్థంగా ఉపయోగించుకోవాలని సూచించారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ పరిశోధనలో శ్రద్ధ, కృషి, సృజనాత్మకత ద్వారా ప్రపంచస్థాయి ఫలితాలు సాధించవచ్చన్నారు. అందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కాలేజీ సమకూరుస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వై.సునీత, డాక్టర్ కె.అశోక్‌బాబు పాల్గొన్నారు.

'ఆటల్లో అవినీతి'పై విచారణ?

(5వ పేజీ తరువాయి)

విచారణకు సిద్ధమయ్యారు. గత ఏడాదిలో నిర్వహించిన క్రీడాపోటీలకు మంజూరైన నిధులు, వాటి వినియోగంపై లెక్కలు తేల్చనున్నారు. సెక్రటరీ బ్యాంకు ఖాతాల పరిశీలనతోపాటు కోఆర్డినేటర్‌లను, పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను విచారించనున్నట్లు సమాచారం. ఇదిలాఉండగా నిధుల దుర్వినియోగంలో చేతివాటం చూపిన ఎస్‌జీఎఫ్ సెక్రటరీ తనపై వచ్చిన ఆరోపణలను కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు ఇప్పటికే మొదలుపెట్టినట్లు సమాచారం. మండల కోఆర్డినేటర్‌లతో ఫోన్‌లో మాట్లాడటంతోపాటు క్రీడాపోటీలకు నిధులు ఖర్చుచేసినట్లు బిల్లులు తయారుచేసే పనిలో ఉన్నట్లుగా తెలిసింది.



నవ ధాన్యాలతో అర్చన చేస్తున్న పూజారులు

అమ్మవారికి నవధాన్యార్చన

త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారికి నవధాన్యార్చన కార్యక్రమం నిర్వహించారు. ఉభయదేవాలయాల్లో జరిగిన ఈ ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

- త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి



పెద్దారవీడులో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

పదేళ్లుగా ఇవే పాట్లు

పెద్దారవీడులోని పడమటిపల్లి దేవస్థానం వద్ద పదేళ్ల క్రితం సిమెంట్ రోడ్డు నిర్మాణం జరిగింది. రోడ్డు నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ లేదు. దీంతో కాంట్రాక్టర్లు ప్రమాణాలను పాటించకుండా రోడ్డు నిర్మాణం చేశారు. అంతేకాక ఆ రోడ్డుకు ఇరువైపులా మురుగు నీటి కాల్వల నిర్మాణం జరగలేదు. దీంతో చిన్నపాటి వర్షానికి రోడ్డుపై నీరు నిలబడిపోతోంది. ఆ రోడ్డు మీదుగానే గ్రామంలో 90 శాతం మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంది. వారందరికీ ముఖ్యంగా మార్కాపురం వెళ్లే కాలేజీ, స్కూళ్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రజాప్రభుత్వంలోనైనా రోడ్డుకు మరమ్మతులు చేసి వాన నీరు నిల్వ ఉండకుండా చేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

- పెద్దారవీడు, ఆంధ్రజ్యోతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

- కనుమళ్ల రన్‌వేపై ఘటన

సింగరాయకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతున్న వ్యక్తిని కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన కనుమళ్ల జాతీయ రహదారి (రన్‌వేపై) శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. టంగుటూరు మండలం వెలగపూడి గ్రామానికి చెందిన గుంతటి సింగయ్య (53) స్వగ్రామం నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు బస్సుకోసం స్నేహితుడితో కలిసి కనుమళ్ల జాతీయ రహదారి వద్దకు చేరుకున్నాడు. రోడ్డుదాటుతుండగా వేగంగా నెల్లూరు వైపు వెళ్తున్న కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు సింగయ్యను బలంగా ఢీకొట్టింది. దీంతో అతను గాల్లోకి లేచి రోడ్డుపై పడ్డాడు. తలకు తీవ్రగాయాలవడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్సై బి.మహేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కుంటలో మృతదేహం ఎవరిది?

ఒంగోలు క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఎన్.అగ్రహారం సమీపంలో హత్యకు గురై నీటి కుంటలో తేలాడుతున్న గుర్తుతెలియని యువకుడు ఎవరు అనేది తెలియాల్సి ఉంది. ఈమేరకు ఒంగోలు తాలుకా పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు. సుమారు గా 25 నుంచి 30 ఏళ్ల వయసుగల యువకుడు నల్లటి షార్టు వేసుకొని ఉన్నాడు. అతని మెడలో నల్ల రంగు తాడుకు తాయత్తు కట్టి ఉంది. ఇతని గురించి తెలిసినవారు ఒంగోలు తాలుకా సీఐ 9121102127,9121104780 నంబర్లకు వివరాలు తెలియజేయాలని ఒంగోలు తాలూకా సీఐ విజయకృష్ణ కోరారు.

పండ్ల తోటల సాగుపై ఆసక్తి

ఉపాధి పథకం ద్వారా పండ్ల తోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఖాళీ భూముల్లో మొక్కల పెంపకానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నది. మొక్కలు, ఎరువుల సరఫరా దగ్గర నుంచి ప్రతి పనికీ మూడేళ్ల పాటు సాయం అందిస్తుంది. సన్న, చిన్న కారు రైతులకు ఆసరాగా నిలిచేందుకు పలు రకాల పండ్ల మొక్కలు (బత్తాయి, నిమ్మ, దానిమ్మ, నేరేడు, కొబ్బరి, జామ తదితర), రెండు రకాల పూల మొక్కలు పెంచుకునేందుకూ అవకాశం కల్పిస్తున్నది.

- మూడేళ్లపాటు ప్రభుత్వం ఆర్థిక సాయం
- నియోజకవర్గ పరిధిలో 1300 ఎకరాల లక్ష్యం
- మట్టి స్థాయిని బట్టి పెంపకం
- మొగ్గుచూపుతున్న రైతులు

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) :ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎక్కువ శాతం నీటి వసతి లేకపోవడంతో పూల మొక్కలపై రైతులు ఆసక్తి చూపడం లేదు. మిగిలిన పండ్ల తోటలపై (నిమ్మ, బత్తాయి, దానిమ్మ, జామ) ఆసక్తి చూపడంతో వారికి ఆయా పరిసర ప్రాంతాలలో అనుకూలతను బట్టి మొక్కలను అధికారులు సూచిస్తున్నారు.

మొక్క రకాన్ని బట్టి సాయం

రైతులు వారికి నచ్చిన మొక్కలు నాటి తిరిగి పంట చేతికొచ్చేంత వరకూ మూడేళ్లు పెట్టుబడి ప్రభుత్వమే భరిస్తుంది. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులు ఈ పథకాలకు అర్హులు. మొక్క కొనుగోలు, గొయ్యి తవ్వకం, మొక్క పాతడం తదితర వాటికి నగదు చెల్లిస్తుంది. వాటి పోషణకు కూడా నెలనెలా సాయం అందజేస్తుంది. నియోజకవర్గ పరిధిలోని ఎర్రగొండపాలెంలో 300ఎకరాలు, త్రిపురాంతకంలో 300 ఎకరాలు, పుల్లలచెరువులో 300 ఎకరాలు, దోర్నాలలో 200 ఎకరాలు, పెద్దారవీడులో 200 మొత్తం 1300 ఎకరాల్లో సాగు చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు మార్కాపురం ఏపీడీ నిర్మలదేవి తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో మట్టి సాయిల్ పరీక్షలు వచ్చాక నాటేందుకు అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. మట్టి పరీక్షల ఆధారంగా ఏ పంట బాగుంటుందని చూసి ఆ పంటలు సాగు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు ఆమె తెలిపారు.



అమానిగుడిపాడు గ్రామంలో రైతుల పొలంలో మొక్కలు నాటుతున్న ఉపాధి హామీ సిబ్బంది

సర్టిఫికెట్ కోసం తప్పని తిప్పలు

అయితే ప్రభుత్వం రైతులను ప్రోత్సహించి వారిని ఆర్థికంగా భలోపేతానికి సాయం చేస్తుంటే కొంత మంది అధికారులు రైతులను పలు రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పండ్ల తోటలు సాగు చేయాలంటే సన్న, చిన్న కారు రైతు అని రెవెన్యూ అధికారులు సర్టిఫికెట్ చేయాల్సి ఉంది. ఇదే అదునుగా భావించిన కొంత మంది రెవెన్యూ అధికారులు, సిబ్బంది రైతులను పీడిస్తూ పైసా వసూల్ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పైసా ఇస్తేనే ఫైల్‌పై సంతకం లేకుంటే రేపు రా.. మాపు రా.. అంటూ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని రైతులు చెప్తున్నారు. ఒక చిన్న సంతకం కోసం (రూ.100కి కూడా) కక్కుర్తి పడి రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం ఏమిటని రైతులు, పలువురు రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చెర్లోతాండాలో నిమ్మ మొక్కలు నాటుతున్న రైతులు

రైతులు వినియోగించుకోవాలి

- నిర్మలాదేవి, ఏపీడీ

చిన్న, సన్నకారు రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పండ్ల మొక్కలు నాటడం వలన మేలు చేకూరుతుంది. నియోజకవర్గ పరిధిలో ఎవరైనా సాగు చేసుకోవాలనే రైతులు స్థానిక ఉపాధి హామీ పథకం సిబ్బందిని లేదా నేరుగా ఆయా మండలాల ఏపీవోలను సంప్రదించాలి.

ఉపాధి పై ప్రభుత్వం దృష్టి

- జిల్లాలో 200 మందికి బేల్దారి పనిలో శిక్షణ
- పక్కా గృహాల నిర్మాణాల్లో వేగం పెంచే దిశగా చర్యలు



ఒంగోలు నగరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నిర్మాణ రంగంలో అనేక ఉపాధి అవకాశాలు ఉంటున్నాయి. ఇందులో బేల్దారు పనిచేసే వారికి భూమిక కీలకమయ్యింది. ఉపాధి అవకాశాలు మెండుగా ఉండే బేల్దారి పనిలో శిక్షణ తీసుకుంటే వారి జీవనోపాధికి ఎలాంటి ఢోకా ఉండదని భావించిన ప్రభుత్వం జిల్లాలోని 200 మందికి బేల్దారి పనిలో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సులోపు ఉండి బేల్దార్ పని నేర్చుకునేందుకు ఆసక్తి ఉన్న వారిని గుర్తించి వారికి జిల్లాలోనే నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మందికి శిక్షణ ఇచ్చి వారిని నిర్మాణ రంగంలో భాగస్వాములను చేయనున్నారు. ఈ శిక్షణ ఇచ్చేందుకు ఔత్సాహికులను గుర్తించే బాధ్యత, శిక్షణ పర్యవేక్షణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం గృహనిర్మాణ సంస్థకు అప్పగించింది. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ ఇచ్చేందుకు వివిధ సంస్థలను ఇప్పటికే ఎంపిక చేసిన ప్రభుత్వం జిల్లాలో శిక్షణ ఇచ్చేందుకు ఒంగోలు భాగ్యనగర్ ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న రూడ్‌సెట్ సంస్థను ఎంపిక చేసింది. గృహ నిర్మాణ శాఖ అధికారులు గుర్తించే జిల్లాలోని 200 మందికి బేల్దార్ శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ఈ నెలాఖరు నుంచే ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక చేసే వారిలో ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద పక్కా గృహం మంజూరైన వారికి ప్రాధాన్యత ఇవ్వాలంటూ ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి.



నెలరోజుల పాటు శిక్షణ

కేంద్ర ప్రభుత్వం ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇచ్చిన సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమం చేపట్టబోతోంది. జిల్లాలో ఈ శిక్షణ కోసం గృహ నిర్మాణశాఖ అధికారులు గుర్తించిన 200 మందికి 30 నుంచి 40 మందిని ఒక్కో బ్యాచ్‌గా ఏర్పాటు చేసి నెల రోజుల పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ సమయంలో వారికి వసతి, భోజనసౌకర్యాలను కల్పించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణాలు ప్రభుత్వ నిబంధనల మేరకు జరిగేలా వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ తీసుకునేందుకు ఆ సక్తి ఉన్న యువత ఆయా మండలాల్లోని గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్‌కు గాని లేదా జిల్లా గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబరు 7093930922కు గాని వివరాలను తెలియజేయాలని కోరారు.

పాత కక్షలతో కత్తితో దాడి

ఒకరికి తీవ్ర గాయాలు



వెంకటేశ్వర్లు కుమారుడు శ్రీనును విచారిస్తున్న సీఐ రామారావు (ఇన్‌సెట్లో) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నల్లబోతుల వెంకటేశ్వర్లు

ముండ్లమూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకరవారిపాలెం గ్రామంలో నల్లబోతుల వెంకటేశ్వర్లును శుక్రవారం రాత్రి నల్లబోతుల వీరాంజనేయులు కత్తితో దాడిచేశారు. తీవ్రంగా గాయ పడిన వెంకటేశ్వర్లును అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. గతేడాది మే నెలలో నల్లబోతుల బ్రహ్మయ్యను స్వయాన బంధువైన నల్లబోతు వెంకటేశ్వర్లు దాడిచేయడంతో మృతి చెందాడు. ఆ కేసులో వెంకటేశ్వర్లు జైలుకు వెళ్ళి బెయిల్‌పై ఇటీవలే విడుదలై వచ్చారు. శుక్రవారం రాత్రి గ్రామంలో సీతారామాలయం ప్రతిష్ఠ సందర్భంగా కోలాటం ప్రదర్శిస్తున్నారు. వెంకటేశ్వర్లు, మరికొందరు కోలాటం చూసేందుకు వెళ్తుండగా బ్రహ్మయ్య చిన్న కుమారుడు వీరాంజనేయులు కత్తితో విచక్షణా రహితంగా వెంకటేశ్వర్లు గొంతుపై, చాతి పై పొడిచాడు. అడ్డు వచ్చిన మీనగ నాగేంద్రం చేతికి కూడా గాయమైంది. వెంకటేశ్వర్లు మృతిచెందాడని భావించి అక్కడినుంచి వీరాంజనేయులు, మరికొందరు వెళ్ళి పోయారు. దీంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. విషయం తెలుసుకున్న దర్శి సీఐ వై.రామారావు, ముండ్లమూరు ఎస్ఐ కె.కమలాకర్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన నాగేంద్రాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు కుమారుడు శ్రీనును, కుమార్తెలను కక్షలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ కె.కమలాకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెట్ ఏర్పాటుచేశారు.

సమాజాభివృద్ధికి శాస్త్రీయ దృక్పథం అవసరం

- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సమాజాభివృద్ధికి శాస్త్రీయ దృక్పథం ఎంతో అవసరమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభ గిద్దలూరులోని ఎస్ ఎస్ ప్లాజాలో శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాల వలన అనర్థాలు ఎదుర్కోవలసి వస్తుందని పేర్కొన్నారు. శాస్త్రీయ దృక్పథంతో ముందుకు పోతే త్వరితగతిన అభివృద్ధి సాధించవచ్చని అన్నారు. విద్య ద్వారా మూఢనమ్మకాలను పారదోలవచ్చన్నారు. ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందిస్తున్న జనవిజ్ఞాన వేదిక సంస్థను అభినందించారు. జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు ఏటా 10లక్షల మందికి చెకుముకి ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18వ మహాసభల సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా జేవీవీ నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పి.స్వరూపారెడ్డి, జి.మురళీధర్, జిల్లా కమిటీ నాయకులు ఝాన్సీపాల్, సుబ్రమణ్యం, శ్రీనివాసులు బాలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



గిరిజన భవన్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఆయా శాఖల అధికారులు

ఆదివాసీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఒంగోలునగరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు ప్రభుత్వ పథకాలు, చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని వక్తలు అన్నారు. ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక గిరిజన భవన్‌లో జరిగిన సభలో వారు మాట్లాడారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి వరలక్ష్మి అధ్యక్షతన ఆదివాసీల దినోత్సవం జరిగింది.ఈ సభలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు మాట్లాడుతూ ప్రభుత్వం పేదరికం నిర్మూలన కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. వారి రక్షణ కోసం అనేక చట్టాలు అ మల్లో ఉన్నాయన్నారు. వీటి పట్ల ఆదివాసీల్లో అవగాహన పెంపొందించేందుకు గిరిజనసంఘాల నాయకులు కూడా తమ వంతు కృషి చేయాలని ఆ యన పిలుపునిచ్చారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఆదివాసీలు నాగరిక సమాజంలో భాగస్వాములు కావాలన్నారు. అధిక సంతానం వల్ల జరిగే అనర్థాలను వారు గుర్తించాలన్నారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులకు సంఘాల నాయకులు రూ.5 వేల వంతున ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో గి రిజన ప్రజాపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ బాలాజీనాయక్, గిరిజన సంగం నాయకులు సైదాని నాయక్, చెంచుల సంఘం నాయకులు చెవుల చెంచయ్య, మంతన్న, యానాది సంఘం నాయకులు ఇండ్ల సుజాత, జాలయ్య, డాక్టర్ లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన నవీన్ ఆచూకీ లభ్యం

ఒంగోలు క్రైం,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): గత నెల 27న కొత్తపట్నం పోలీసు స్టేషన్‌లో అదృశ్యం అయిన ధన్యాశి నవీన్ ఆచూకీ లభ్యమైనట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. కరీంనగర్ లో ఉన్న నవీన్ భార్యను విచారించిన పోలీసులకు ఆధారాలు దొరికాయి. అంతే కాదు అతని భార్యతో ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు నిర్ధారించుకున్నారు. దీంతో నవీన్ అదృశ్యం కేసుకు తెరపడిందని పోలీసులు చెబుతున్నారు..

ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను చెల్లించాలి

● ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ



మాట్లాడుతున్న బాలాజీ

ఒంగోలు(విద్య) ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.30వేలకోట్ల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో జరిగిన ఆపస్ రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏను వెంటనే మంజూరు చేయాలన్నారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ.సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఉమ్మడిసర్వీస్ రూల్స్ అమలులో ఉన్న ఇబ్బందులను తొలగించి ఎంఈవోలు, డైట్ లెక్చరర్లకు ప్రమోషన్‌లు ఇవ్వాలని కోరారు. సంఘటనా కార్యదర్శి సీహెచ్.శ్రావణకుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు యాప్‌లు భారం తగ్గించాలని కోరారు. సమావేశంలో ఏపీఆర్ఎస్ఎం జాతీయ సంఘటన మంత్రి గుంత లక్ష్మణ్‌జీ, 26 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్రకార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రక్షాబంధన్ వేడుకలు

● ఎస్పీ, మాజీ సైనికులకు రాఖీలు కట్టిన బీజేపీ మహిళా మోర్చా నాయకులు



మాజీ సైనికులకు రాఖీలను కడుతున్న మహిళా నాయకులు

ఒంగోలు(కల్చరల్)/ఒంగోలు(రూరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగను శనివారం జిల్లావ్యాప్తంగా ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ అక్క, చెల్లెళ్ల చేత రాఖీలు కట్టించుకుని తమ శక్తికొద్దీ బహుమతులు అందజేశారు. అదేవిధంగా ఒంగోలు నగరంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు స్థానిక కర్నూల్ రోడ్డులోని సైనిక దళ కార్యాలయంలో మాజీ త్రివిధ దళ సైనికులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. దేశరక్షణలో భాగస్వాములవుతున్న సైనికులు ప్రతి ఒక్కరికీ సోదరులవంటి వారన్నారు. దేశ, ప్రజల రక్షణకోసం సరిహద్దుల్లో నిరంతరాయంగా పని చేసే సైనికులను మనం గౌరవించుకోవాలన్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకోవాలని కోరారు. పహల్గాం ఘటనకు కారణమైన పాకిస్తాన్ తీవ్రవాదులును మన దేశ సైనికులు మట్టుపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బి.విజయారావు, తీగల సరస్వతి, ధనిశెట్టి పావని, మాజీ సైనికులు చుండూరి శ్రీరామూర్తి, క్యాంటీన్ మేనేజర్ గుమ్మడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్పీ దామోదర్‌కు సైతం వారు రాఖీని రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు అందజేశారు. అదేవిధంగా నగరంలోని వివిధ పాఠశాలల్లో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి.

బీసీ హాస్టల్ తరలింపును విరమించుకోవాలి

● ఎస్ఎఫ్ఐ, బీసీ సంఘాల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కనిగిరిలోని బీసీ బాలుర హాస్టల్-2 తరలింపును తక్షణమే నిలుపుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖ అధికారులు ఇష్టానుసారం వ్యవహరించటం తగదన్నారు. కనిగిరిలోని బీసీ బాలురు హాస్టల్‌లో విద్యార్థులు పూర్తిస్థాయిలో ఉన్నారని, ఈక్రమలో హాస్టల్‌ను ఇమ్మడిచెరువు గ్రామానికి తరలిస్తామనడం అసంబద్ధంగా ఉందని విమర్శించారు. కనిగిరి ప్రాంతంలోని వసతిగృహాలలో 10మందికంటే తక్కువ ఉన్న హాస్టల్స్ ఉన్నాయని, అలాంటి వాటిని ఇమ్మడిచెరువు గ్రామానికి తరలించుకోవాలన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కనిగిరిలోనే హాస్టల్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీహెచ్.వినోద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బంకా చిరంజీవి, చేతివృత్తిదారుల కమిటీ జిల్లా కార్యదర్శి రావెల మాలకొండయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్, ఏపీజేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్, నాయకులు కోటేశ్వరరావు, ఆనంద్, రాజశేఖర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలి

● రైతు సంఘం నాయకులు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం స్వామినాథన్ సిపార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని ఎల్బీజీభవన్‌లో స్వామినాథన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు జుజ్జూరి జయంతిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వి.కృష్ణయ్య మాట్లాడుతూ స్వామినాథన్ సిపార్సులు వ్యవసాయరంగానికి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. వ్యవసాయరంగ అభివృద్ధి వాటి అమలుతోనే సాధ్యపడుతుందన్నారు. పేదల చేతుల్లో వ్యవసాయ భూములు ఉండాలని, ప్రాజెక్టులు కట్టాలని, రైతులకు అతితక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలనే స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, నాయకులు పెంట్యాల హనుమంతరావు, శ్రీకాంత్, కొల్లూరి వెంకటేశ్వర్లు, గాలి వెంకట్రామిరెడ్డి, ఏడుకొండలు, సంతు వెంకటేశ్వర్లు, ప్రసాద్, రాజశేఖరరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో చిల్లచెట్ల తొలగింపు



పనులను ప్రారంభిస్తున్న గ్రామస్థులు

టంగుటూరు (కొండపి), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎం.నిడమలూరు గ్రామంలోని చెరువు చుట్టూ చిల్లచెట్లు మొలిచి ఇబ్బందికరంగా మారాయి. ఈనేపథ్యంలో టీడీపీ నాయకులు కాకుమాని శ్రీను (రామన్నగారి శ్రీను), బోడపాటి అంజిబాబు సొంత నిధులతో జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో చెట్లను తొలగించే పనులు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పుచ్చకాయల శ్రీరామ్మూర్తి, కాకుమాని చంద్రశేఖర్, బెజవాడ సింగయ్య, సుబ్బారావు, పిడుగురాళ్ల సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

15న భక్తప్రహ్లాద నాటక ప్రదర్శన



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన భక్తప్రహ్లాద నాటకం ప్రదర్శన ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షుడు సూదనగుంట వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూములో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను రచించి, దర్శకత్వం వహిస్తున్న ఈ నాటకంలో సుమారు 50మంది నృత్య కళాకారిణులు పాల్గొంటున్నారని, ఇటువంటి ప్రక్రియ రెండు తెలుగురాష్ట్రాలలో ఇంతవరకు జరగలేదన్నారు. నృత్య కళాకారిణులు తొలిసారిగా సంభాషణలతో నాటకాన్ని ప్రదర్శిస్తారని చెప్పారు. నాటకంలో పాల్గొంటున్న వారు ఇంజనీరింగ్, డిగ్రీ, ఇంటర్ విద్యార్థులన్నారు. అంతేకా ప్రత్యేక ఆకర్షణగా సురభి సంస్థ ఎఫెక్ట్‌లు నిలుస్తాయన్నారు. సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో ఆవరణలో నాటక ప్రదర్శన సాయంత్రం 6.30లకు ప్రారంభం అవుతుందని, ముందుగా సినీ సంగీత విభావరి ఉంటుందని పేర్కొన్నారు. కనుక కళాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో కొత్రగడ్డ రఘుపతిరావు, శ్రీపతి పేరయ్య, ఐనంపూడి నరసింహారావు, దాసరి నరేష్, గారె కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా రూ.100 కోట్లు అవినీతి జరిగిందని, దీనిపై కూటమి ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆటియా పాటియా అసోసియేషన్ సీవోఆర్డీ ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పటి క్రీడాశాఖ మంత్రి రోజా, శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అన్నీ జిల్లాల డీఎస్‌డీవోలు కూడా అవినీతిలో భాగస్వాములుగా ఉన్నారని ఆరోపించారు. అందులో భాగంగా జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారిణిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ హయాంలో అవినీతికి పాల్పడిన వారు ఇంకా కొనసాగుతున్నారని, వాస్తవాలు నిగ్గు తేల్చాలని కోరారు. కార్యక్రమంలో టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ పాల్గొన్నారు.

చెన్నకేశవ, రంగనాథ ఆలయ ఛైర్మన్‌గా రుద్రయ్యచౌదరి

ఎస్ఎన్‌పాడు, ఆగస్టు 9ఆంధ్రజ్యోతి) : పేర్నమిట్టలో ఎన్టీఆర్ కళాక్షేత్రం సమీపంలో ఉన్న శ్రీచెన్నకేశవ, రంగనాథస్వాముల ఆలయ ఛైర్మన్‌గా శిఫురపు రుద్రయ్యచౌదరి, కమిటీ పాలకవర్గంతో శనివారం ఒంగోలు డివిజన్ ఎండోమెంట్ అధికారి సీహెచ్.వేణుగోపాల్ ప్రమాణం చేయించారు. ఆలయ అర్చకులు ఎక్స్ అఫిషియల్ మెంబర్‌గా పరాంకుశం రామక్రిష్ణామాచార్యులు ప్రమాణం చేశారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఛైర్మన్ రుద్రయ్యను పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఎగ్జిక్యూటీవ్ అధికారి ప్రసన్నలక్ష్మి, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు, వివరం గోవిందు, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, వెంకటేశ్వరరావు, జి.ప్రసాద్, కందుకూరి వాసు, మన్నం పోలయ్య, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

ఒంగోలు(రూరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్రకార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. శనివారం ఒంగోలులోని సంఘ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో డిసెంబర్ 31నుంచి 2026జనవరి4వ తేదీ వరకు సీఐటీయూ మహాసభలు జరుగుతాయన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎం.రమేష్, రాష్ట్ర కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, పి.కల్పన, టి.రాము, బంకా సుబ్బారావు, పి.అంజనేయులు, పి.ఆవులయ్య పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కమిటీ

నాగులుప్పలపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) నూతన కమిటీ ఎన్నిక ఆదివారం ఒంగోలులో జరిగింది. రాష్ట్ర కౌన్సిలర్లు జె.వెంకటేశ్వరరావు, ఎస్కే.,బషీరున్నీసా సమక్షంలో ఎన్నికల అధికారి కె.తిరుమల, పరిశీలకులు ఎం.యోహాన్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం మండల నూతన అధ్యక్షుడిగా టి.ఈశ్వరయ్య, ప్రధానకార్యదరిగ్గా షేక్ మౌలాలి, ఉపాధ్యక్షులుగా ఐ.ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, సీహెచ్.విజయలక్ష్మి, కార్యదర్శులుగా ఎన్.సంజీవరావు, ఎల్.సలోమి, ఎన్‌వీ.సుబ్బారావు, జి.సురేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా జవహర్‌బాబు, ఐవీ.సుబ్బారావు, జె.మోహనలక్ష్మి, షేక్ అల్లాభక్షు, కె.నరేంద్ర, కోశాధికారిగా కె.శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు.

నేడు అన్నదాత సుఖీభవ కృతజ్ఞతా ర్యాలీ

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం నిధులను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసినందుకు కృతజ్ఞతగా మండలంలోని కామేపల్లి నుంచి చిర్రికూరపాడు వరకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ట్రాక్టర్లతో రైతులు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వారు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ సత్య, టీడీపీ నాయకులు పాల్గొననున్నారు.

నేడు రజక విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం కోర్టు సెంటర్‌లో గల ఎస్‌వీఎస్ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం రజక విద్యాసేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల ప్రదానం జరుగుతుందని నిర్వాహకులు అమర్తలూరి సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల వంతున అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ తల్లితండ్రులతో కలిసి పాల్గొనాలని ఆయన కోరారు.

లోగ్రేడ్ పొగాకు ధరలు తగ్గుముఖం

● రైతుల్లో ఆందోళన

కొండపి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పొగాకు లోగ్రేడ్ ధరలు మరింత పతనమయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం అక్కచెరువుపాలెం, పైడిపాడు, గోగినేనివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు పొగాకు బేళ్లను వేలానికి తెచ్చారు. రెండు నెలల క్రితం మీడియం రకం పొగాకును వ్యాపారులు రూ.190కు కొనుగోలు చేశారు. తర్వాత ధర తగ్గించారు. క్రమంగా నాణ్యమైన లోగ్రేడ్ రకం పొగాకు ధర కూడా తగ్గుతూ వస్తోంది. శనివారం కిలో రూ.140కు దిగజారింది. ముందుముందు ఇవి మరింత తగ్గుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేలు రకం ధర మాత్రం నిలకడగా కొనసాగుతోంది. ధరలు పెరుగుతాయని మేలు రకం పొగాకును కోల్డ్ స్టోరేజీల్లో రైతులు నిల్వ చేసుకున్నారు. కొద్ది నెలలుగా ఎలాంటి మార్పు లేకపోవడంతో రైతులు క్రమంగా కోల్డ్ స్టోరేజీల నుంచి బయటకు తీసి వేలానికి తీసుకు వస్తున్నారు.

ఉద్యమ స్ఫూర్తితో బీజేపీని తరిమికొట్టాలి

● మాజీ మంత్రి జేడీ.శీలం పిలుపు

చీమకుర్తి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశం నుంచి బీజేపీ కూటమి పార్టీలను తరిమికొట్టాలని మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ పార్టీ నేత జేడీ.శీలం పిలుపునిచ్చారు. చీమకుర్తిలో సంతనూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా పసుమర్తి సుధాకర్ ప్రమాణస్వీకారోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పట్టణంలో పార్టీ శ్రేణులు ర్యాలీ జరిపారు. తదుపరి జరిగిన సభలో జేడీ.శీలం పార్టీని గ్రామగ్రామానా విస్తరించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలపర్తి విజేష్‌రాజ్, పగడాల రంగస్వామి, సుబ్బారెడ్డి, ప్రసన్నరాజు, తుమ్మల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీల దినోత్సవం

చీమకుర్తి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల దినోత్సవాన్ని వేడుకలను ఏకలవ్యా సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు అధ్యక్షతన చీమకుర్తిలోని గిరిజన సంక్షేమ గురుకులపాఠశాలలో జరిగిన వేడుకల్లో ఆదివాసి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. తదుపరి పదోతరగతి విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. హాస్టల్‌కు బీరువాను బహూకరించారు. కార్యక్రమంలో మారం వెంకారెడ్డి, డాక్టర్ బి.జవహర్, వేమా శ్రీనివాసరావు, కందిమళ్ల గంగాధరరావు, బొంతా ఏసుదాసు, పిన్నిక శ్రీనివాసరావు, చలువాది రమేష్, బత్తుల మల్లిఖార్జునరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

ఒంగోలు(రూరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థల ప్రతినిధులు(బయ్యర్లు) బాధ్యతగా రైతుల నుంచి పొగాకు కొనుగోలుకు సహకరించాలని బోర్డు విజిలెన్స్ అధికారి రవికాంత్ పేర్కొన్నారు. శనివారం ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2లో పొగాకు బయ్యర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులుకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. అలాగే నోబిడ్‌లు లేకుండా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వేలంనిర్వహణాధికారి జె.తులసి పాల్గొన్నారు.

ఆలయ భూములకు కౌలు వేలం

సింగరాయకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన భూములకు శనివారం ఆలయ ప్రాంగణంలో కౌలు వేలం పాట నిర్వహించారు. ఉలవపాడు మండలం కె.రాజుపాలెం సర్వే నంబర్ 477లోని 1.35 ఎకరాల భూమికి గత ఏడాది రూ.6,300 కౌలు ఉండగా ప్రస్తుతం నిర్వహించిన వేలంలో రూ.50వేలు పలికింది. మూలగుంటపాడు పంచాయతీ పరిధి సర్వే నంబర్ 38/2ఏలోని 2.74 ఎకరాల భూమికి గత ఏడాది కౌలు రూ.11వేలు ఉండగా ప్రస్తుతం రూ.31వేలకు చేరింది. కందుకూరు మండలం చుట్టుగుంట వద్ద 791 సర్వే నంబర్‌లోని 5.52 ఎకరాల భూమికి గత ఏడాది రూ.4వేలు ఉండగా ప్రస్తుతం రూ.19వేలు పలికింది. గత ఏడాదితో పోల్చుకుంటే 9.61 ఎకరాల భూమిపై అదనంగా దేవస్థానానికి రూ.80వేల వరకు ఆదాయం సమకూరింది. వేలం పాట నిర్వహణలో ఈవో పి.కృష్ణవేణి, రికార్డు అసిస్టెంట్ బాపట్ల బ్రహ్మయ్య, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

'పాటిరత్నాలు' పుస్తకావిష్కణ

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన ప్రముఖ రచయిత ఉప్పలపాటి వెంకటరత్నం రచించిన పాటిరత్నాలు కవితా సంకలనాన్ని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్‌వీ.రమణ, శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్‌లు శనివారం ఆవిష్కరించారు. ఎన్టీఆర్ కృష్ణా జిల్లా అవనిగడ్డలో జరుగుతున్న మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో ఈ పుస్తకావిష్కరణ జరిగింది. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమా, పితాని సత్యనారాయణ, ఎమ్మెల్సీ నెట్టెం రఘురామప్రసాద్, విల్సన్, గుమ్మడి గోపాలకృష్ణ, డాక్టర్ జీవీ.పూర్ణచంద్, డాక్టర్ నూనె అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరత్నంను ఘనంగా సత్కరించారు.



కల్యాణ అలంకరణలో స్వామివారు

కమనీయం రంగనాయకుడి కల్యాణం

రాచర్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపిచెరువు అడవుల్లో వెలసిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణం శనివారం కమనీయంగా జరిగింది. కల్యాణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా అర్చక స్వాములు అన్నవరం సత్యనారాయణ చార్యులు, భూమరాజు సాయి వంశీలు స్వామివారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ జరిపించారు. శనివారం ప్రత్యేక పూజలు సందర్భంగా భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక పూజలు కల్యాణం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేసి అవసరమైన వసతులు కల్పించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఎస్ రాజేశ్వరరావు, డి రాంబాబు, ఎస్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఆలయంలోని కాపు బలిజసత్రములో నిర్వాహకులు కన్నసాని గోపాల్, తోట చంద్రయ్య, భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న దంపతులు

కంభం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రవణా నక్షత్రం సందర్భంగా వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకలో పలువురు దంపతులు పాల్గొన్నారు. స్వామి వారు జన్మించిన రోజు, శ్రావణ మాసం, శ్రావణ పౌర్ణమి ఇలా అన్ని శుభగడియలు ఒకేరోజు రావడం అరుదైన విషయమని అర్చకులు అంజనేయశర్మ తెలిపారు. తెల్లవారుజామున 5 గంటలకు దేవస్థానంలో నగర సంకీర్తనతో ప్రారంభమై సాయంత్రం 7గంటలకు గుడి ఉత్సవం, 8 గంటలకు భజన కార్యక్రమంతో వేడుక ముగిసింది.

సంప్రదాయంగా రాఖీ పండుగ

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని రక్షా బంధన్ కార్యక్రమాన్ని పట్టణంలో శనివారం సంప్రదాయంగా నిర్వహించారు. బ్రహ్మకుమారి సరస్వతి ఆధ్వర్యంలో హెడ్ పోస్టఆఫీస్, ఎంపీడీవో కార్యాల యం, వీహెచ్‌ఆర్ విద్యాసంస్థల వెన్నా హనుమారెడ్డికి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ..రాఖీ ఒక చెల్లి ఒక అన్నయ్యకు కట్టే దారపు పోగు కాదని, సోదరికి ఏ కష్టం రాకూడదని కట్టే రక్షణ కవచమని అన్నారు. అక్కా చెల్లెల్లు తమ్ముళ్లు, అన్నలకు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు పొందారు.



పోస్టల్ ఉద్యోగికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి సరస్వతి



చెన్నంపల్లి వద్ద అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

చినుకు పడితే చిత్తడే

● అధ్వానంగా రహదారి

● నిధులు మంజూరు చేసినా మొదలు కాని పనులు

పుల్లలచెరువు,ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): చాపలమడుగు నుంచి దొనకొండ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉంది. చినుకు పడితే రోడ్డు చిత్తడిగా మారి పెద్ద పెద్ద బురద కయ్యలను తలపిస్తున్నాయి.దీంతో నిత్యం ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. 2016లో టీడీపీ ప్రభుత్వం చాపలమడుగు నుంచి మిట్టపాలెం వరకు 8 కిలోమీటర్లకు గాను 6 కిలోమీటర్లు రోడ్డును నిర్మించి మధ్యలో వదిలేసింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కనీస మరమ్మతులు చేయకుండా గాలికి వదిలేసింది.దీంతో ఆ రోడ్డులో ప్రయాణం చేసే త్రిపురాంతకం, పుల్లలచెరువు, చాపలమడుగు, చెన్నంపల్లి, మిట్టపాలెం, నాయుడుపాలెం గ్రామాల ప్రజలతో పాటు ఉద్యోగులు కుడా ఇబ్బంది పడుతున్నారు.ఈ విషయం దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం ఇటీవల 1.20 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. ఐటీవరంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పనులకు శంకుస్థాపన చేశారు. వెంటనే ఉన్నాతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎర్రగొండపాలెం : చినుకుపడితే ఎర్రగొండపాలెంలోని సీసీ రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. శనివారం వేకువ జామున కురిసిన వర్షానికి శివాలయం, ఆంజనేయసామివీధి సీసీ రోడ్లపై వర్షపు నీరు చేరి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. కాలువల్లో నీరు పారేలా చూడకుండ రోడ్ల నిర్మాణం జరిగింది. సీసీ రోడ్లపై నివాస గృహాల ప్రజలు గ్రావెల్‌తో మెరక తోలడంతో వాన నీరు నిలిచి ఉంటుంది. ఒంగోలు వారి వీధిలో, ఇందిరానగర్‌లో, వస్తాద్ వీధిలో సీసీ రోడ్లపై వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉంటుంది. పంచాయతీ అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆంజనేయస్వామి ఆలయ వీధిలో సీసీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఇంకా లెక్క తేల్చరా..?

» జగనన్న కాలనీలో బినామీ పట్టాలు

» నత్తనడకన విచారణ

ఎర్రగొండపాలెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : జగనన్న కాలనీలో నివేశ పట్టాల లెక్క నేటికీ తేలలేదు. ఎర్రగొండపాలెం గ్రామ సమీపంలో వైసీపీ హయాంలో 2020లో మిల్లంపల్లి టోల్‌ప్లాజా వద్ద జగనన్న కాలనీ పేరుతో 1110 మందికి పట్టాలు పంపిణీ చేశారు. అదే స్థలంలో మరో 80 మందికి పట్టాలున్నా స్థలం సామాజిక అవసరాలకు కేటాయించారు. పట్టాలు పంపిణీ పూర్తయిన రోజు నుంచి ఒకరికి ఇచ్చిన పట్టా మరొకరికి ఇచ్చారని లబ్ధిదారుల మధ్య గొడవలు మొదలయ్యాయి. దీంతో తహసీల్దార్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. 2023లో అప్పటి మంత్రి ఆదిమూపు సురేష్ మౌఖిక ఆదేశాలతో రెవెన్యూ అధికారులు పట్టాల లెక్కపై విచారణ చేపట్టారు. అప్పటిలో 1110 పట్టాలు పంపిణీ చేయగా 500 మంది లబ్ధిదారులు మాత్రమే హాజరయ్యారు. దాంతో విచరణ జరగలేదు. 1110 పట్టాలు పొందినప్పటికీ 500 మందికి మాత్రమే గృహాలు మంజూరయ్యాయి. 150 ఇల్ల నిర్మాణం చేపట్టారు. 75 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 150 వరకు బేష్ మట్టాలు దశలో ఉన్నాయి. మరో 200 పక్కా గృహాలు పునాదులకే పరిమితమయ్యాయి. 610 నివేశ స్థలాలు ఖాళీగా ఉండడంతో ఆపట్టాలు పొందిన లబ్ధిదారులకు ఇటీవల వీఆర్వోలు విచారణ చేపట్టారు. అయితే పట్టాల సంఖ్య 600 మాత్రమేనని వీఆర్వోలు లెక్క చెప్తున్నారు. పట్టాలు పొందిన మరో 500 మంది లబ్ధిదారులు విచారణకు హాజరు కావాల్సి ఉండగా హాజరు కాలేదు. వారిలో ఎక్కువ మంది బినామీలు పట్టాలు పొందడమే కారణం కాగా, కొందరు రూ.50వేల నుంచి లక్ష వరకు ఇతరులకు విక్రయించారు. బినామీ పట్టాలు పొందిన వారు, కొనుగోలు చేసిన వ్యక్తులు హాజరు కాకపోవడంతో విచారణ సాగడం లేదు.



2023లో లబ్ధిదారులను విచారిస్తున్న డీటీ రామకృష్ణ, వీఆర్వో

తహసీల్దార్ మంజునాథరెడ్డి వివరణ

రెండువారాల నుంచి విచారణ జరుగుతుంది. ఈ వారంలో పూర్తి చేసి సబ్ కలెక్టర్‌కు నివేదికను అందజేస్తాం.

నేడు వేలం పాట

గిద్దలూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో ఈనెల 10వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు దసరా స్పెషల్ పూజల వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజలకు సంబంధించి ఉభయదాతలను గుర్తించేందుకు వీలుగా స్పెషల్ పూజల వేలం పాట నిర్వహిస్తున్నామని, పట్టణంలోని ఆర్య వైశ్యులు ఈ వేలం పాటలో పాల్గొనవచ్చని వారు పేర్కొన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి

ఎర్రగొండపాలెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు జరిగే ఈనెల 20 నుంచి జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏపీ ప్రజానాట్య మండలి కళాకారులు శనివారం పట్టణ వీధుల్లో ప్రచార జాతాను నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కిష్ట గౌడ్, రామయ్య, ప్రజా నాట్య మండలి కళాకారులు పాల్గొన్నారు.

ఈసీ, బీజేపీలపై చర్యలు తీసుకోవాలి

మార్కాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై నమోదైన ఓట్లకంటే లెక్కింపులో ఓట్ల శాతం పెంచుకుని దొంగ ఓట్లతో ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి 2024లో ఎన్‌డీఏ అధికారం చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు సయ్యద్ జావీద్ అన్వర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి భారతీయ జనతాపార్టీ, ఎన్నికల సంఘంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న న్యాయాధికారి సుభవాణి

ఆటలతో ఆరోగ్యం

» న్యాయాధికారి సుభవాణి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఆటలతో ఆరోగ్యం సమకూరుతుందని మార్కాపురం 6వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.సుభవాణి అన్నారు. స్థానిక ఎస్‌వీకేపీ కళాశాలలో మార్కాపురం బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయవాదులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిత్యం కోర్టు కార్యక్రమాలలో బిజీగా ఉండే న్యాయవాదులకు ఇలాంటి ఆటల కార్యక్రమాలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో న్యాయాధికారులు కిశోర్ కుమార్, ఎం.బాలాజీ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సయ్యద్ అలీ జహీర్, కార్యదర్శి నాగేంద్ర కుమార్, స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ ఎం.సుబ్బారెడ్డి, న్యాయవాదులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

» రూ.50వేలు అందజేసిన ఎరిక్షన్‌బాబు



బాధిత కుటుంబాలకు సాయం అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నగుడిపాడు చెరువులో శుక్రవారం ఈతకు వెళ్లి మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు శనివారం ఆర్థిక సాయాన్ని అందించారు. జమ్మిదోర్నాల గ్రామానికి చెందిన విద్యార్థులు పలుగుజ్జు అద్భుత్ కుమార్, పవన్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎరిక్షన్‌బాబు మార్కాపురం ఏరియా వైద్యశాలలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

గ్రామాల్లో దంచికొట్టిన వాన

» పొంగిన వాగులు, పంట పొలాల్లో నిలిచిన నీరు

» వైపాలెంలో 41.2 మి.మీ నమోదు

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వాతవారణంలో రోజుకో మార్పు కనిపిస్తుంది. ఉదయం నుంచి సాయత్రం వరకు ఎండ మండిపోతున్నా రాత్రి అవగానే వర్షం దంచి కొడుతుంది. ఎర్రగొండపాలెం మండలంలోని గోళ్లవిడిపి, బోయలపల్లి, వైపాలెం గ్రామాల్లో శుక్రవారం రాత్రి వర్షం కురిసిందని ఆయా గ్రామల ప్రజలు తెలిపారు. బోయలపల్లి కొండ ప్రాంతాలలో కురిసిన వర్షానికి ఎర్రవాగు పారిందని గ్రామ ప్రజలు తెలిపారు. అలాగే ఇటీవల సాగు చేసిన మిరప, బొప్పాయి. పత్తి పంటల్లో వర్షం నీరు నిలిచాయి. ఈ వర్షం రైతులకు మంచిదేనని వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు. అయితే మండలంలో కేవలం ఆ మూడు గ్రామాల్లో మాత్రమే వర్షం కురవడంతో మిగితా గ్రామాల ప్రజలు, రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు.



బోయలపల్లి వద్ద ఎర్రవాగులో పారుతున్న వాన నీరు



మిరప తోటలో నిలిచిన నీరు

విద్యతోనే గిరిజనాభివృద్ధి

పెద్ద దోర్నాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే గిరిజనాభివృద్ధి సాధ్యమని ఆదర్శ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ అడిపి కరుణాకర్ అన్నారు. మండలంలోని చెరువుగూడెంలో అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని ఆదర్శ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచు గిరిజనులతో కేకును కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కరుణాకర్ మాట్లాడుతూ సమాజంలో వెనుకబాటు తనానికి పెద్ద కారణం విద్య లేకపోవడమే అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని, సంస్థల సహకారాన్ని గిరిజనులు వినియోగించుకోవాలని కోరారు. ప్రధానంగా దురలవాట్లకు దూరంగా ఉండాలని, జీవనోపాధిని మెరుగుపర్చు కోవాలన్నారు. ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను సమానంగా చదివించాలన్నారు. సంస్థ ద్వారా అటవీ భూముల్లో పంటల సాగుకు తోడ్పాటు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ప్రత్యేక అధికారి ప్రసాద్, సభ్యులు సామ్యూల్ జాన్, దావీద్ కుమార్, కోటేశ్వరరావు, వెంకటేశం పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న గిరిజనులు



మార్కెట్‌యార్డు చైర్మన్ బాలయ్యను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

మార్కెట్ యార్డ్ చైర్మన్‌కు సన్మానం

గిద్దలూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన భైలడుగు బాలయ్యను తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. మార్కెట్‌యార్డు ఆవరణలో చైర్మన్ బాలయ్యను గడికోట మాజీ సర్పంచ్, సింగిల్ విండో అధ్యక్షుడు రామసుబ్బయ్య, టీడీపీ నాయకులు కలిసి పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సహకారంతో మార్కెట్‌యార్డును రైతులకు ఉపయోగపడే విధంగా చేస్తానని చైర్మన్ బాలయ్య ఈసందర్భంగా పేర్కొన్నారు.

రాచర్ల : గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ భైలడుగు బాలయ్యను రాచర్ల యాదవ సంఘం సభ్యులు శనివారం గిద్దలూరు మార్కెట్ యార్డ్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రంగస్వామి రామకృష్ణ, రంగస్వామి, రమణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

రాచర్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అచ్చంపేట గ్రామ పొలాల్లో పేకాటాడుతున్న ఆరుగురిని ఎస్సై పి కోటేశ్వరరావు శనివారం అరెస్టు చేశారు. గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమచారం అందడంతో ఎస్సై సిబ్బందితో దాడులు జరిపి పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1170 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



శిథిలావస్థలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

తర్లుపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారిలో, హిందూ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదకరంగా మారాయి. నిత్యం వేలాది వాహనాల రద్దీతో ఉండే ఈ ప్రాంతాల్లోని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచె లేకపోవడంతో తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. వీటి దిమ్మెలు కూడా శిథిలావస్థకు చేరారు. అవి ఎప్పుడు కూలి ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గాలులు వీచినప్పుడు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద నిప్పు రవ్వలు పడుతుంటాయి. పాఠశాల విద్యార్థులు బయటకి వచ్చినప్పుడు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఎదురుగా రైల్వే గేటు ఉండడంతో గేటు వేసిన సమయంలో వాహనదారులు బారులు తీరి ఉంటారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగక ముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గిద్దలూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీ నారాయణ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీజేపీ మండలశాఖ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంద్రాగస్టు వేడుకలో భాగంగా దేశభక్తిని పెంపొందించే విధంగా తిరంగా ర్యాలీని నిర్వహించాలని, ప్రతి ఇంటి మీద జాతీయ పతాకం ఎగరాలని, కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించాలని, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు ప్రతిరోజు ఏదో ఒకటి చేపట్టాలని పార్టీ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో నాయకులు జేవీ రామాంజనేయులు, కేవీ చంద్రమోహన్, ఎం.పుల్లయ్య, నాగేశ్వరరావు, రామక్రిష్ణ, మల్లారెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా ట్రాక్టర్ దగ్ధం



కాలిపోయిన ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ

పుల్లలచెరువు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శతకోడు సమీపంలోని పామాయల్ తోటలో అనుమానాస్పద స్థితిలో ఓ ట్రాక్టరు దగ్ధమైన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శతకోడు గ్రామ సమీపంలోని పామాయిల్ తోటలో ఉంచిన ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి తగులబెట్టారు. దీంతో గంగవరపు సాంబులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్‌ను శనివారం పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎల్.సంపత్ కుమార్ తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

పొదిలి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడిన ఘటనలో ఇద్దరికి కత్తి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశ్వనాథపురం పెట్రోల్‌బంక్ ఎదురుగా అన్నపురెడ్డి మాదవరెడ్డికి కాంపెక్స్ ఉంది. అక్కడ గతంలో మూడేళ్లకు అగ్రిమెంట్ చేసుకొని యమహా షోరూంను ఏర్పాటు చేశారు. షోరూంలో కోష్టాలపల్లి గ్రామానికి చెందిన మహిళ పని చేస్తుంది. కాంప్లెక్స్ యజమాని కుమారుడు మాధవరెడ్డి తనపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఆ మహిళ ఇంట్లో వాళ్లకు చెప్పారు. శనివారం ఫోన్‌లో వేధిస్తుండడంతో కాంప్లెక్స్ వద్దకు మహిళ కుటుంబ సభ్యులతో వచ్చారు. అక్కడున్న మాధవరెడ్డితో మాట్లాడేందుకు వెళ్లగా, మాధవరెడ్డి కత్తితో దాడిచేసి గాయపరిచనట్లు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈపెనుగులాటలో ఇద్దరికీ తలపై గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. ఇద్దరినీ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వైద్యశాలకు వెళ్లి విచారించారు. ఈ క్రమంలో వారి ఇద్దరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం

రేపటి నుంచి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

పామూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామంలో మూడురోజులపాటు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహిస్తున్నట్టు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. ఆభయాంజనేయస్వామి, వరసిద్ధి వినాయకస్వామి, సుబ్రమణ్య స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు విద్యాన్ డాక్టర్ సత్యబాబుస్వామి పర్యవేక్షణలో హనమత్ ఉపాసకులు అనంత పద్మనాభప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు.

సోమవారం పున్యవాచకం, అంకురోహణ, అగ్ని ప్రతిష్ఠ పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. మంగళవారం హోమాలు, పెద్ద ఆంజనేయస్వామికి పాలభిషేకం, 101 బిందెలతో జలాభిషేకం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బుధవారం స్వామివారికి గోదర్శనం, కుంభదర్శనం, నాగవల్లీ దర్శనం జరుగుతుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీనివాసుని కల్యాణం

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి గ్రామంలో గల శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామివార్ల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన నిర్వాహకులు పిడుగు బాబురావు, పాములపాటి మాధవప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

కార్యకర్తలను పరామర్శించిన బూచేపల్లి

తాళ్లూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వైసీపీ కార్యకర్తలను ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం పరామర్శించారు. రమణాలవారిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైసీపీ నాయకుడు కోటిరెడ్డి తల్లిని, కొర్రపాటివారిపాలెం గ్రామంలో ఆరోగ్య సమస్యలతో చికిత్సలు చేయించుకున్న ధర్మేంద్రను పరామర్శించారు. పరామర్శించినవారిలో మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన్‌రెడ్డి, జి.మోషే, కరిముల్లా, మారం ఇంద్రసేనారెడ్డి, షేక్ కాలేషావలి, కోట వెంకట్రామిరెడ్డి, ఐవీ సుబ్బారెడ్డి, శరత్ తదితరులు ఉన్నారు.

కుక్కల దాడిలో అడవిదుప్పి మృతి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం విభైలు గ్రామంలో శనివారం కుక్కల దాడిలో అడవి దుప్పి మృతిచెందింది. గ్రామ సమీపంలోని దుప్పి రాగా గమనించిన కుక్కలు వెంబడించాయి. జూలువాగు వద్ద దుప్పిపై కుక్కలు దాడిచేయడంతో మృతిచెందింది. సమీప పొలాల్లో ఉన్న రైతులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జగన్నాథ వెంకటేశ్వర్లు, ఫారెస్ట్ బీట్ అధికారి కేశవరావు సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకొని మృతిచెందిన దుప్పిని పరిశీలించారు. పశువైద్యాధికారి డాక్టర్ షేక్ మునీర్ పోస్టుమార్టం నిర్వహించారు.

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ముండ్లమూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980-81 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా అప్పటి ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి శంకుస్థాపన

కనిగిరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పామూరు రోడ్డులోని హెరిటేజ్ వద్ద ఆదివారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈమేరకు శనివారం రాత్రి ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి.

ప్రస్తుతం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. కొత్త భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారని ఆవర్గాలు తెలిపాయి.

నిరుపయోగంగా రైతుసేవా కేంద్రాలు

» అసంపూర్తిగా మరికొన్ని » పట్టించుకోని అధికారులు

పామూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో రైతులకు సేవలందించేందుకు గత వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. అనాటి పాలకుల అనాలోచిత నిర్ణయాలతో గ్రామాలకు దూరంగా భవనాల నిర్మాణం చేపట్టారు. కొన్నిచోట్ల ఇవిపూర్తికాగా ప్రారంభానికి నోచుకోలేదు. మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో ఈ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

పామూరు మండలంలో 19, సీఎస్‌పురం మండలంలో 15 రైతు సేవా కేంద్రాలను మంజూరు చేశారు. ఒక్కో భవనానికి ప్రభుత్వం ముందుగా రూ.21 లక్షలు, మలి విడతలో రూ.లక్షా అరవై వేలు మంజూరు చేసింది. కొన్నిచోట్ల కాంట్రాక్టర్‌లు బిల్లులు డ్రా చేసుకొన్నారే గాని భవనాలను పూర్తిస్థాయిలో నిర్మించకుండా అసంపూర్తిగా వదిలివేశారు. కాగా, పామూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా ఊపందుకోవడంతో వ్యవసాయ భూముల్లో వెంచర్లు వేయడంతో సాగుచేసే భూములు తగ్గిపోయాయని వ్యవసాయశాఖ జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు ఇవ్వడంతో పామూరులో నిర్మించిన నాలుగు రైతుసేవా కేంద్రాలను రద్దు చేశారు. దాంతో ఆ భవనాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. మండలంలో కొన్నిచోట్ల భవనాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. మరికొన్నిచోట్ల అసంపూర్తిగా వదిలివేయడంతో భవనాలకు నెర్రెలు ఇచ్చాయి. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ భవనాలను పూర్తిచేసి ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు.



నుచ్చుపొదలో ప్రారంభానికి నోచుకోని రైతు సేవా కేంద్రం



కోడిగుంపలలో అసంపూర్తిగా ఉన్న రైతు సేవా కేంద్రం

రామనామ స్మరణతో మార్మోగిన సుంకరవారిపాలెం

» కోటి రూపాయల విరాళాలతో సీతారామ లక్ష్మణ స్వామి ఆలయ నిర్మాణం
» వైభవంగా స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠ
» ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నాయకులు

ముండ్లమూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకరవారిపాలెం గ్రామంలో కోటి రూపాయలకు పైగా విరాళాలతో శ్రీసీతారామ లక్ష్మణ స్వామి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. గత మూడు రోజుల నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు భక్తుల కోలాహలం మధ్య ఉదయం 9 గంటలకు ఆలయం ముందు ధ్వజ స్తంభం, అనంతరం రామాలయంలో సీతారామలక్ష్మణ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం రామాలయం సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. పూజారి బ్రహ్మశ్రీ చింతపల్లి దత్త శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం పది వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించిన అనంతరం బ్రహ్మంగారి నాటకం ప్రదర్శించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సుంకరవారిపాలెం పులకించి పోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు రామనామ స్మరణతో ఆలయం మారుమోగిపోయింది. తమ పిల్లా పాపలను చల్లంగా చూడు అంటూ దేవతా మూర్తులను వేడుకున్నారు.

దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ధ్వజ స్తంభానికి పూజలు నిర్వ హించారు. వేద పండితులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేదరమెట్ల వెంకటరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, సుంకర రాఘవరెడ్డి, శేషగిరిరావు, బద్రి గోపాలరెడ్డి, కొడెగ మస్తాన్‌రావు, నందయ్య, పాపారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి సీతారామ లక్ష్మణ స్వామి, ఆంజనేయ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ సునీతాబ్రహ్మనందరెడ్డి, బంకా నాగిరెడ్డి, సూదిదేవర అంజయ్య, సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి



ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

నాడు పేద - నేడు దాతృత్వంలో పెద్ద



బోడ శ్రీను

ముండ్లమూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల క్రితం ఆయన ఒక శ్రమజీవి. కుటుంబ పోషణ కోసం ఊరూరా తిరిగారు. శ్రమశక్తిని నమ్ముకొని నేడు ఆర్థికంగా బలపడ్డాడు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్న మనస్తత్వాన్ని అలవర్చుకున్నాడు. మండలంలోని సుంకరవారిపాలెం గ్రామంలో ప్రతిష్ఠించిన సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం ప్రతిష్ఠ సందర్భంగా గ్రామానికి చెంది ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్లులో స్థిరపడిన బోడా శ్రీను అనే మేస్త్రీ రూ.11 లక్షలు ఆర్థికస హాయం అందజేశారు. ప్రతిష్ఠ రోజున అన్నదానం, ఆలయ అలంకరణ ఖర్చులు భరించి గ్రామస్థుల ఆదరాభిమానాలు చూరగొన్నారు.

పేద కుటుంబాలను ఆదుకోవాలి

» మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

కనిగిరి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాల సంక్షేమం కోసం ప్రతిఒక్కరూ మార్గదర్శకులుగా ముందుకురావాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగంగా కమిషనర్ పట్టణ సమీపంలోని కాశిరెడ్డి కాలనీలో వేటగిరి అంకమ్మ కుటుంబసభ్యులను శనివారం సందర్శించారు. ఈసందర్భంగా వారి జీవన స్థితిగతులు, కుటుంబనేపథ్యం, పిల్లల చదువులు, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదరిక నిర్మూలన కొరకు పీ4 పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీంతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రతతో పాటు వారి లక్ష్యాల సాధనకు, అవసరమైన వనరులను సమకూర్చి వారికి అండగా నిలబడేందుకు సంపన్నులు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈసందర్భంగా ఆకుటుంబానికి అవసరమైన నిత్యావసర సరుకులతో పాటు విద్యార్థికి నూతన వస్త్రాలు అందజేశారు.



అంకమ్మ కుటుంబానికి నిత్యావసర సరుకులతో పాటు వస్త్రాలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

దొనకొండలో పందుల స్వైరవిహారం

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు » పట్టించుకోని అధికారులు

దొనకొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దొనకొండలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా గుంపులుగా రోడ్లపై, జననివాసాల చుట్టూ సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఈక్రమంలో పందుల సంచారంతో ప్రజలు వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా చిన్నారులకు మెదడువాపు వంటి వ్యాధులు వచ్చే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారులపై గుంపులుగా తిరుగుతుండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఇటీవల ఒక విద్యార్థిని ద్విచక్ర వాహనంపై వస్తుండగా అకస్మాత్తుగా పంది అడ్డురావటంతో కిందపడి గాయాలపాలయ్యారు. గ్రామంలో పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నా పంచాయతీ పాలకులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



దొనకొండలో సంచరిస్తున్న పందులు



ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను సందర్శించిన డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి శనివారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థినులను హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాలు, భోజన వసతిపై విచారించారు. ఇటీవల హాస్టల్‌లో భోజన వసతి సరిగా లేదని వెలిగండ్ల ఎస్ఐ కృష్ణపావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఎమ్మెల్యేతో కలిసి ఆకస్మిక తనిఖీ చేసిన విషయం విధితమే.

ప్రస్తుతం ఎమ్మెల్యే రాత్రి పది గంటల సమయంలో ఆకస్మికంగా సందర్శించటంపై ప్రత్యేకతను సంతరించుకుంది. ఈసమయంలో విద్యార్థినులు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హాస్టల్‌లో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఎదురైనా నేరుగా తనకు చెప్పాలని సూచించారు.

పంటల మార్పిడితో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఏడీఏ జైనులద్దీన్

పీసీపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పంటల మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని కనిగిరి డివిజన్ సహాయ వ్యవసాయ అధికారి షేక్ జైనులద్దీన్ అన్నారు. శనివారం మండలంలోని పెదఅలవలపాడులో జరిగిన రైతు శిక్షణలో ఆయన మాట్లాడారు. సాగుకు ముందు మంచి విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. పంట పొలాల్లో మిత్ర పురుగులను గుర్తించి వాటికి నష్టం కలగకుండా చూసుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. వంద శాతం రాయితీపై అందిస్తున్న మినీ కిట్స్ కందులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలతో పంటలు సాగుచేస్తే తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎన్.రంగాక్రిష్ణ, గ్రామ రైతు నాయకులు పువ్వాడి మల్లికార్జున, పువ్వాడి నాగరాజు, కొల్లా శ్రీరాములు, వడ్డెంపూడి వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రక్షాబంధన్ వేడుకలు

దొనకొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగను శనివారం ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా పలువురు తమ అక్కాచెల్లెళ్ల చేత రాఖీలు కట్టించుకుని వారికి బహుమతులు అందజేశారు. మండలంలోని అన్నిగ్రామాల్లో అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీత అయిన రాఖీ పండుగ వేడుకలను కులమతాలకు అతీతంగా ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు వారి సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. మండలకేంద్రమైన దొనకొండలో పలు దుఖాణాల్లో రాఖీలు, స్వీట్లు కొనుగోళ్లతో సందడి నెలకొంది.


పామూరు: సోదర సోదరీమణుల ప్రేమకు ప్రతి రూపకంగా జరుపుకొనే రక్షాబంధన్ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలు రాఖీ పౌర్ణమి వేడుకలను జరుపుకున్నారు. రాఖీలను కొనుగోలు చేసుకొని చిన్నపెద్ద అనే తేడా లేకుండా అందరూ వేడుకలను జరుపుకున్నారు.

తాళ్లూరు: సోదరీ సోదరుల ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచిన రక్షాబంధన్‌ను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. అక్కలు, చెల్లెలు తమ సోదరులకు రక్షాబంధన్‌లు కట్టి తమ ప్రేమాభిమానాలు చాటి స్వీట్లు తినిపించారు. సోదరులు కూడా ఆప్యాయతతో ఆశీర్వాదాలు అందజేశారు. రక్షాబంధన్ వేడుకలు అన్ని గ్రామాల్లో జరుపుతున్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో శనివారం మధ్యాహ్నం ఆటోను గొర్రెల లారీ ఢీకొనటంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని కెల్లంపల్లి నుంచి సుంకరవారిపాలెంలో స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఎనిమిది మంది ఆటోలో బయలుదేరారు. ముండ్లమూరు దగ్గరకు వచ్చేసరికి అద్దంకి వైపు నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ఎనిమిది మందిలో మీనగ మల్లేశ్వరికి, కన్నెగంటి అపర్ణకు తీవ్రగాయాలయ్యాయి. వీరిరువురిని సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లగా వైద్యాధికారి జాస్మిన్ ప్రాథమిక చికిత్స చేశారు. అపర్ణను మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు.

హామీలను అమలుచేయాలి



గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలుపుతున్న కార్మికులు

కనిగిరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలను గాలకొదిలేశాయని ఏపీ వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం టూల్ డౌన్ కార్యక్రమం నిర్వహించిన కార్మికులు నిరసన తెలిపారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఖాశింవలి మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదన్నారు. మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను ఆప్కాస్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారంచేయని పక్షంలో సమ్మెకు సిద్ధపడక తప్పదన్నారు. అనంతరం వివిధ డిమాండ్‌లతో కూడి వినతి పత్రాన్ని కార్యాలయంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి అందించి వినూత్న నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాసర్, కిరణ్, శేషయ్య, మస్తాన్, రవి, శేఖర్, జీవన్, మధు, రత్తయ్య, ఏసుబాబు, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

దొనకొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓగ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై శనివారం అదేగ్రామానికి చెందిన దొండపాటి బ్రహ్మయ్య అత్యాచారయత్నం చేశాడు. ఎస్ఐ త్యాగరాజు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో పిల్లలతో కలిసి ఆడుకుంటున్న బాలికకు బ్రహ్మయ్య మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. ఇది గమనించిన ఇరుగు పొరుగు వారు వెంటనే వెళ్లి తలుపులు కొట్టగా తీయలేదు. దీంతో బలంగా కొట్టడంతో తలుపులు తెరచుకున్నాయి. ఇంట్లో నుంచి బాలిక ఏడుస్తూ పరిగెత్తుకుంటూ బయటకురాగా, బ్రహ్మయ్య పారిపోయినట్లు సమాచారం. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ త్యాగరాజు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
ఆదివారం 10 ఆగస్టు 2025





రైతులు సాగు చేసుకుంటున్న చెన్నుపల్లి సమీపంలోని ఇనామ్ భూములు

పిన్నిబోయినవారిపాలెం

ఛానల్‌కు గండి

▸▸ వృథా అవుతున్న నీరు

బాపట్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పిన్నిబోయినవారిపాలెం గ్రామంలో సాగునీటి కాల్వకు గండిపడి నీరంతా వృథా అవుతున్నది. దీంతో ముందుగా విత్తిన మొక్కలు మొత్తం మునిగిపోయే ప్రమాదం కూడా ఉంది. రైతులు గండిని పూడ్చే ప్రయత్నం చేస్తున్నారు. వరుసగా మూడురోజులు సెలవులు రావటంతో అధికారులు అందుబాటులో లేరు. దీనివల్ల గండి పూడ్చేవారు లేకపోవటంతో రైతులు నష్టపోతున్నారు. తక్షణమే స్పందించి వెంటనే గండిపూడ్చి సాగునీరు వృథా కాకుండా, రైతులకు నష్టం జరగకుండా చూడాల్సిన అవరం ఉంది.



పొలాల్లోకి చేరిన గండిపడిన నీరు



ఛానల్‌కు గండిపడి పొలాల్లోకి వెళుతున్న నీరు



ఈపూరు మండలం ఎర్రబాలెంలో రోడ్డుపై నిలిచిన నీరు

- ఖాళీ ఖజానాతో పాలకవర్గాల్లో అయోమయం
- బ్లీచింగ్ కొనడానికీ అందుబాటులో లేని నిధులు
- పల్లెల్లో పారిశుధ్యం అధ్వానం.. ప్రబలుతున్న వ్యాధులు
- కేంద్ర నిధుల మళ్లింపుతో వట్టిపోయిన పంచాయతీ ఖజానాలు
- 8 నెలలుగా ఆర్థిక సంఘం నిధుల కోసం సర్పంచ్‌ల ఎదురుచూపు
- ఇప్పటికే డెంగీ జ్వరాలతో వణికిపోతున్న బాపట్ల

పంచాయతీల్లో.. పైసల్లేవ్



రూ. 70.52 కోట్లు మళ్లింపు

కేంద్ర ప్రభుత్వం ఎనిమిది నెలల క్రితం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు రూ.70.52 కోట్లు విడుదల చేసింది. అయితే ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించింది. పల్నాడు జిల్లాకు రూ.30.78 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.23.35 కోట్లు గుంటూరు జిల్లాకు రూ.16.39 కోట్లను పంచాయతీల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాల్సి ఉంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) పల్లెల్లో పారిశుధ్యం క్షీణించి దోమల వ్యాప్తి అధికమైంది. గ్రామీణులు జ్వరాల బారిన పడుతున్నారు. వర్షాలతో అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. పారిశుధ్యం మెరుగుదలను ఉద్యమంలా చేపట్టి ప్రజలకు అంటువ్యాధులు రాకుండా కావాల్సిన బాధ్యత పంచాయతీలపై ఉంది. అయితే నిధులు లేక పనులు చేపట్టలేక పంచాయతీ పాలకవర్గాలు మిన్నకుంటున్నాయి. కూటమి (మిగతా 6లో)

అడపాదడపా వర్షాలు.. అడుగంటిన పారిశుధ్యం.. దోమలు.. తాగునీరు కలుషితం.. ప్రబలుతున్న వ్యాధులు.. జ్వరాలతో పల్లెల్లో పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఇప్పటికే బాపట్ల జిల్లాలో పలు గ్రామా ల్లో డెంగీ జ్వరాలతో మరణాలు సంభవించ గా, పలువురు చికిత్స పొందుతున్నారు. ఇదే పరిస్థితి పల్నాడు, గుంటూరు జిల్లాల్లోనూ అక్కడక్కడ ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో కనీసం బ్లీచింగ్ కొనుగోలు చేసి రోడ్లపై చల్లి కొంతైనా పారిశుధ్యం మెరుగుపరచాలను కున్నా పంచాయతీల్లో నిధులు లేవని సర్పంచ్‌లు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వకపోగా కేంద్రం ఎనిమిది నెలల క్రితం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధుల ను కూడా మళ్లించుకుని మొండిచేయి చూపుతోందని పంచాయతీ పాలకవర్గాలు వాపోతున్నాయి. నిధులను విడుదల చేయాలని ఆందోళనలు చేసినా ప్రభుత్వం స్పందించడంలేదని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అగ్రహారం భూముల.. రైతులకేదీ

సుఖీభవ

అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్ళిన మంత్రి రవికుమార్

అద్దంకి, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను రైతులు ఖాతాలలో జమ చేసింది. అయితే ఇనామ్, అగ్రహారం భూములు సాగు చేసుకుంటున్న రైతులకు మాత్రం నిధులు విడుదల కాలేదు. అద్దంకి నియోజకవర్గంలోని సంతమాగులూరు మండలం గోపాపురం అ గ్రహారం భూములు900 ఎకరాలు ఉండగా అడవిపాలెం, వెల్లలచెరువు, కామేపల్లి, ఏల్చూరు లకు చెందిన సుమారు 600 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇక సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు, మక్కెనవారిపాలెం, బల్లికురవ మండలం చెన్నుపల్లి, కొండాయపాలెం, ముక్తేశ్వరం గ్రామాలలో సుమారు 5 వేల ఎకరాల ఇనామ్ అగ్రహారం భూములు ఉండగా సుమారు వెయ్యి మంది రైతులు తరతరాలుగా సా గు చేసుకుంటున్నారు. భూమి తమ ఆధీనంలో ఉన్నా తరతరాలుగా పోరాడుతున్నా ఎలాంటి హక్కు లభించలేదు. ఈ నేపథ్యంలో సాగు చేసుకుంటున్న రైతులకే హక్కు కల్పించే దిశగా రవికుమార్ అన్ని ప్రయత్నాలు చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రైతు రుణమాఫీ అమలు చేసినప్పుడు కూడా అందరు రైతులకు జమ కాగా అగ్రహారం, ఇనామ్ భూములు సాగు చేసే రైతులకు జమ కాలేదు. దీంతో అప్పట్లో రవికుమార్ పలు దఫాలు ప్రయత్నాలు చేసి ఆ రైతులకు కూడా రైతు రుణమాఫీ అమలు జరిగే విధంగా కృషి చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కూడా అగ్రహారం, ఇనామ్ భూములు సాగు చేసుకునే రైతులకు రైతు భరోసా నగదు జమ అయ్యింది. ప్రస్తుతం అన్నదాత సుఖీభవ నిధులు మాత్రం సాంకేతిక కారణాలతో ఆయా రైతులకు జమకా లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల మంత్రి రవికుమార్ దృష్టికి కూడా సంతమాగులూరు, బల్లికురవ మండలాల రైతులు తీసుకు పోయారు. అప్పటికే సీఎం చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖమంత్రి అచ్చెనాయుడు దృష్టికి తీసుకు పోయిన విషయాన్ని రైతులకు రవికుమార్ వివరించారు. ఎట్టి పరిస్థితులలో అ గ్రహారం, ఇనామ్ భూములు సాగు చేసుకునే రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తింప జేయటం జరుగుతుందని మంత్రి రవికుమార్ రైతులకు భరోసా ఇచ్చారు. అదే సమయంలో ఆయా భూముల పై సాగు రైతులకు పూర్తి హక్కు కల్పించే ప్రక్రియ ఇప్పటికే అత్యధిక శాతం పూర్తయిందని, మిగిలిన ప్రక్రియ కూడా మరింత వేగవంతంగా జరిగేలా కృషి చేయటం జరుగుతుందని మంత్రి రవికుమార్ తెలిపారు.

క్రీడాకారుల ప్రోత్సాహానికే పోటీలు

చీరాలలో 36వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నియోజకవర్గంలో ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని చీరాల ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. నియోజకవర్గ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో స్థానిక విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ పోటీలను ఎమ్మెల్యే కొండయ్య లాంఛనంగా ప్రారంభించారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ ఫ్లాగ్ మార్చ్‌తో అట్టహాసంగా మొదటి రోజు క్రీడలు ప్రారంభమయ్యాయి. దాదాపుగా 36 జిల్లాల నుండి బాలురు, బాలికలు సుమారు 1500 మంది హాజరయినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం నుండి సోమవారం క్రీడలు ముగియను న్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. పొగడదండ రవికుమార్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



జెర్సీలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

అల్లూరి స్ఫూర్తితో ముందుకు వెళ్లాలి



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు రాఖీ కడుతున్న గిరిజన మహిళలు



నృత్యం చేస్తున్న గిరిజన బాలికలు

ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతా రామరాజు, వెన్నెలకంటి స్ఫూర్తితో గిరిజనులు ముందుకెళ్లాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం పోరాటాలు చేసేవారు చరిత్రలో నిలిచిపోతారన్నారు. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు, నిరాడంబరతకు నిలువుటద్దంగా నిలిచే జీవనశైలి ఆదివాసీయుల సొంతమన్నారు. ఆదివాసీల జీవితాలలో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో వారి అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని చెప్పారు. గిరిజన బాలికల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు మహిళలు రాఖీలు కట్టి, జాతకం చెప్పి గిరిజన అలంకార ఉత్పత్తులు అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖాధికారి శ్యాంబాబు, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి జె.రాజాదేబోరా, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, గిరిజన సంఘాల నాయకులు మోహన్‌కుమార్ ధర్మా, ఏకసిరి నరసింహారావు, తిరువీధుల శంకరప్రసాద్, దేవరకొండ రాము, దేవరకొండ శంకరరావు, బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- ఉపాధి హామీ పథకంలో అక్రమాలు
- బల్లికురవలో రూ. 3 కోట్ల అవకతవకల గుర్తింపు
- ఉద్యోగులపై చర్యలకు రంగం సిద్ధం
- సంతమాగులూరు మండలంలోనూ ఫిర్యాదులు



బల్లికురవ మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్‌ఫొటో)

పర్యవేక్షణ శూన్యం.. ప్రభుత్వ ధనం భోజ్యం

బల్లికురవ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో రోజు వారీ కూలీలు వలసలు పోకుండా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా కూలి పనులు కల్పిస్తుంటే, సరైన పర్యవేక్షణ లేక ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. బల్లికురవ మండలంలో ఏడాది కాలంలో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు పూర్తి అయ్యాయి. తనిఖీలకు వచ్చిన వారు పలు గ్రామాలలో పెద్దఎత్తున పనులలో లోపాలు ఉన్నాయని, బోగస్ మస్టర్లు వేశారని, చనిపోయిన వారికి కూడా మస్టర్లు వేయటంతో పాటు క్షేత్ర స్థాయి సిబ్బంది కూలీలతో కుమ్మక్కై నగదు కాజేశారని గుర్తించారు. అంతేకాకుండా పనులలో కొలతలు లేవని, అసలు ఒకే ప్రదేశంలో మూడు సార్లు పనులు చేసినట్లు నగదు డ్రా చేశారని, అంగన్ వాడీ కార్యకర్తలకు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పనులకు వచ్చినట్లు మస్టర్లు వేశారని తేల్చారు. ఆయా పనుల అక్రమాలపై సుమారు రూ. 3 కోట్ల పైబడి రికవరీలు, మరోమారు తనిఖీలు చేయాలని తనిఖీ బృందాలు ప్రజావేదిక ముందు ఉంచారు. పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగాయని తెలిసి నిజంగా పనులకు వెళ్లే కూలీలు సైతం విస్తుపోయారు.

పర్యవేక్షణ లేకనే..

గ్రామాలలో ఉపాధి హామీ పథకం పనులు చేయాలంటే ముందుగా గ్రామాలలో ఉన్న క్షేత్ర సహాయకులు గ్రామ సభ పెట్టి పనులను గుర్తించి టెక్నికల్ అసిస్టెంట్‌కు పంపించాలి తదుపరి వారు మండల ఈసీకి పనుల వివరాలను పంపిస్తే వారు పరిశీలించి, తదుపరి పీవోకు, పీడీకి, పంపించాల్సి ఉంది. తదుపరి ప్రతి రోజు గ్రామాలలో కూలీలకు పనులు చూపించి వారితో కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలి. ఉన్నత స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు పనిచేసే అధికారులు ప్రతి రోజు పనుల వద్ద మస్టర్ తనిఖీలు చేయాలి. ఎక్కడా లోపాలు లేకుండా పనులు జరిగేలా వారు కొలతలు తీయాలి. కానీ సక్రమంగా కొలతలు తీయకపోవటం వలనే బోగస్ మస్టర్లు, కొలతలలో తేడాలు బయట పడ్డాయి. కొన్ని గ్రామాలలో అయితే అధికారులు అసలు పనుల వద్దకు వెళ్లకుండానే ఎక్కడో ఒక చోట పనులు చూసి ఫొటోలు తీసి పంపారు.

సంతమాగులూరు మండలంలో కూడా ఉపాధి హామీ పథకం పనులపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కూడా కూలీలు ఫిర్యాదులు చేశారు. చవిటిపాలెం, వెల్లలచెరువు గ్రామాలలో గ్రీవెన్స్ ఫిర్యాదులు రావటంతో ఇద్దరు క్షేత్ర సహాయకులపై వేటు వేశారు. అడవిపాలెం గ్రామ క్షేత్ర సహాయకుడిపై ఇటీవల మరలా గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు వెళ్లాయి.

కావూరు గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చెరుకుపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో మిగిలిన సీట్లకు గాను ప్రవేశపరీక్ష నిమిత్తం దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ కె.విజయలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 9 నుంచి 14వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఆధార్, స్టడీ సర్టిఫికేట్, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న వారికి ఈనెల 16న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశపరీక్ష నిర్వహించి తరువాత ప్రతిభ ఆధారంగా సీటు ఇవ్వబడుతుందన్నారు. వివరాలకు 8712625041, 9492525787 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఓఎల్ఎక్స్‌లో.. జగనన్న ఇల్లు

- రూ.6 నుంచి 12 లక్షల వరకు ధర పెట్టి అమ్మకం
- అప్పు చేసి కట్టుకున్నా సౌకర్యాలు లేని కాలనీలో ఉండలేక

తెనాలి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేరుస్తాం.. కాలనీలు కాదు.. ఊళ్లను సకల సౌకర్యాలతో నిర్మిస్తున్నాం.. రూ.15 లక్షల ఆస్తిని పేదలకు అందిస్తాం.. అంటూ గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్భాటంగా ప్రకటించారు. అయితే జగన్ పాలన పోయింది.. చం ద్రబాబు వచ్చారు. కానీ జగనన్న కాలనీలను, అందులోని నివాసితుల గోడు ఎవరికీ పట్టడంలేదు. స్థలం వచ్చిందని అప్పులు చేసి కలల గృహాన్ని నిర్మించుకున్న ఎందరో అక్కడ కనీస సౌక ర్యాలు లేక బిక్కుబిక్కుమంటూ ఉండలేక అమ్ముకునేందుకు సిద్ధమవు తున్నారు. ఇప్పటికే అనేక లేఅవుట్లలో పలువురు ఇళ్లు అమ్ముకోగా కొందరు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తెనాలి ప్రాంతంలోని నేలపాడు లేఅవుట్‌లో ఓ లబ్ధిదారుడు తన ఇంటిని ఏకం గా ఓఎల్ఎక్స్ యాప్‌లోనే అమ్మకా నికి పెట్టడాన్ని పలువురు విచిత్రం గా చూస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని పలు జగనన్న కాలనీల్లో అక్కడక్కడ కొందరు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ అప్పులు కట్టలేక, కనీస సౌకర్యాలు లేని, దోమలు, విషసర్పాలు, అపరిశుభ్రత మధ్య ఆ ఇంట్లో నివాసం ఉండ లేక అల్లాడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోని ఇళ్లను కూడా పలువురు లబ్ధిదారులు ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి పెట్టేస్తున్నారు. అయితే అమ్మకాలు జరుగుతున్నది తక్కువే అయినా, గతంలోకంటే కొంత వరకు అమ్మకాలు బాగేనే సాగుతున్నాయని దళారులు చెబుతున్నారు. తక్కువ ధరకు కొనిపెట్టుకుంటే, భవిష్యత్‌లో ఎంతోకొంత రేటు పెరగకపోతుందా అన్న ఆలోచనతో కొందరు కొనుగోలు చేస్తున్నారు. ఇంటిని బట్టి రూ.9 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు రేటు పెట్టి అమ్మకాలకు దిగుతున్నారు. ఇల్లు కట్టకుండా ఉన్న ఖాళీ స్థలం అయితే రూ.3 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు ప్రాంతాన్ని బట్టి రేటుపెట్టి అమ్మేస్తున్నారు.



₹ 9,00,000
జగన్ అన్న కాలనీ నేలపాడు తెనాలి

అసంపూర్తి నిర్మాణాలు

- అద్దె భవనాలలో ప్రభుత్వ కార్యాలయాలు

పర్చూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గంలో ప్రభుత్వ భవనాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ కాలంలో చేపట్టిన భవనాల నిర్మాణం అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. నిర్మాణం సకాలంలో పూర్తి చేయక పోవటంతో, ఖర్చులు అంతకు అంత పెరిగి పోవటం ఒక భాగమైతే, అద్దె చెల్లింపు మరో భారంగా మారింది. కొన్ని చోట్ల 70 - 80 శాతం నిర్మాణాలు పూర్తయినా వినియోగించుకోలేని దుస్థితి ఉంది. మండల పరిషత్ కార్యాలయానికి సొంత భవనంలేక వెలుగు కార్యాలయంలో కొనసాగిస్తున్నారు. అదేవిధంగా పర్చూరులోని ఇందిరాకాలనీలో సచివాలయం, పర్చూరులోని సచివాలయం పరిస్థితి ఇదే విధంగా ఉంది. చాలా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు ఎప్పటికి పూర్తి అవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.



పర్చూరు ఇందిరా కాలనీలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనం

ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను చెల్లించాలి

● ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ



మాట్లాడుతున్న బాలాజీ

ఒంగోలు(విద్య) ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.30వేలకోట్ల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో జరిగిన ఆపస్ రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశంలో ఆయన మా ట్లాడారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏను వెంటనే మంజూరు చేయాలన్నారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ.సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఉమ్మడిసర్వీస్ రూల్స్ అమ లులో ఉన్న ఇబ్బందులను తొలగించి ఎంఈవోలు, వైద్యా ధికారులు, డైట్ లెక్చరర్‌లకు ప్రమోషన్‌లు ఇవ్వాలని కోరారు. సంఘటనా కార్యదర్శి సీహెచ్.శ్రావణకుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు యాప్‌లు భారం తగ్గించాలని కోరారు. సమావేశంలో ఏపీఆర్ఎస్ఎం జాతీయ సంఘటన మంత్రి గుంత లక్ష్మణ్‌జీ, 26 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్రకార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రక్షాబంధన్ వేడుకలు

● ఎస్పీ, మాజీ సైనికులకు రాఖీలు కట్టిన బీజేపీ మహిళా మోర్చా నాయకులు



మాజీ సైనికులకు రాఖీలను కడుతున్న మహిళా నాయకులు

ఒంగోలు(కల్చరల్)/ఒంగోలు(రూరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగను శనివారం జిల్లావ్యాప్తంగా ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ అక్క, చెల్లెళ్ల చేత రాఖీలు కట్టించుకుని తమ శక్తికొద్దీ బహుమతులు అందజేశారు. అదేవిధంగా ఒంగోలు నగరంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు స్థానిక కర్నూల్ రోడ్డులోని సైనిక దళ కార్యాలయంలో మాజీ త్రివిధ దళ సైనికులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. దేశరక్షణలో భాగస్వాములవుతున్న సైనికులు ప్రతి ఒక్కరికీ సోదరులవంటి వారన్నారు. దేశ, ప్రజల రక్షణకో సం సరిహద్దుల్లో నిరంతరాయంగా పని చేసే సైనికులను మనం గౌరవించుకోవాలన్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకోవాలని కోరారు. పహల్గాం ఘటనకు కారణమైన పాకిస్తాన్ తీవ్రవాదులును మన దేశ సైనికులు మట్టుపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బి.విజయారావు, తీగల సరస్వతి, ధనిశెట్టి పావని, మాజీ సైనికులు చుండూరి శ్రీరామూర్తి, క్యాంటీన్ మేనేజర్ గుమ్మడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్పీ దామోదర్‌కు సైతం వారు రాఖీని రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు అందజేశారు. అదేవిధంగా నగరంలోని వివిధ పాఠశాలల్లో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి.

నేడు అన్నదాత సుఖీభవ కృతజ్ఞతా ర్యాలీ

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం నిధులను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసినందుకు కృతజ్ఞతగా మండలంలోని కామేపల్లి నుంచి చిర్రికూరపాడు వరకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ట్రాక్టర్లతో రైతులు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వారు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ సత్య, టీడీపీ నాయకులు పాల్గొననున్నారు.

నేడు రజక విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం కోర్టు సెంటర్‌లో గల ఎస్‌వీఎస్ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం రజక విద్యాసేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల ప్రదానం జరుగుతుందని నిర్వాహకులు అమర్తలూరి సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల వంతున అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ తల్లితండ్రులతో కలిసి పాల్గొనాలని ఆయన కోరారు.

లోగ్రేడ్ పొగాకు ధరలు తగ్గుముఖం

● రైతుల్లో ఆందోళన

కొండపి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పొగాకు లోగ్రేడ్ ధరలు మరింత పతనమయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం అక్కచెరువుపాలెం, పైడిపాడు, గోగినేనివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు పొగాకు బేళ్లను వేలానికి తెచ్చారు. రెండు నెలల క్రితం మీడియం రకం పొగాకును వ్యాపారులు రూ.190కు కొనుగోలు చేశారు. తర్వాత ధర తగ్గించారు. క్రమంగా నాణ్యమైన లోగ్రేడ్ రకం పొగాకు ధర కూడా తగ్గుతూ వస్తోంది. శనివారం కిలో రూ.140కు దిగజారింది. మున్ముందు ఇవి మరింత తగ్గుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేలు రకం ధర మాత్రం నిలకడగా కొనసాగుతోంది. ధరలు పెరుగుతాయని మేలు రకం పొగాకును కోల్డ్ స్టోరేజీల్లో రైతులు నిల్వ చేసుకున్నారు. కొద్ది నెలలుగా ఎలాంటి మార్పు లేకపోవడంతో రైతులు క్రమంగా కోల్డ్ స్టోరేజీల నుంచి బయటకు తీసి వేలానికి తీసుకు వస్తున్నారు.

ఉద్యమ స్ఫూర్తితో బీజేపీని తరిమికొట్టాలి

● మాజీ మంత్రి జేడీ.శీలం పిలుపు

చీమకుర్తి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశం నుంచి బీజేపీ కూటమి పార్టీలను తరిమికొట్టాలని మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ పార్టీ నేత జేడీ.శీలం పిలుపునిచ్చారు. చీమకుర్తిలో సంతనూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా పసుమర్తి సుధాకర్ ప్రమాణస్వీకారోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పట్టణంలో పార్టీ శ్రేణులు ర్యాలీ జరిపారు. తదుపరి జరిగిన సభలో జేడీ.శీలం పార్టీని గ్రామగ్రామానా విస్తరించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలపర్తి విజేష్‌రాజ్, పగడాల రంగస్వామి, సుబ్బారెడ్డి, ప్రసన్నరాజు, తుమ్మల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీల దినోత్సవం

చీమకుర్తి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల దినోత్సవాన్ని వేడుకలను ఏకలవ్యా సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు అధ్యక్షతన చీమకుర్తిలోని గిరిజన సంక్షేమ గురుకులపాఠశాలలో జరిగిన వేడుకల్లో ఆదివాసి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. తదుపరి పదోతరగతి విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. హాస్టల్‌కు బీరువాను బహూకరించారు. కార్యక్రమంలో మారం వెంకారెడ్డి, డాక్టర్ బి.జవహర్, వేమా శ్రీనివాసరావు, కందిమళ్ల గంగాధరరావు, బొంతా ఏసుదాసు, పిన్నిక శ్రీనివాసరావు, చలువాది రమేష్, బత్తుల మల్లిఖార్జునరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

ఒంగోలు(రూరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థల ప్రతినిధులు(బయ్యర్లు) బాధ్యతగా రైతుల నుంచి పొగాకు కొనుగోలుకు సహకరించాలని బోర్డు విజిలెన్స్ అధికారి రవికాంత్ పేర్కొన్నారు. శనివారం ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2లో పొగాకు బయ్యర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులుకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. అలాగే నోబిడ్‌లు లేకుండా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వేలంనిర్వహణాధికారి జె.తులసి పాల్గొన్నారు.

ఆలయ భూములకు కౌలు వేలం

సింగరాయకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన భూములకు శనివారం ఆలయ ప్రాంగణంలో కౌలు వేలం పాట నిర్వహించారు. ఉలవపాడు మండలం కె.రాజుపాలెం సర్వే నంబర్ 477లోని 1.35 ఎకరాల భూమికి గత ఏడాది రూ.6,300 కౌలు ఉండగా ప్రస్తుతం నిర్వహించిన వేలంలో రూ.50వేలు పలికింది. మూలగుంటపాడు పంచాయతీ పరిధి సర్వే నంబర్ 38/2ఏలోని 2.74 ఎకరాల భూమికి గత ఏడాది కౌలు రూ.11వేలు ఉండగా ప్రస్తుతం రూ.31వేలకు చేరింది. కందుకూరు మండలం చుట్టుగుంట వద్ద 791 సర్వే నంబర్‌లోని 5.52 ఎకరాల భూమికి గత ఏడాది రూ.4వేలు ఉండగా ప్రస్తుతం రూ.19వేలు పలికింది. గత ఏడాదితో పోల్చుకుంటే 9.61 ఎకరాల భూమిపై అదనంగా దేవస్థానానికి రూ.80వేల వరకు ఆదాయం సమకూరింది. వేలం పాట నిర్వహణలో ఈవో పి.కృష్ణవేణి, రికార్డు అసిస్టెంట్ బాపట్ల బ్రహ్మయ్య, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

'పాటిరత్నాలు' పుస్తకావిష్కణ

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన ప్రముఖ రచయిత ఉప్పలపాటి వెంకటరత్నం రచించిన పాటిరత్నాలు కవితా సంకలనాన్ని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్‌వీ.రమణ, శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్‌లు శనివారం ఆవిష్కరించారు. ఎన్టీఆర్ కృష్ణా జిల్లా అవనిగడ్డలో జరుగుతున్న మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో ఈ పుస్తకావిష్కరణ జరిగింది. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమా, పితాని సత్యనారాయణ, ఎమ్మెల్సీ నెట్టెం రఘురామ్‌ప్రసాద్, విల్సన్, గుమ్మడి గోపాలకృష్ణ, డాక్టర్ జీవీ.పూర్ణచంద్, డాక్టర్ నూనె అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరత్నంను ఘనంగా సత్కరించారు.

పంచాయతీల్లో పైసల్లేవ్

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆర్థిక సంఘం మొదటి విడత నిధులను గత నవంబరులో పంచాయతీలకు జమ చేసింది. ఇక ఇదే రీతిన నిధులు వస్తాయని పాలకవర్గాల సంతోషం ఎంతోకాలం నిలవలేదు. రెండో విడత నిధులు విడుదలలో తీవ్రజాప్యం జరుగుతుండటంతో పాలకవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాకు మళ్లించుకుంది. నిధుల కోసం గతంలో మాదిరిగానే ఆందోళన బాట పట్టారు. పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి కార్యాలయం వద్ద గత మంగళవారం ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. నిధులు జమ చేయకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని సర్పంచ్‌లు స్పష్టం చేసినా ప్రభుత్వంలో స్పందనలేదు.

మైలవరం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


శాంతినగర్- మైలవరం రోడ్డులో జరుగుతున్న అభివృద్ధి పనులు

అద్దంకి, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతినగర్- మైలవరం మధ్య రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన తారు రోడ్డుకు కనీస మరమ్మతులు కూడా చేపట్టక పోవడంతో రహదారి అధ్వానంగా తయారైంది. దీంతో ప్రస్తుతం రహదారి అభివృద్ధికి మంత్రి రవికుమార్ రూ.5.10 కోట్లు మంజూరు చేయించడంతో పనులు ప్రారంభమయ్యాయి. దీంతో అద్దంకి మండలంలోని వెంపరాల, ఉప్పలపాడు, మైలవరం, ఏలేశ్వరవారిపాలెం, బల్లికురవ మండలం వెలమవారిపాలెం, జమ్మలమడక గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పచ్చిరొట్టగా నువ్వును దున్నేస్తున్న రైతులు


తిమ్మనపాలెంలో నువ్వు పంటను దున్నేస్తున్న రైతులు

మేదరమెట్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు నువ్వు పంటను పచ్చిరొట్ట ఎరువుగా పొలంలో దున్నేస్తున్నారు. తొలకరి వర్షాలు జూన్‌లోనే పడడంతో నువ్వు పంటను సాగు చేసిన రైతులు ప్రస్తుతం పొలంలో కలియదున్నేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా పొగాకు సాగు చేస్తున్న రైతులు పంట మార్పిడి కోసం నువ్వును సాగు చేశారు. పూత దశలో నాగళ్లతో దున్నేసి పొలంలో కలిపేస్తున్నారు. తద్వారా భూసారం పెరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. పంటమార్పిడి చేయడం వలన దిగుబడితో పాటు నాణ్యత పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. కొంతమంది రైతులు జనుము, పిల్లిపెసర వేసి దున్నేస్తున్నారు.

అమ్మ ఆశ్రమంలో అన్నదానం

మార్కాపురం, ఆగస్టు9:(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మ ఆశ్రమంలో శనివారం మండలంలోని వలపర్ల జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తానికొండ రత్నకుమార్ పేదలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. అంతేగాకుండా వారికి సబ్బులు, బ్రష్‌లు, కొబ్బరినూనె, తదితర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు పాల్గొన్నారు.

తిరుమలకు కూరగాయలు

● లారీలో 10 టన్నుల కూరగాయల తరలింపు

● భక్తిని చాటుకున్న మిథున్ చౌదరి



తిరుమలకు తరలి వెళుతున్న లారీ

నాగులపాలెం (పర్చూరు), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : తిరుమల అన్నదానికి పర్చూరు మండలం నాగులపాలెం నుంచి శనివారం గ్రామానికి చెందిన కొత్తపల్లి మిథున్ చౌదరి 10 టన్నుల కూరగాయలను తరలించి భక్తిని చాటుకున్నారు. దీనికి సంబంధించి గ్రామస్థుల నేతృత్వంలో ప్రత్యేక లారీని ఏర్పాటు చేసి లక్షమంది భక్తులకు అన్నదానంలో వినియోగించేలా సరఫరా చేశారు. తిరుముల తిరుపతి దేవస్థానానికి కూరగాయలను తరలిస్తున్నారన్న వార్త తెలియడంతో పెద్దఎత్తున గ్రామస్థులు పాల్గొని వివిధ రకాల కూరగాయల సేకరించి లారీలో తిరుమలకు తరలించారు. విజయవాకు చెందిన శ్రీ వెంకటేశ్వర భక్తి సమాజం ఆధ్వర్యంలో కూరగాయలను స్వామివారి ఆలయానికి పంపిణీ చేస్తున్నట్లు మిథున్‌చౌదరి తెలిపారు. కార్యక్రమంలో యలమంచి ఈశ్వరరావు, సోమేపల్లి సోదరులు, కొల్లా సుభాష్‌బాబు, అడ్డగడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

రాచర్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అచ్చంపేట గ్రామ పొలాల్లో పేకాటాడుతున్న ఆరుగురిని ఎస్సై పి కోటేశ్వరరావు శనివారం అరెస్టు చేశారు. గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమచారం అందడంతో ఎస్సై సిబ్బందితో దాడులు జరిపి పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1170 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

బీసీ హాస్టల్ తరలింపును విరమించుకోవాలి

● ఎస్ఎఫ్ఐ, బీసీ సంఘాల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కనిగిరిలోని బీసీ బాలుర హాస్టల్-2 తరలింపును తక్షణమే నిలుపుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలు లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖ అధికారులు ఇష్టానుసారం వ్యవహరించటం తగదన్నారు. కనిగిరిలోని బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులు పూర్తిస్థాయిలో ఉన్నారని, ఈక్రమలో హాస్టల్‌ను ఇమ్మడిచెరువు గ్రామానికి తరలిస్తామనడం అసంబద్ధంగా ఉందని విమర్శించారు. కనిగిరి ప్రాంతంలోని వసతిగృహాలలో 10మందికంటే తక్కువ ఉన్న హాస్టల్స్ ఉన్నాయని, అలాంటి వాటిని ఇమ్మడిచెరువు గ్రామానికి తరలించుకోవాలన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కనిగిరిలోనే హాస్టల్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీ హెచ్.వినోద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బంకా చిరంజీవి, చేతివృత్తిదారుల కమిటీ జిల్లా కార్యదర్శి రావెల మాలకొండయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి. రఘురామ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్, ఏ పీజేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్, నాయకులు కోటే శ్వరరావు, ఆనంద్, రాజశేఖర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలి

● రైతు సంఘం నాయకులు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం స్వామినాథన్ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అ మలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని ఎల్బీజీభవన్‌లో స్వామినాథన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రప టానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు జుజ్జూరి జయంతిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వి.కృ ష్ణయ్య మాట్లాడుతూ స్వామినాథన్ సిఫార్సులు వ్యవసాయరం గానికి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. వ్యవసాయరంగ అభివృద్ధి వాటి అమలుతోనే సాధ్యపడుతుందన్నారు. పేదల చేతుల్లో వ్యవసాయ భూములు ఉండాలని, ప్రాజెక్టులు కట్టాలని, రైతులకు అతితక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలనే స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, నాయకులు పెంట్యాల హనుమంతరావు, శ్రీకాంత్, కొల్లూరి వెంకటేశ్వర్లు, గాలి వెంకట్రామిరెడ్డి, ఏ డుకొండలు, సంతు వెంకటేశ్వర్లు, ప్రసాద్, రాజశేఖరరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో చిల్లచెట్ల తొలగింపు



పనులను ప్రారంభిస్తున్న గ్రామస్థులు

టంగుటూరు (కొండపి), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎం. నిడమలూరు గ్రామంలోని చెరువు చుట్టూ చిల్ల చెట్లు మొలిచి ఇబ్బందికరంగా మారాయి. ఈనేపథ్యంలో టీడీపీ నాయకులు కాకు మాని శ్రీను (రామన్న గారి శ్రీను), బోడపాటి అంజిబాబు సొంత నిధులతో జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో చెట్లను తొలగించే పనులు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పుచ్చకాయల శ్రీరామ్మూర్తి, కాకుమాని చంద్రశేఖర్, బెజవాడ సింగయ్య, సుబ్బారావు, పిడుగురాళ్ల సురేష్‌బాబు పాల్గొన్నారు.

మురుగుకాల్వలు శుభ్రం చేయించండి

ఇంకొల్లు, ఆగస్టు 9, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులోని ప్రధాన మురుగు కాల్వలు పూడికతీత పనులు చేపట్టి రోగాలు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావు పంచాయితీ అధికారులను ఆదేశించారు. మురుగుకాల్వలు అధ్వానంగా ఉండటం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రధాన మురుగుకాల్వలపై ఉన్న ఆక్రమణలను తీసి కాల్వలను అభివృద్ధి చేయాలన్నారు. మురుగుకాల్వల్లో కలిపిన మరుగుదొడ్ల పైపులైన్లను తొలగించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని పంచాయితీ సెక్రటరీ అడ్డగడ్డ వెంకటేశ్వర్లుకు సూచించారు. ప్రధాన మురుగుకాల్వలను శనివారం తహసీల్దారు శ్రీనివాసరావుతో పాటు ఇంచార్జి ఎంపిడిఓ కిరణ్‌కుమార్ పరిశీలించి పంచాయతీ అధికారులకు తగు సూచనలు చేసారు.

ఈసీ, బీజేపీలపై చర్యలు తీసుకోవాలి

మార్కాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై నమోదైన ఓట్లకంటే లెక్కింపులో ఓట్ల శాతం పెంచుకుని దొంగ ఓట్లతో ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి 2024లో ఎన్‌డీఏ అధికారం చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు సయ్యద్ జావీద్ అన్వర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి భారతీయ జనతాపార్టీ, ఎన్నికల సంఘంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆటలతో ఆరోగ్యం

» న్యాయాధికారి సుభవాణి


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న న్యాయాధికారి సుభవాణి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఆటలతో ఆరోగ్యం సమకూరుతుందని మార్కాపురం 6వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.సుభవాణి అన్నారు. స్థానిక ఎస్‌వీకేపీ కళాశాలలో మార్కాపురం బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయవాదులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిత్యం కోర్టు కార్యక్రమాలలో బిజీగా ఉండే న్యాయవాదులకు ఇలాంటి ఆటల కార్యక్రమాలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో న్యాయాధికారులు కిశోర్ కుమార్, ఎం.బాలాజీ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సయ్యద్ అలీ జహీర్, కార్యదర్శి నాగేంద్ర కుమార్, స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ ఎం.సుబ్బారెడ్డి, న్యాయవాదులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

15న భక్తప్రహ్లాద నాటక ప్రదర్శన


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన భక్తప్రహ్లాద నాటకం ప్రదర్శన ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షుడు సూదనగుంట వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూములో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను రచించి, దర్శకత్వం వహిస్తున్న ఈ నాటకంలో సుమారు 50మంది నృత్య కళాకారిణులు పాల్గొంటున్నారని, ఇటువంటి ప్రక్రియ రెండు తెలుగురాష్ట్రాలలో ఇంతవరకు జరగలేదన్నారు. నృత్య కళాకారిణులు తొలిసారిగా సంభాషణలతో నాటకాన్ని ప్రదర్శిస్తారని చెప్పారు. నాటకంలో పాల్గొంటున్న వారు ఇంజనీరింగ్, డిగ్రీ, ఇంటర్ విద్యార్థులన్నారు. అంతేకా ప్రత్యేక ఆకర్షణగా సురభి సంస్థ ఎఫెక్ట్‌లు నిలుస్తాయన్నారు. సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో ఆవరణలో నాటక ప్రదర్శన సాయంత్రం 6.30లకు ప్రారంభం అవుతుందని, ముందుగా సినీ సంగీత విభావరి ఉంటుందని పేర్కొన్నారు. కనుక కళాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో కాట్రగడ్డ రఘుపతిరావు, శ్రీపతి పేరయ్య, ఐనంపూడి నరసింహారావు, దాసరి నరేష్, గారె కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా రూ.100 కోట్లు అవినీతి జరిగిందని, దీనిపై కూటమి ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆటియా పాటియా అసోసియేషన్ సీవోఆర్డీ ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పటి క్రీడాశాఖ మంత్రి రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అన్నీ జిల్లాల డీఎస్‌డీవోలు కూడా అవినీతిలో భాగస్వాములుగా ఉన్నారని ఆరోపించారు. అందులో భాగంగా జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారిణిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ హయాంలో అవినీతికి పాల్పడిన వారు ఇంకా కొనసాగుతున్నారని, వాస్తవాలు నిగ్గు తేల్చాలని కోరారు. కార్యక్రమంలో టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ పాల్గొన్నారు.

చెన్నకేశవ, రంగనాథ ఆలయ చైర్మన్‌గా రుద్రయ్యచౌదరి

ఎస్ఎన్‌పాడు, ఆగస్టు 9ఆంధ్రజ్యోతి) : పేర్నమిట్టలో ఎన్టీఆర్ కళాక్షేత్రం సమీపంలో ఉన్న శ్రీచెన్నకేశవ, రంగనాథస్వాముల ఆలయ చైర్మన్‌గా శిఖరపు రుద్రయ్యచౌదరి, కమిటీ పాలకవర్గంతో శనివారం ఒంగోలు డివిజన్ ఎండోమెంట్ అధికారి సీహెచ్.వేణుగోపాల్ ప్రమాణం చేయించారు. ఆలయ అర్చకులు ఎక్స్ అఫిషియల్ మెంబర్‌గా పరాంకుశం రామక్రిష్ణామాచార్యులు ప్రమాణం చేశారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ రుద్రయ్యను పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రసన్నలక్ష్మి, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు, వివరం గోవిందు, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, వెంకటేశ్వరరావు, జి.ప్రసాద్, కందుకూరి వాసు, మన్నం పోలయ్య, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

ఒంగోలు(రూరల్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్రకార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. శనివారం ఒంగోలులోని సంఘ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో డిసెంబర్ 31నుంచి 2026జనవరి4వ తేదీ వరకు సీఐటీయూ మహాసభలు జరుగుతాయన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎం.రమేష్, రాష్ట్ర కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, పి.కల్పన, టి.రాము, బంకా సుబ్బారావు, పి.ఆంజనేయులు, పి.ఆవులయ్య పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కమిటీ

నాగులుప్పలపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) నూతన కమిటీ ఎన్నిక ఆదివారం ఒంగోలులో జరిగింది. రాష్ట్ర కౌన్సిలర్లు జె.వెంకటేశ్వరరావు, ఎస్‌కే.బషీరున్నీసా సమక్షంలో ఎన్నికల అధికారి కె.తిరుమల, పరిశీలకులు ఎం.యోహాన్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం మండల నూతన అధ్యక్షుడిగా టి.ఈశ్వరయ్య, ప్రధానకార్యదరిగ్శా షేక్ మౌలాలి, ఉపాధ్యక్షులుగా ఐ.ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, సీహెచ్.విజయలక్ష్మి, కార్యదర్శులుగా ఎన్.సంజీవరావు, ఎల్.సలోమి, ఎన్‌వీ.సుబ్బారావు, జి.సురేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా జవహర్‌బాబు, ఐవీ.సుబ్బారావు, జె.మోహనలక్ష్మి, షేక్ అల్లాభక్షు, కె.నరేంద్ర, కోశాధికారిగా కె.శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు.

అనుమానాస్పదంగా ట్రాక్టర్ దగ్ధం

పుల్లలచెరువు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శతకోడు సమీపంలోని పామాయల్ తోటలో అనుమానాస్పద స్థితిలో శుక్రవారం ఓ ట్రాక్టరు దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని పామాయిల్ తోటలో ఉంచిన ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టారు. దీంతో గంగవరపు సాంబులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అవీ.. ఇవీ..

మేనమామపై మేనల్లుళ్ల దాడి

● ఆస్తి వివాదాలే కారణం

● చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడు

చీరాల, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి) : అవివాహితుడైన మేనమామను ఇంటినుండి తరిమేసేందుకు మేనల్లుళ్లు తీవ్రంగా దాడిచేసి గాయపరిచారు. ఈఘటన శనివారం మున్సిపల్ పరిధిలోని నవాబ్ పేటలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం షేక్ లాల్‌బీకు అవివాహితుడైన షరీఫ్, ఆషా సంతానం. అయితే గతకొంత కాలం క్రితం భర్తతో విభేధించిన సోదరి ఆషా కుమారులిద్దరితో పుట్టింటికి వచ్చేసింది. అయితే ఇటీవల ఆమె భర్త రోడ్డు ప్రమాదంలో మరణించాడు. రెండు నెలల క్రిందట తల్లి లాల్‌బీ కూడా వయోభారంతో మృత్యువాత పడింది. తాజాగా సోదరితో ఇంటి హక్కు విషమయ్యి విభేధాలు చెలరేగాయి. ఈనేపథ్యంలోనే శనివారం కర్రలతో తలపై దాడిచేయగా రక్త స్రావంతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

భార్యపై కత్తితో భర్త దాడి

● చికిత్స పొందుతూ బాధితురాలి మృతి


మృతి చెందిన సుబ్బమ్మ

సంతమాగులూరు ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : భార్యను భర్త కత్తితో నరికి ఘటన మండలంలోని ఏల్చూరు గ్రామంలో శుక్రవారం అర్థరాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.., సల్లూరి మేరీబాబుతో సుబ్బమ్మకు(35)కు ఇరవై ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వివాహం తర్వాత నిందితుడు మేరీబాబుకు మద్యపానానికి బానిసయ్యాడు. దీంతో తరచూ ఇంట్లో వేధింపులకు గురిచేస్తుండడంతో సుబ్బమ్మ, ఏల్చూరు ఎస్సీ కాలనీలోని చర్చి బజారులో సొంత ఇంటిని నిర్మించుకొని తన పిల్లలతో కలిసి అక్కడే నివసిస్తోంది. అయినప్పటికీ నిందితుడు ఆమె ఇంటికి వెళ్లి వేధించడం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్థరాత్రి సమయంలో ఇంటి ఆరుబయట మంచంపై నిద్రిస్తున్న సుబ్బమ్మపై నిందితుడు మేరీబాబు కత్తితో తలపై నరికాడు. దీంతో సుబ్బమ్మ తలపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను వెంటనే 108 వాహనం ద్వారా నర్సరావుపేటలోని వైద్యశాలకు తరించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బమ్మ మృతి చెందింది. కాలనీకి చెందిన గేరా అంజయ్య ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట్రావు తెలిపారు. నిందితుడు మేరీబాబు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

బల్లికురవ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలమవారిపాలెం గ్రామ పంచాయతీ శివారు అయిన జమ్మలమడ కాలనీకి చెందిన గద్దల హనుమంత్ అను వ్యక్తిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఓ బాలికపై అత్యాచారం చేసి గర్భవతిని చేయడంతో బాధిత మహిళ ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు

అద్దంకి,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాయపాలెంలో ఇంటిస్థలం వివాదంపై జరిగిన ఘర్షణపై పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. దిరిశాల పార్వతి, నార్నె లక్ష్మీప్రియల ఫిర్యాదుల మేరకు శనివారం రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బల్లికురవ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేమవరం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రానైట్ పరిశ్రమలకు వెళ్లే విద్యుత్ సరఫరాకు ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఏ సురేంద్రబాబు తెలిపారు. వేమవరం, మల్లాయపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో కోత ఉంటుందన్నారు.


చికిత్స పొందుతున్న బాలిక మృతి

అద్దంకి, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): అత్త, మామలు ఇళ్ల ఖాళీ చేయమని ఒత్తిడి చేయడంతో మనస్థాపానికి గురైన తల్లికుమార్తెలు కొల్లూరి శ్రావణి, శ్రీదేవిలు సోమవారం ఎలుకల మందుతిని ఆత్మహత్యకు యత్నించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో రెండురోజుల క్రితం చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం తల్లి శ్రావణి మృతిచెందింది. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న పదవ తరగతి చదువుతున్న బాలిక శ్రీదేవి (15) శనివారం మృతి చెందింది. గుంటూరు వైద్యశాల నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చీరాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : తండ్రీకొడుకు నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో తండ్రికి తీవ్రగాయాలైన ఘటన శనివారం చీరాల- వేటపాలెం రోడ్డులోని ప్రసాద్ థియేటర్ సమీపంలో చోటుచేసుకొంది. తండ్రి కుమారులైన చెరుకూరి నాగేశ్వరరావు, శ్యాంలు ప్రసాద్ థియేటర్ సమీపంలో నడుచుకుంటూ వెళుతున్నారు. ఎదురుగా వచ్చిన బైకు తండ్రి నాగేశ్వరరావును ఢీకొట్టింది. వెంటనే బైకుపై ఉన్న ముగ్గురు అదేబైకుపై పరారయ్యారు. క్షతగాత్రుడు నాగేశ్వరరావు చీరాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. కుమారుడు శ్యాం ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికకు రజక సంఘం నేతల పరామర్శ


బాధితురాలిని పరామర్శిస్తున్న నాయకులు

చీరాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు ముగ్గు వేసుకుంటున్న బాలికపై ఉద్దేశ్య పూర్వకంగా పలువురు దాడిచేసి గాయపరచడం అన్యాయమని రజక సంఘం నాయకులు అన్నారు. కారంచేడు గ్రామంలో దేవిక ఇంటి ముందు ముగ్గు వేసుకుంటూ ఉండగా, ఇరుగు పొరుగు వారితో వివాదం జరిగింది. ఈక్రమంలో పలువురు ఆమెపై దాడిచేశారు. దీంతో తీవ్ర గాయాలైన ఆమెకు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు చర్యలు చేపట్టక పోవడం బాధాకరమని కొండయ్య, జనార్థన్, తదితరులు విమర్శించారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

పేరాల(చీరాల), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : నేడు పేరాలలో ఉన్నం సంగీతరావు కుటుంబ సభ్యులు, ప్రసాద్ దయాగ్నోస్టిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరం ప్రారంభానికి హైకోర్టు న్యాయమూర్తి సుమతి జగడం, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిరుపేద ప్రజలకు వైద్యసాయం అందించేందుకే క్యాంపు నిర్వహిస్తున్నట్లు షెర్లీ ఫ్లోరెన్స్ తెలిపారు. ఈ క్యాంపులో గుండె, నరాలు, జనరల్ అండ్ ప్లాస్టిక్ శస్త్ర చికిత్సలు, క్యాన్సర్, కంటి, డయాబెటిస్ వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు తెలిపారు.

జ్వరాలతో జర జాగ్రత్త

● వివిధ గ్రామాల్లో జ్వర పీడితులు

● జిల్లా యంత్రాంగం ఆదేశాలతో అప్రమత్తమైన అధికారులు


ఫీవర్ సర్వేపై మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గానికి జ్వరం భయం పట్టుకుంది. గత కొద్ది రోజులుగా సుమారు నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇక టైఫాయిడ్, వైరల్‌ఫీవర్లు వెలుగు చూస్తున్నాయి. దీంతో చీరాల ఏరియా వైద్యశాలలో రోజు వారీ ఓపీల సంఖ్య సైతం పెరుగుతోంది. ఇటీవల ఇతర జిల్లాల్లో డెంగీ మరణాలు కూడా చోటు చేసుకుంటుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒకవైపు నియోజకవర్గంలో కోర్టు వివాదాల కారణంగా పంచాయతీ ఎన్నికలు జరుగలేదు. ఈ క్రమంలో నిధుల్లేక గ్రామాలు అధ్వానంగా ఉంటున్నాయి. జీతాలు అందకపోవడంతో పారిశుధ్య కార్మికులు అంతంత మాత్రంగానే విధుల్లోకి వస్తున్నారు. దీంతో గ్రామాల్లో శానిటేషన్ పూర్తిగా మూలన పడింది. రెండు రోజులుగా జిల్లా యంత్రాగం జోక్యంతో కొంత మేరకు పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నారు. ఈక్రమంలోనే శనివారం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్‌గా గోపీకృష్ణ చీరాల మండల పరిధిలోని తోటవారిపాలెంలో ఎంపీడీవో శివన్నారాయణ, ఈవోఆర్డీ రామకృష్ణ ఆధ్వర్యంలో పారిశుధ్యంపై ప్రత్యేకడ్రైవ్ నిర్వహించారు. చెత్తసేకరణతో పాటు రహదారుల్లోని మురుగు నీటి నిల్వల ప్రాంతాల్లో బ్లీచింగ్ చేయించారు. మరోవైపు ఫీవర్ సర్వేపై ఆరా కూడా తీస్తున్నారు. అయితే మున్సిపాలి టీల్లో కూడా కొన్ని ప్రాంతాల్లో చెత్తా చెదారం, వ్యర్థ జలాలు పెరిగి పోయాయి. ఈ క్రమంలో అధికారులు ప్రజల ఆరోగ్యరీత్యా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

పారిశుధ్యాన్ని మెరుగు పరచాలి

సంతమాగులూరు : పాతమాగులూరు గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహణ మెరుగు పరచాలని జిల్లా పరిషత్ ఒంగోలు డిప్యూటీ సీఈవో, అద్దంకి నియోజకవర్గ ప్రత్యేక అధికారి బాలమ్మ అధికారులకు సూచించారు. శనివారం పాత మాగులూరు గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో పారి శుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. కాలనీలలో ఇంటింటికి వెళ్లి డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి జిర్రా విజయ్‌బాబు, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఈవోపీఆర్డీ శివరాం ప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేశాం

బల్లికురవ : సీజనల్ వ్యాధులు రాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం రాత్రి మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో దోమల నివారణకు గ్రామ పంచాయతీ చేపడుతున్న ఫాగింగ్‌ను అయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాలలో రోడ్ల వెంబడి చెత్త, మురుగు లేకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. డెంగ్యూ జ్వరాలు రాకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో పాండురంగస్వామి, పంచాయతీ కార్యదర్శి షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అవిశన జ్యోతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలల్లో మురుగు కాలువలు శుభ్రపరచడంతో పాటు మురుగు నీరు ఎక్కడ నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోలన్నారు. అవరమైన ప్రాంతాలల్లో బ్లీచింగ్ చల్లాలని, అయిల్ బాల్స్ వంటివి వేయాలని సూచించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు ప్రభుత్వ పథకాలు, అమలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జ్వరాల సర్వేపై నిర్లక్ష్యం వద్దు

అద్దంకిటౌన్ : గ్రామంలో పంచాయతీ, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, డ్రైడే, జ్వరాల సర్వేపై నిర్లక్ష్యంగా వ్యహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. శనివారం మండలంలోని గోపాలపురం గ్రామంలో డ్రైడే, జ్వరాల సర్వేను ఎంపీడీవో పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఆర్‌వీఎస్ ప్రసాదరావు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : విషజ్వరాలు ప్రబలకుండా సంబంధిత శాఖాధికారులు గ్రామాలలో తక్షణ చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి అనంతరాజు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని బూదవాడ, కల్లంవారిపాలెం, చినమల్లవరం గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నీటి నిల్వ ఉన్నచోట ఆయిల్‌బాల్స్ వేయించి ఎబేట్ స్ప్రే చేయించారు. బూదవాడ, రామకూరు గ్రామాలలో దోమల బెడద నివారించేందుకు శనివారం పూర్తిస్థాయిలో ఫాగింగ్ చేయించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుమంత్ తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య, ఆర్.డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య, కార్యదర్శి రాంబాబు, పంచాయితీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు స్థానిక నేతలు పాల్గొన్నారు.




నక్కబొక్కలపాడు, అద్దంకిలో పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న అధికారులు, పంగులూరులో ఖాళీ తొట్టిని పరిశీలిస్తున్న అధికారులు

14న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం


ప్రతిష్ఠకు సిద్ధమైన అమ్మవారి ఆలయం

బల్లికురవ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామంలో పోలేరమ్మతల్లి, అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్స వం ఈ నెల 14న నిర్వహించనున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో వెంకటేశ్వరస్వామి నామాల ప్రతిష్ఠ కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం నుంచి ప్రతిష్ఠ క్రతువు ప్రారంభమవుతుందన్నారు. గురువారం ఉదయం 11.58 గంటలకు ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం అన్నదానం గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

కోలాహలంగా కొలువులు

పంగులూరు : మండలంలోని కొండమంజులూరులో గ్రామదేవత పోలేరమ్మతల్లి కొలుపులు శనివారం ఘనంగా నిర్వహించారు. తమ ఇష్ట దైవంగా భావించే పోలూరమ్మకు పొంగల్లు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రెండవ రోజు ఆదివారం అమ్మవారి పూజాకార్యక్రమాల అనంతరం గ్రామంలో భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు కరణం రామారావు, పెంట్యాల ఆంజనేయులు తెలిపారు.

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. శనివారం రోజే శ్రావణ మాసం పౌర్ణమి కూడా కలిసి రావడంతో భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకుపూజలు, వాహనపూజలు, అర్చనలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. లక్ష తమలపాకుల పూజలో పాల్గొన్న ఉభయ దాతలను సత్కరించి ఆశీర్వదించారు. గొర్రెల కాపరులు తమ గొర్రెల మందలతో వచ్చి ఆలయ ప్రదక్షణలు చేశారు.

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, క్విజ్ ఇంజనీ రింగ్ కళాశాల చైర్మన్ ఎస్.కల్యాణ చక్రవర్తి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అద్దంకికి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎల్ సుబ్రహ్మణ్య శర్మ అద్దంకి లో ఏర్పాటు చేసిన భారతీయ సేవ వెల్ఫేర్ సొసైటీని కల్యాణ చక్రవర్తి ప్రారంభించారు.



లక్ష తమలపాకులతో స్వామివారు, పూజల అనంతరం చక్రవర్తి

జూటు సంచుల పంపిణీ


సంచులను పంపిణీ చేస్తున్న కమిషనర్ రవీంద్ర

అద్దంకి, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత అద్దంకి వైపు ముందడుగు వేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయం అని మున్సిపల్ కమీషనర్ రవీంద్ర అన్నారు. అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు జన్మదినం సందర్భంగా 500 జ్యూట్ బ్యాగులను, కరపత్రాలను శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా కమీషనర్ రవీంద్ర మాట్లాడుతూ డిసెంబర్ నాటికి అద్దంకి పట్టణంలో పూర్తిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కావూరి రఘుచంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి, ముత్తయ్య, తోకల శ్రీను, షేక్ కరిముల్లా, అన్నాబత్తిన రమేష్, గంగినేని బాబు, పవన్, శ్రీను. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నం త్రిమూర్తులును కమిషనర్ అభినందించి ప్రశంసపత్రం అందజేశారు.

కళ్ల సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలి

● డాక్టర్ వాకా రాజశేఖర్‌రెడ్డి


పరీక్షలు నిర్వహిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

పంగులూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కళ్ల సంరక్షణలో ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని ఒంగోలుకు చెందిన శ్రీకృష్ణనేత్రాలయం వైద్యులు విశ్రాంత ఆర్మీలెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ వాకా రాజశేఖరరెడ్డి సూచించారు. మండలంలోని బూదవాడ గ్రామంలో శనివారం గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణనేత్రాలయం వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో వందమందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 26 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించినట్లు డాక్టర్ రాజశేఖరరెడ్డి తెలిపారు. వీరికి ఎన్‌టీఆర్.భరోసా పథకం ద్వారా ఉచిత ప్రయాణవసతి కల్పించి శస్త్రచికిత్సలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఏ నరసింహారవు, వీఆర్‌వో వందనం, వైద్యశాల సిబ్బంది రమణ, రామయ్య, సుచిత్ర, గౌస్, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

బస్టాండ్‌ను పరిశీలించిన ఆర్‌టీసీ అధికారి


డిపో పరిసరాలను పరిశీలిస్తున్న సామ్రాజ్యం

ఇంకొల్లు, ఆగస్టు 9,(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ జిల్లా రవాణా అధికారి డి.సామ్రాజ్యం శనివారం ఇంకొల్లు బస్టాండును పరిశీలించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాల ఏర్పాట్లపై పూర్తిస్థాయిలో సమాచారం, సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా ఆమె ఇంకొల్లు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంకొల్లు మండల ప్రయాణీకుల సంఘం అధక్షులు మోహనకృష్ణ ఆమెను కలిసి సమస్యను వివరించారు. చీరాలకు ప్రస్తుతం నాలుగు సర్వీసులు మాత్రమే తిరగడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఇంకొల్లు నుంచి ప్రధాన పుణ్యక్షేత్రాలకు, విజయవాడ, బెంగుళూరుకు బస్సు సర్వీసులు నడపాలని విన్నవించారు. పావులూరు రోడ్డులోని ఆర్టీసీ డిపో స్థలాన్ని ఆమె పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న డిపో స్థలాన్ని బాగు చేయాలని చీరాల డిపో మేనేజరు శ్యామలను ఆదేశించారు. గ్రామానికి నడిబొడ్డున ఉన్న ఇంకొల్లు బస్టాండులో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు.

మొలకెత్తని గుమ్మడి విత్తనాలు

● దుకాణం యజమానిపై రైతుల ఆగ్రహం

మార్టూరు,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లాపల్లి గ్రామానికి చెందిన కొంతమంది రైతులు మార్టూరులోని ఓ దుకాణం వద్ద కొనుగోలు చేసిన గుమ్మడి విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో శనివారం రైతులు దుకాణం వద్దకు చేరుకొని యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పది మంది రైతులు 25 ఎకరాలకు సంబంధించి సదరు దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేశారు. అయితే అవి మొలకెత్తలేదు. ఇప్పటికే ఎకరాకు రూ.10 వేలు వెచ్చించి సాగు చేశామని దీంతో పెట్టుబడి నష్టపోయినట్లు రైతులు వాపోయారు. దీనిపై షాపు యజమాని కంపెనీ ప్రతినిధులను రైతుల వద్దకు పంపించారు. మొలకెత్తని మాట వాస్తవమేనని గుర్తించిన సదరు కంపెనీ ప్రతినిధి ఎలాంటి సమాధానం చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గవర్నర్ నజీర్‌ను కలిసిన ఎమ్మెల్యే కొండయ్య


గవర్నర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చీరాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల వ్యక్తిగత పర్యటనలో ఉన్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఎమ్మెల్యే కొండయ్య మార్యద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి కుశల ప్రశ్నలు వేశారు. అయితే కొండయ్య ఎమ్మెల్యేగా అధికారం చేపట్టిన అనంతరం ఇప్పటికి చీరాల గవర్నర్ పర్యటన ఇది మూడవసారి. అయితే గత రెండుసార్లు ఆ సమయంలో ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో శనివారం మొదటిసారిగా గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కొండయ్య కలిశారు.

టెర్రస్ గార్డెన్‌తో ఆరోగ్యం


సిటీ టెర్రస్ గార్డెన్ కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రతినిధులు

చీరాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని బాల్కనీల్లో, మేడలపై పచ్చని మొక్కలు, ఆకు కూరలు, కూరగాయాలు పండించడం వలన పరిసరాల్లో ప్రాణవాయువు మెరుగుపడి ఆరోగ్యంగా ఉంటారని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం స్థానిక యుటీఎఫ్ కార్యాలయంలో సీటీజీ(సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ స్వరూపమే మారి పచ్చని వాతావరణంలో శ్రేష్టంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్, ఐ.సుభాషిణి, వెంకట సుబ్బారావు, పవని భానుచంద్రమూర్తి, బిక్షాలు, జానమ్మ, క్రిష్టాఫర్, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో ట్రాఫిక్ జామ్


అద్దంకిలో నిలిచిన ట్రాఫిక్

అద్దంకి,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో శనివారం పలుమార్లు ట్రాఫిక్ నిలిచింది. ప్రధానంగా పట్టణంలోని భవానిసెంటర్ ఐదు రోడ్లు కూడలి కావడంతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతుంది. రేణింగవరం రోడ్డు నుంచి దర్శి వైపు వెళ్లే వాహనాలు నామ్ రోడ్డు క్రాస్ చేయాల్సి రావడంతో ఆ సమయంలో వాహనాలు అడ్డదిడ్డంగా వెళ్లా ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రతి రోజు ట్రాఫిక్ నిలిచిపోతున్నా శనివారం వాహనాలు రద్దీ ఎక్కువగా ఉండటంతో పలుమార్లు ట్రాఫిక్ నిలిచింది. రాత్రి సమయంలో కూడా నామ్ రోడ్డులో వాహనాలు భవానిసెంటర్ నుంచి పోతురాజుగండి వరకు, మరో వైపు దామావారిపాలెం వరకు నిలిచిపోయాయి. రద్దీగా ఉండే సమయాలలో మాత్రమే పోలీసులు ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన సమయాల్లోనూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఇక భారీ వాహనాలు వచ్చినప్పుడు మరింత ఇబ్బంది గా మారుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ రద్దీ తగ్గించే విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఖరీఫ్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా ప్రణాళిక

\- ఎమ్మెల్యే కొండయ్య

బుర్లవారిపాలెం(చీరాల), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ రైతులకు ఇబ్బంది లేకుండా సాగు నీరు అందించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని గవినివారిపాలెం ఎత్తిపోతల పథకానికి సంబంధించిన నీటిని ఎమ్మెల్యే విడుదల చేశారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి ఈ ఏడాది సాగుకు సంబంధించిన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 10 ఆగస్టు 2025



శ్రీనివాసా గోవిందా.. శ్రీ వేంకటేశా గోవిందా!

వేదపండితుల మంత్రోచ్ఛరణ.. భక్తుల గోవిందనామస్మరణల నడుమ ఉదయగిరిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరుడి కల్యాణం కనులపండువగా సాగింది. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తజనం తరలిరావడంతో ఉదయగిరి కిక్కిరిసిపోయింది.

- వివరాలు 8లో..

'సోమశిల' నీటిమట్టం

అనంతసాగరం ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో సోమశిల డ్యాంలో నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. శనివారం 15,836 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగగా, జలాశయంలో నీటినిల్వ 38.705 టీఎంసీలకు చేరుకుంది. ఉత్తర కాలువకు 370, వరద కాలువకు 6,000, డెల్టాకు 3,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రేపటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సోమవారం నుంచి ఎస్‌ఏ-1 పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి మొదటి నిర్మాణాత్మక ముదింపు (ఎస్‌ఏఎంపీ-1) పేరుతో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. 1 నుంచి 5వతరగతి వరకు మూడు రోజులు, 6 నుంచి 10వతరగతి వరకు నాలుగు రోజులు పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షల్లో ప్రతి సబ్జెక్టుకు 35 మార్కులతోపాటు ప్రతి సబ్జెక్ట్‌లో తరగతి గది ప్రతిస్పందనలు, రాతపనులు, ప్రాజెక్టపనులకు ఒక్కోదానికి 5 మార్కులు చొప్పున పరీక్ష నిర్వహించి 50 మార్కులకు ముదింపు చేస్తారు. ఈ ఏడాది ప్రత్యేకంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ సమాధానాలు రాసేందుకు ప్రతి సబ్జెక్టుకు ఒక బుక్‌లెట్‌ను అందించనున్నారు. ఉపాధ్యాయులు జవాబులను మూల్యాంకనం చేసి ఈ మార్కులను ముదింపు పుస్తకంలోని ఓఎంఆర్‌లో నమోదు చేయడంతోపాటు స్కాన్‌చేసి లీప్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. ఈ ఫలితాలను రాష్ట్రస్థాయిలో ముదింపు చేసి ప్రస్తుత విద్యా ప్రమాణాలు, చర్యల మీద ఉపాధ్యాయులకు ఉన్నతాధికారులు సూచనలు అందచేస్తారు.

ప్రైవేట్ ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ లేకుంటే చర్యలు

- వివరాలు 8లో



సీఎం చంద్రబాబు సందేశాన్ని వింటున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, కలెక్టర్ ఆనంద్ ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, భగత్‌సింగ్‌కాలనీవాసులు



అందుకున్న పట్టాలను చూపుతున్న భగత్‌సింగ్‌కాలనీవాసులు

2029 కల్లా ప్రతి ఒక్కరికీ

సొంతిల్లు ఉండాలి

- ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపాం
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- భగత్‌సింగ్‌కాలనీ వాసులకు ఇళ్లపట్టాల పంపిణీ
- అమరావతినుంచి వర్చువల్‌గా పాల్గొన్న సీఎం

నెల్లూరు (వెంకటేశ్వరపురం) ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): 2029 కల్లా రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు స్పష్టం చేశారు. శనివారం నెల్లూరులోని భగత్‌సింగ్‌కాలనీవాసులకు మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. ముందుగా సీఎం ఆదేశాల మేరకు ఎంపీ వేమిరెడ్డి, మంత్రి నారాయణలు సయ్యద్ సబిహా, షేక్.మస్తానమ్మలకు పట్టాలు అందజేశారు. ఇదే సమయంలో లబ్ధిదారులందరికీ ఒకే సమయంలో సచివాలయ సిబ్బంది పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రాఖీ పండుగ వంటి పవిత్రమైన రోజు 633 మంది పేద మహిళలకు శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేయడం ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని కలిగించడంతో పాటు అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపామన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఏళ్లతరబడి నివాసాలు ఉంటూ పట్టాలు లేని పేదలను గుర్తించి పట్టాలు అందజేయాలని ఎమ్మెల్యేలకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి చూపామన్నారు. ఈ నెల 15 నుంచి రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలపారు. ఇలాంటి అనేక కార్యక్రమాలు రాష్ట్రంలో అమలు చేయగలుతున్నామంటే అందరి ఆశీర్వాదం వల్లే సాధ్యమవుతుందన్నారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ పెన్నానది తీరంలో ఉన్న భగత్‌సింగ్‌కాలనీ ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టాలు అందజేసినట్లు చెప్పారు. ఇదేవిధంగా నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు పట్టాలు ఇప్పించాలని కోరుతున్నట్లు తెలియజేశారు. త్వరలోనే పరిశీలించి ఎలాంటి వివాదాలు లేకుండా ఉంటే వారందరికీ పట్టాలు అందజేస్తామన్నారు. కాగా థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులతో లబ్ధిదారులు నినాదాలు చేశారు. ఎంపీ, మంత్రి చేతుల మీదుగా టీడీపీ నాయకులు జహీర్, జమీర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, కమిషనర్ నందన్, ఆర్డీవో అనూష, తహసీల్దారు షఫీమాలిక్, టీడీపీ నాయ కులు విజయభాస్కర్‌రెడ్డి, అనూరాధ, రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరికి చేరుకున్న సెల్వన్ సైకిల్‌యాత్ర

పర్యావరణం కోసం ఓ యువకుడి సాహసయాత్ర

- మూడున్నరేళ్లుగా సైకిల్ తొక్కుతూ..
- ఊరూరా తిరుగుతూ
- ఉదయగిరికి చేరుకున్న తమిళ తంబి

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా.. ప్రాణవాయువు అందక ఎవరూ మృతి చెందకూడదన్న లక్ష్యంతో ఆ యువకుడు సైకిల్ యాత్ర ప్రారంభించాడు. మూడున్నరేళ్లగా సైకిల్ తొక్కుతూ విద్యార్థులు, ప్రజలకు పర్యావరణం ప్రాధాన్యతను వివరిస్తున్నాడు. అంతే కాదు.. వారితోపాటు తనూ మొక్కలు నాటుతున్నాడు. అలా ఊరూరా సైకిల్ తొక్కుతూ శనివారం ఉదయగిరికి చేరుకున్నాడా యువకుడు. ఈ సందర్భంగా ఆయన్ను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. తన పేరు ముత్తుసెల్వన్ అని, తమిళనాడులోని కోయంబత్తూరుగా చెప్పుకొచ్చారు. కొవిడ్ సమయంలో ఆక్సిజన్ అందక చాలామంది మృత్యువాతపడటం తనను కలచివేసిందని అన్నారు. దీంతో పర్యారవణంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో 2021, డిసెంబరు 21వ తేదీన సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటివరకు మూడు రాష్ట్రాల్లో తిరిగానని, పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించి 8 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. దేశంలో అన్ని రాష్ట్రాలతోపాటు ప్రపంచంలోని మరో ఏడు దేశాల్లో తన సైకిల్ యాత్ర కొనసాగించనున్నట్లు తెలిపారు. 2028లో తన యాత్ర ముగుస్తుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

ఇక హాస్టళ్లకూ

మార్కులు!

- ఫలితాలు పెంచడమే ధ్యేయం
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలులోకి..

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన ఫలితాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. హాస్టళ్ల మధ్య పోటీతత్వాన్ని పెంచి ప్రగతి సాధించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం

- మిగతా 7లో



హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

- 61 ఆలయాలకు కొత్త కమిటీలు
- నోటిఫికేషన్ జారీతో ఆశావహుల్లో ఆనందం
- ఇప్పటికే నేతల వద్దకు క్యూ
- పెద్ద ఆలయాలకు పెరుగుతున్న పోటీ

నామినేటెడ్

కోలాహలం

నెల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. ఎన్డీఏ కూటమి పార్టీల్లో నామినేటెడ్ పదవుల పందేరం మొదలైంది. ఇప్పటికే వ్యవసాయ మార్కెట్ కమిటీలు, డీసీసీబీ, డీసీఎంఎస్, సాగునీటి సంఘాలు వంటి నామినేటెడ్ కమిటీల నియామకం పూర్తవగా ఇప్పుడు దేవాలయాల వంతు వచ్చింది. ఏకంగా జిల్లాలో 62 దేవాలయాలకు కొత్త పాలకవర్గాలను నియమించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. దాదాపు 650 మందికిపైగా ఈ కమిటీల్లో చోటు దక్కనుంది. దీంతో ఆయా పార్టీల్లో ఆశావాహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అదే సమయంలో ఈ దఫా ఆలయ పాలకవర్గాల్లోకి నాయీ బ్రాహ్మణులు, బ్రాహ్మణులకు కూడా చోటు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో ఆ వర్గాల్లోనూ సందడి కనిపిస్తోంది.

45 చిన్నవి.. 17 పెద్దవి

జిల్లాలో ఉన్న ప్రధాన ఆలయాలన్నిటికీ నూతన పాలకవర్గాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో జిల్లాలోని 62 ఆలయాలకు నోటిఫికేషన్లు విడుదల చేసింది. అందులో 45 చిన్న ఆలయాలు, 17 పెద్ద ఆలయాలు ఉన్నాయి. సంవత్సర ఆదాయం రూ.25 లక్షల్లోపు ఉన్న 45 ఆలయాలకు సంబంధించి గత నెలలో నోటిఫికేషన్ విడుదల కాగా, ఆదాయం రూ.1 కోటిపైగా ఉన్న ఆలయాలకు తాజాగా నోటిఫికేషన్ విడుదలైంది. చిన్న ఆలయాలకు గానూ ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. పెద్ద ఆలయాలకు సంబంధించి పాలకవర్గ సభ్యుల కోసం దరఖాస్తులను మరో 20 రోజుల వరకూ స్వీకరించనున్నారు. చిన్న ఆలయాల కమిటీల్లో మొత్తం 10 మంది సభ్యులుగా ఉంటారు. పెద్ద ఆలయాల్లో ఈ సంఖ్య 12 ఉంటుంది. వీరిలో ఒకరిని ఛైర్మన్‌గా ఎన్నుకుంటున్నారు. ఈ లెక్కన చూసుకుంటే మొత్తం 62 ఆలయాలకు 650మందికిపైగా పాలకవర్గ సభ్యులుగా నియామకం కానున్నారు. వీరిలో 50 శాతం మహిళలు ఉండడం విశేషం.



పలేటివారిపాళెం : మాలకొండలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రధాన ముఖద్వారం

అధికార పార్టీల్లో సందడి

సాధారణంగా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి సంబంధించిన అర్హులైన వారిని ఆలయ పాలకవర్గాల్లో నియమిస్తుంటారు. కొన్నిచోట్ల ధార్మిక సంస్థలకు చెందిన వారికి, ఆధ్యాత్మిక సేవకులకు కూడా చోటు కల్పిస్తుంటారు. ఇప్పుడు ఒకేసారి అన్ని ఆలయాలకు నోటిఫికేషన్లు వెలువడటంతో కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీల్లో సందడి నెలకొంది. ప్రజాప్రతినిధుల ఇళ్లు కోలాహలంగా మారాయి. అందులోనూ పెద్ద దేవాలయాలకు పోటీ ఎక్కువగా కనిపిస్తోంది. జిల్లాస్థాయి నేతలు ఈ ఆలయాల ఛైర్మన్ పదవుల కోసం గట్టిగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. చిన్న ఆలయాలకు మాత్రం ఆయా ప్రాంతాల్లోని వారినే నియమించే ఆలోచన జరుగుతోంది. వచ్చే నెలాఖరులోపు ఈ నామినేటెడ్ పదవుల భర్తీ పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.

వెంకన్న సన్నిధిలో తన బిడ్డకు పుట్టివెంట్రుకలు తీయించేందుకు ఆ కుటుంబం ఉత్సాహంగా బయలుదేరింది. చిన్నారితో కబుర్లాడిన వారంతా అలసిపోయి అప్పుడే కునుకు తీశారు. అర్ధరాత్రి కావడంతో రోడ్డంతా చిమ్మచీకటి. త్వరగా గమ్యం చేరాలన్న ఉద్దేశంతో డ్రైవర్ కూడా వాహన వేగం పెంచాడు. ముందు వెళుతున్న లారీని అధిగమించబోయింది. అంతే ఒక్కసారిగా కుదుపు. వారు ప్రయాణిస్తున్న వాహనం నడిరోడ్డుపై తలకిందులైంది. హాహాకారాలు. తేరుకునేలోపు కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు భార్యలను కోల్పోయారు. ముక్కుపచ్చలారని బిడ్డతోపాటు నానమ్మ, వియ్యంకుడిని మృత్యువు పొట్టన పెట్టుకుంది. శనివారం తెల్లవారుజాము 2 గంటల ప్రాంతంలో ఉలవపాడు హైవేపై ఈ ఘటన చోటు చేసుకుంది.



ప్రమాదానికి కారణమైన తుఫాన్ వాహనం

మొక్కు తీర్చుకోకనే..!

- 11 మంది కుటుంబ సభ్యులతో తిరుమలకు పయనం
- మార్గమధ్యంలో కబళించిన మృత్యువు
- ముందు వెళుతున్న లారీని ఢీకొని 'తుఫాన్' వాహనం బోల్తా
- ఘటనాస్థలిలో ఇద్దరు, ఆసుపత్రిలో ముగ్గురు దుర్మరణం
- మృతుల్లో తోడికోడళ్లు, అత్త, వియ్యంకుడు, మూడేళ్ల చిన్నారి
- ఉలవపాడు వద్ద జాతీయరహదారిపై ఘోరం

ఉలవపాడు/మాచవరం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచవరంలోని గణేశునిపాడు గ్రామానికి చెందిన నంబుల వెంకటేశ్వర్లు, సుభాషిణిల కుమారుడు అభిరామ్‌కు (3) తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరుడి సన్నిధిలో పుట్టివెంట్రుకలు తీయించాలని భావించారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో తుఫాన్ వాహనంలో శుక్రవారం రాత్రి తిరుమలకు బయలుదేరారు. వెంకటేశ్వర్లు కుటుంబంతోపాటు తమ్ముడు శ్రీనివాసులు, ఈయన భార్య రుక్మిణి, వియ్యంకుడు శ్రీనివాసరావు మొత్తం 11 మంది బయలుదేరారు. మార్గమధ్యంలోని ఉలవపాడు మండలం చాగొల్లు జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న ఇనుములోడు లారీని అధిగమించబోయి లారీని వెనుక భాగాన్ని తుఫాన్ వాహనం ఢీకొంది. ఈ ధాటికి వాహనం ఎడమ వైపు చక్రం ఊడిపోవడంతో ఒక్కసారిగా అతివేగంతో రోడ్డుపై బోల్తా కొట్టింది. రోడ్డుకు గుద్దుకున్న భాగం వైపు ఉన్నవారికి తీవ్ర గాయాలై శరీర భాగాలు తెగి రోడ్డుపై పడ్డాయి. రుక్మిణి (28) ఎడమ చెయ్యి తెగిపడింది. చిన్నారి అభిరామ్ అపస్మారక స్థితిలోకి వెళ్లగా, తల్లి సుభాషిణి (30), నానమ్మ వెంకట నరసమ్మ (55) ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. తాత ఎర్రం శ్రీనివాసరావు(60)కు తీవ్ర గాయాలైయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే సీఐ అన్వర్ బాషా, ఎస్‌ఐ అంకమ్మ, హైవే మొబైల్ పోలీసులు హుటాహుటిని ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడు చికిత్స పొందుతూ చిన్నారి అభిరామ్ మృతి చెందాడు. శ్రీనివాసరావు, రుక్మిణిలను మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం రుక్మిణి, మధ్యాహ్నం శ్రీనివాసరావు మృతి చెందారు. నెల్లూరు నుంచి రుక్మిణి, కావలి ఆసుపత్రి నుంచి చిన్నారి అభిరామ్ మృతదేహాలను ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించి శనివారం సాయంత్రానికి నలుగురు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆసుపత్రి ప్రాంగణమంతా బాధిత బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలతో నిండిపోయింది. జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంకమ్మ తెలిపారు.



ఘటనాస్థలిలో రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న తుఫాన్ వాహనం

ప్రాణాలతో బయటపడిన చిన్నారి

మృతి చెందిన సుభాషిణి కొత్తగణేషునిపాడు గ్రామంలో సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తుంది. ఆమె భర్త వెంకటేశ్వర్లు పిడుగురాళ్ల మండలం అగ్రహారంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. వీరి తొమ్మిది నెలల పాప ప్రాణాలతో బయట పడగా భార్య, తల్లి, వదిన, మామ చనిపోవడంతో ఆయన ఆవేదనకు అంతు లేకుండా పోయింది.

డ్రైవర్ నిద్రే కారణమా!?

తుఫాన్ వాహనం సత్తెనపల్లికి చెందిన వారిది. ఈ వాహనాన్ని రామ్మూర్తి అద్దెకు మాట్లాడుకున్నారు. అయితే రాత్రి ప్రయాణం కావడంతో డ్రైవర్ నిద్రలోకి జారి ఉంటాడని ఇదే ప్రమాదానికి కారణమని కొందరు అనుమానిస్తున్నారు. వేగంగా వెళ్తుండగా రోడ్డు పక్కన నిలబడి ఉన్న లారీ కన్పించకపోవడంతో అయినా ప్రమాదం జరిగి ఉంటుందని మరికొందరి వాదన.

బాధితులకు పరామర్శ

విషయం తెలుసుకున్న గురజాల మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి బాధిత కుంటుంబ సభ్యులను శనివారం ఉలవపాడు ఆసుపత్రికి వచ్చి పరామర్శించి ధైర్యం చెప్పారు. పోస్టుమార్టం త్వరగా నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని డ్యూటీ డాక్టర్ ఐశ్వర్యతో మాట్లాడారు.



మృతులు శ్రీనివాసరావు, సుభాషిణి(ఫైల్)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	107
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 510

మాలకొండ ఆదాయం రూ. 13,85,947

వలేటివారిపాలెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి 13,85,947 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్ ఎస్. చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ. 9,350, కుంకుమార్చన ద్వారా రూ. 24,200, వివాహాల ద్వారా రూ. 44 వేలు, తలనీలాల ద్వారా రూ. 55,200, వాహనపూజల ద్వారా రూ. 6,220, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 5,05,200, స్థలపురాణ పుస్తకాల విక్రయం ద్వారా రూ. 960, గదిఅద్దెల ద్వారా రూ. 36,200, కవర్ల ద్వారా రూ. 17 వేలు ప్రసాద విక్రయాల ద్వారా రూ. 3,71,345, అన్నదానం ద్వారా రూ. 2,49,772, విరాళాల రూపంలో రూ. 67,500 ఆదాయం లభించిందని ఆయన తెలిపారు.

111 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 224 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 111 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-104, ఆర్ఆర్-1, సీఆర్-5, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 113 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.150, సగటు ధర రూ.220.54గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

డ్రైనేజీ కాలువలో చెత్తా చెదారం తొలగింపు



అడ్డకాలువను శుభ్రం చేయిస్తున్న బీజేపీ నేత అమరా వెంకట సుబ్బారావు

కావలి, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం రామమూర్తిపేటలోని సాయిబాబా గుడికి వెళ్లే అటవీశాఖ కార్యాలయ పక్క రోడ్డులో ఉన్న అడ్డకాలువ పిచ్చి చెట్లు, చెత్తా చెదారాలతో నిండిపోయింది. ఈ విషయాన్ని స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. దీంతో బీజేపీ నేత అమరా వెంకటసుబ్బారావు తన సొంత నిధులతో అక్కడ ఉన్న పిచ్చి చెట్లను, చెత్తను తొలగించారు.

పుర యాప్‌లో ఫిర్యాదు చేసినా స్పందన కరువు



మాట్లాడుతున్న అడ్వకేట్ రెహమాన్

కావలి, ఆగస్టు9 (ఆంధ్ర జ్యోతి): కావలి పట్టణ 8వ వార్డులోని చింతంవారి వీధిలో మున్సిపల్ నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న అవకతవకలపై పుర యాప్ లో ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికా రులలో స్పందన లేదని అడ్వకేట్ రెహమాన్ తెలిపారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ, రోడ్డునిర్మాణం ఆక్రమణలు తొలగించకుండా చేస్తుండటంతో రోడ్డు కుచించుకు పోతుందన్నారు. ఏదైనా ఎమర్జెన్సీ అయితే అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై అధికారులు స్పందించక పోతే న్యాయపోరాటం చేయాల్సి వస్తుందన్నారు.

మాలకొండ ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

వలేటివారిపాలెం, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయ ధర్మకర్తల మం డలి నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటి ఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయ అసి స్టెంట్ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. కార్యాలయంలో దరఖాస్తులు ఉచితంగా పొందవచ్చన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ప్రక టన జారీ అయిన 20 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

స్వయం ఉపాధిపై యువత దృష్టి సారించాలి

దగదర్తి(బిట్రగుంట) ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని టీడీపీ యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు సూచించారు. దగదర్తి మండలం వెలుపోడు సెంటర్‌లో మోటారు వాటర్ సర్వీస్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత మాలేపాటి సుధాకర్‌నాయుడు, కంచర్ల కృష్ణ, వంట్టిగుంట గోపాల్, వర్తినేనికృష్ణ, బాబావల్లి, సురేష్, మోహన్‌రావు, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, సుమంత్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

మాలకొండలో ప్రముఖులు

వలేటివారిపాలెం : మండలం లోని మాలకొండ శ్రీ మాల్యా ద్రి లక్ష్మీనృసింహస్వామిని శనివారం నెల్లూరు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ దర్శించు కున్నారు. ఆయనకు ప్రధాన ఉపఅర్చకులు గౌరీశంకర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాలువా పూల మాలతో సత్కరించి, ప్రసాదం అందజేశారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

పశు వైద్యం.. గాలిలో దీపం!

- మందులు ఉన్నా..పశు వైద్యులు, సిబ్బంది లేరు
- లింగసముద్రంలో పశు వైద్యాధికారి, వెటర్నరీ అసిస్టెంటు పోస్టుల ఖాళీ
- వీఆర్ కోటలో భర్తీకాని మూడు పోస్టులు
- ఇబ్బందిపడుతున్న రైతులు, పశు పోషకులు

లింగసముద్రం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : 'అంగట్లో అన్నీ ఉన్నా, అల్లుడి నోట్లో శని' అన్న చందంగా మారింది.. పశువైద్య కేంద్రాల్లో పరిస్థితి. లింగసముద్రం, వీఆర్ కోట పశు వైద్యశాలల్లో సమృద్ధిగా మందులు ఉన్నప్పటికీ, పశు వైద్యాధికారులు, సిబ్బంది లేరు. దీంతో పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెల మొదటి వారంలో జరిగిన బదిలీల్లో వీఆర్ కోట పశు పశు వైద్యాధికారి, వెటర్నరీ అసిస్టెంటు బదిలీ అయ్యారు. అయితే ఇక్కడికి కొత్తగా ఎవరూ రాలేదు. అంతేగాక ఈ వైద్యశాలలో చాలా కాలం నుండి ఆఫీసు సబార్డినేట్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. దీంతో ఇక్కడ మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఈ వైద్యశాల పరిధిలోని వీఆర్ కోట, విశ్వనాథపురం, మాలకొండరాయునిపాలెం, తూనుగుంట, బ్రాహ్మణపల్లి గ్రామాలకు చెంది పశు పోషకులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాల్లో సుమారు 1000 నుండి 1500 వరకు పశు సంపద, ఇతర జీవాలు ఉన్నాయి. వీటికి ఏదైనా జబ్బు చేస్తే వారు గోపాలమిత్రల వద్ద గానీ, ప్రైవేటుగా గానీ, మందులు కొని జబ్బులను నయం చేయించు కుంటున్నారు. అలాగే అప్పుడప్పుడు తెరిచే పశు వైద్యశాలలో కూడా మందులు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు

లింగసముద్రంలో ఆఫీస్ సబార్డినేటే దిక్కు...

గత నెలలో జరిగిన బదిలీల్లో లింగసముద్రం పశు వైద్యశాలకు ఇన్‌చార్జ్ వైద్యాధికారిగా ఉన్న డాక్టర్ బదిలీపై వెళ్లిపోయారు. ఇక్కడ ఆఫీసు సబార్డినేట్ ఒక్కరే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ఈ వైద్యశాలలో కూడా చాలా కాలం నుండి వెటర్నరీ అసిస్టెంటు పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఈ వైద్యశాల పరిధిలో ఉన్న యర్రారెడ్డిపాలెం, వెంగళాపురం, లింగసముద్రం, వాకమళ్లవారిపాలెం, జంపాలవారిపాలెం, పెంట్రాల, చీమలపెంట, రాళ్లపాడు గ్రామాల పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాలలో సుమారు 5 వేల వరకు పశు సంపద ఉంది. వీరు లింగసముద్రం వైద్యశాలకు వచ్చి పశువులకు మందులు తీసుకెళుతుంటారు. కొందరు ప్రైవేటు మందుల షాపుల్లో మందులు తీసుకెళుతుంటారు.అయితే రెగ్యులర్ పశు వైద్యులు, వెటర్నరీ సహాయకులు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు చెప్పారు.



వీఆర్ కోట పశు వైద్యశాల

ఇన్‌చార్జ్ వైద్యాధికారిగా డా. సుబ్రహ్మణ్యం

చినపవని పశు వైద్యాధికారి డా. సుబ్రహ్మణ్యంను ఉన్నతాధికారులు లింగసముద్రం, వీఆర్ కోట పశు వైద్యశాలలకు ఇన్‌చార్జ్ వైద్యాధికారిగా నియమించారు. దీంతో ఆయన వారంలో రెండు రోజులకొకసారి అందుబాటులో ఉండి, పశువులకు మందులు ఇచ్చి వెళుతుంటారు. ఇలా ఆయన విధి నిర్వహణలో త్రిపాత్రాభినయం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ వైద్యులు, సిబ్బందిని నియమించాలని పశు పోషకులు కోరుతున్నారు.

నేడు పుష్కరిణి పునర్నిర్మాణానికి శంకుస్థాపన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పండితులు

బిట్రగుంట, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): బోగోలు మండలం కొండ బిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి పుష్కరిణి పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు వేదపండితులు ఈపూరి సత్యనారాయణచార్యులు శనివారం తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు రావి విజయ్ కుమార్ పర్యవేక్షణలో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చొరవతో స్వామి వారి ఆలయాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి నిర్మాణ దాత ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంఎల్సీ బీద రవిచంద్రయాదవ్ హాజరు కానునట్లు ఆయన తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో పాటు భక్తులు తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కందుకూరులో భారీవర్షం

కందుకూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణం, పరిసర ప్రాంతాలలో శనివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. ఈ ఏడాది మే నెలలో భారీవర్షాలు కురిసినప్పటికీ ఆ తర్వాత ఇప్పటివరకు చిరుజల్లులు మినహా చెప్పుకోదగ్గ వర్షం కురవలేదు. దీంతో ఖరీఫ్‌లో పైర్ల సాగుకు వాతావరణం అనుకూలించలేదు. మరోపక్క రాళ్లపాడు ఆయకట్టులో ఉన్న పత్తి, అడపాదడపా వర్షాధారంతో సాగుచేసిన పైర్లు కూడా ఎండలధాటికి ఎండిపోతున్న పరిస్థితి.



ఈ ప్రాంతాలలో వేలాది ఎకరాలలో విస్తరించి ఉన్న జామాయిల్ తోటలు కూడా ఎండిపోతున్న దశలో వాటికి వర్షం ఊపిరిపోసింది. బాగా పదును అయినందున జామాయిల్‌లో అంతర్గత సేద్యాలు, ఎరువులకు అనుకూల పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి

కందుకూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని కందుకూరు ప్రాంతంలో శనివారం ఘనంగా జరుపుకొన్నారు. బాలికలు, మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆశీర్వాదం తీసుకోగా, సోదరులు వారికి బహుమతులు ఇచ్చారు. ఒకప్పుడు ఈ ప్రాంతంలో రాఖీపండుగకు పెద్దగా ప్రాధాన్యం లేనప్పటికీ ఇటీవల పలు ప్రైవేటు పాఠశాలల్లోను రాఖీపర్వదినాన్ని కోలాహలంగా నిర్వహించారు. మరోవైపు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు ఆయా పార్టీల మహిళా కార్యకర్తలు రాఖీలు కట్టి ఆశీస్సులు అందుకున్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు పలువురు మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. మాజీమంత్రి మహీధరరెడ్డిని కందుకూరు పట్టణంలోని పలువురు ముస్లిం చిన్నారులు ఆయన కార్యాలయంలో కలిసి రాఖీలు కట్టారు. వైసీపీ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు ఆ పార్టీ మహిళా కార్యకర్తలు రాఖీలు కట్టారు.



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు రాఖీలు కడుతున్న టీడీపీ మహిళాకార్యకర్తలు

కలిగిరి, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): రాఖీపౌర్ణమి వేడుకలను మండలవాసులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. సోదర సోదరీమణులు ఒకరికొకరు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

కొండాపురం: రక్షాబంధన్ పండుగను శనివారం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్దా తేడాలేకుండా రాఖీలు కట్టించుకొని మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కలిగిరి: క్రాకుటూరులో సోదరుడి చేతికి రాఖీకడుతున్న సోదరి



కొండాపురం: తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

బిట్రగుంట: బోగోలు మండలంలో రాఖీ వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. కాగా, ప్రపంచ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు వచ్చిన గిరిజన నేత బోగిరి ప్రభాకర్‌కు రాఖీ కట్టి జాతి కోసం పోరాడమని ఓ సోదరి దీవెనలిచ్చింది. మత్స్యకార మహిళ గిరిజన నేత కావాటి శ్రీనివాసులుకు రాఖీ కట్టింది.

లింగసముద్రం: అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ వేడుకలు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. శనివారం లింగ సముద్రం, చినపవని, పెదపవని తదితర గ్రామాలలో అన్నలకు, తమ్ముళ్లకు చెల్లెల్లు, అక్కలు ఆత్మీయంగా రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సోదరీమణులకు సోదరులకు బహుమతులు అందజేసి, ఎల్లప్పుడూ రక్షగా ఉంటామని భరోసా ఇచ్చారు.



బిట్రగుంట: గిరిజన నేత ప్రభాకర్‌కు రాఖీ కడుతున్న సోదరి

నాపై నిందలు వేయడమంటే

ఆకాశంవైపు ఉమ్మి వేయడమే

- బెంగళూరులో కూర్చొని నీతిమాలిన రాజకీయాలు మానుకో
- ప్రభుత్వ ఆస్తి ధ్వంసం చేసిన వారిని వదిలేదే లేదు!
- మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌పై కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఫైర్



పైలాన్ ధ్వంసం చేసిన ప్రాంతాన్ని ఎమ్మెల్యేకు చూపుతున్న టీడీపీ నేత రామకృష్ణ

కావలి రూరల్ ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి) : 'ప్రతాప్‌రెడ్డీ... నువ్వు నాపై అసత్య ఆరోపణలతో నిందలు వేస్తున్నావ్. నాపై నిందలు అంటే ఆకాశం వైపు ఉమ్మడమే. నేరుగా అది నీ ముఖాన్నే పడుతుంది.' అంటూ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కావలి మండలం తుమ్మలపెంటలో ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి వైసీపీ నేతలు పగలగొట్టిన పైలాన్, శిలాఫలకాల శిథిలాలను శనివారం ఎమ్మెల్యే పరిశీలించి వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతాప్ అనుచరులైన తిరుపతి, రాజు, యానాది సారథ్యంలోనే ఈ శిలాఫలకాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలంలో వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ పైలాన్, శిలాఫలకాలను ఆ పార్టీ నాయకులే పగలగొట్టించటం ఒక దుర్మార్గ పిరికిపంద చర్యగా అభివర్ణించారు. పదేళ్ల ఎమ్మెల్యేగా పని చేసిన ప్రతాప్‌రెడ్డిని 78 సంవత్సరాల స్వాతంత్ర్య చరిత్రలో 33వేల ఓట్ల మైనస్‌తో తరిమి కొట్టారని అన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. 'నువ్వు కావలికి వచ్చినప్పుడు నీ అంతు చూసేందుకు నీ ఇంటికే వస్తా. ఇది మా తప్పిదమే క్షమించండి అని చెప్పకపోతే నువ్వు ఎక్కడికి వెళ్లినా టీడీపీ అడ్డుకుంటుంది.' అంటూ ఘాటుగా మాట్లాడారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు ఆవుల రామకృష్ణ, పాలడుగు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

కావలి,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): ఐసీసీ బ్యాంక్ ఆఫీసర్ సుభాన్ తన తల్లి హుస్సేన్‌బీ వర్ధంతిని పురస్కరించుకుని డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో శనివారం కావలిపట్టణ కావేరిగుంట గిరిజనకాలనీలోని గిరిజనులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ఐసీసీ బ్యాంక్ ఈక్విటీ ఆఫీసర్ వెంకట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు దిలీప్, తులసి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు దుప్పట్లు , పండ్లు పంపిణీ చేస్తున్న ఐసీసీ బ్యాంక్ ఆఫీసర్ సుభాన్, రాంసెంటర్ బాధ్యులు

గణేష్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

- 27నుంచి నవరాత్రోత్సవాలు

కావలి(టౌన్)ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): స్థానిక మానస సెంటర్ గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలుగోళశాంభవి ఆలయంలో మలిశెట్టి దంపతుల పర్యవేక్షణలో గణేష్ విగ్రహ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం మలిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు ఈనెల 27న ప్రారంభమై సెప్టెంబరు 4 వరకు జరగనున్నాయని, గణేష్ మహరాజ్‌కు అఖండ దీపారాధన ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. విగ్రహం వద్ద ప్రత్యేక సెట్టింగులు ఏర్పాటు చేయనున్నామన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ఉత్సవాలు జయప్రదం చేయాలన్నారు.



గణేష్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న మలిశెట్టి దంపతులు కమిటీ సభ్యులు

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

బిట్రగుంట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం రామాపురంలో శని వారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సంద ర్భంగా ఏకలవ్యని విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎరుకుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కావాటి శ్రీనివాసులు, ఏపీ ఎరుకుల గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోగిరి ప్రభాకర్, గిరిజన నాయకులు చంద్రబాబు, ఏసేపు, క్రాంతి, సుధాకర్, కోటేశ్వరి, పద్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఏకలవ్యడి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎరుకుల సంఘనేతలు

ఐక్యంగా పోరాడితేనే గిరిజనాభివృద్ధి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొగిలి

కావలి(టౌన్) ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి) గిరిజనులందరూ ఐక్యంగా పోరాడితేనే గిరిజనాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య పేర్కొన్నారు. టీకె నగర్ గిరిజన కాలనీలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజన నాయకులు విజయకుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీడీపీ పట్టణ కమిటి అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్ పాల్గొని ఏకలవ్యుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కల్లయ్య మాట్లాడుతూ టీకే నగర్‌లో మౌలిక వసతులు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారన్నారు. రూ.10కోట్ల నిధులతో ప్రత్యేక ప్యాకేజితో టీకే నగర్‌లో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సౌకర్యం కల్పించాల్సిందిగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని కోరనున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన నాయకులు బోగిరి ప్రభాకర్, స్థానిక టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ మాల్యాద్రి, సీనియర్ నాయకులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

12న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కలిగిరి, ఆగస్టు 9(ఆంధ్ర జ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్యకేంద్రంలో శనివారం వైద్యాధికారిణి డా. బిజ్జం గీతారెడ్డి జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈనెల 12న మండలంలోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ఎఫ్ఎస్ మేరీ, సూపర్‌వైజర్ మహలక్ష్మి, ఫార్మాసిస్ట్ విజయ, సిబ్బంది పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో గోడపత్రిక ఆవిష్కరిస్తున్న గీతారెడ్డి

రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు చాకిచర్ల విద్యార్థి



పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన ఎస్ చైతన్య

ఉలవపాడు, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎస్ చైతన్య ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9,10 తేదీల్లో విశాఖపట్నం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే సబ్ జూనియర్స్ షార్ట్‌పుట్ పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. గతనెల జూలైలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఓగుబోయిన శ్రీనివాసులు తెలిపారు. హెచ్‌ఎంతోపాటు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సుధాకర్, గ్రామస్థులు చైతన్యకు అభినందనలు తెలిపారు.

హాస్టళ్లకూ మార్కులు!

(5వ పేజీ తరువాయి)

హాస్టళ్ల పనితీరును బట్టి ర్యాంకులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ విధానాన్ని అమలు చేసి వచ్చే ఏడాది ర్యాంకులు ప్రకటించనుంది. ఇందు కోసం ప్రత్యేకంగా ఆరు నిర్ధేశిత అంశాలను విడుదల చేసింది.

- మొత్తం వంద మార్కులు..

ఆరు నిర్దేశిత అంశాలకు ప్రభుత్వం వంద మార్కులు కేటాయించింది. విద్యా-చదువులో పనితీరుకు 40 మార్కులు (హాస్టల్‌లో ఉన్న విద్యార్థుల ప్రగతికి 20, అద్భుత ఫలితాల సాధనకు మరో 20 మార్కులు) ఉంటాయి. అదేవిధంగా విద్యార్థుల హాజరు, రిటెన్షన్‌కు ఐదు వంతున 10 మార్కులు కేటాయించారు. మెనూ ప్రదర్శనకు రెండు, అమలుకు 10 మార్కులు కేటాయించారు. హాస్టల్‌లో అనుకోని ఘటనలు జరిగి, విద్యార్థులు ఇబ్బందిపడితే వాటికి స్పందించటం, ఉన్నతాధికారులకు తక్షణమే సమాచారం ఇవ్వడానికి మరో ఐదు మార్కులు కేటాయించారు. పరిశుభ్రత, పచ్చదనం, పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు కల్పనకు మరో ఐదు మార్కులు ఉంటాయి. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాల నిర్వహణకు 4, ఆరోగ్య పరీక్షల నిర్వహణకు 4, పీ-4 కార్యక్రమంలో భాగంగా స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాల నిర్వహణ, వనరుల సమీకరణకు మరో 4 మార్కులు కేటాయించారు. క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దినందుకు 6, సాంకేతికత మెరుగుదల, ఆవిష్కరణకు 4 మార్కులు కేటాయించారు. హాస్టళ్లపై పత్రికల్లో వచ్చే కథనాలకు సంబంధించి అధికారుల వివరణకు 3 మార్కులను కేటాయించారు.

- వలంటీర్ల నియామకం

ప్రీమెట్రిక్ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు రాయడం, చదవటం, లెక్కలు వంటివి నేర్పించడానికి వలంటీర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ప్రీమెట్రిక్ హాస్టల్‌కు ఒక్కో వలంటీర్‌ను నియమించనున్నారు. వీరికి గౌరవవేతనం చెల్లించనున్నారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ హాస్టళ్లలో పనితీరు మెరుగు, విద్యాప్రమాణాలు, వసతుల మెరుగుకు ప్రభుత్వం ర్యాంకులను ప్రవేశపెట్టినట్లు చెప్పారు.



సీతారామపురంలో
రాఖీ కట్టుకుంటున్న చిన్నారులు

ఉత్సాహంగా రాఖీ పండుగ

నెల్లూరు (సాంస్కృతికం) : ఆత్మీయ అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను జిల్లావాసులు ఉత్సాహంగా జరుపుకున్నారు. వయసుతో నిమిత్తం లేకుండా సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు కూడా కొంతమంది మహిళలు రాఖీలు కట్టారు. నగరంలోని మార్వాడీలు చిన్నబజార్, మండపాల వీధి, పెద్దబజార్, ఆచారివీధి, కాపు వీధుల్లో వారి వేడుకలు జరుపుకున్నారు.

414 భవనాలపై
థర్డ్‌పార్టీ విచారణ

నెల్లూరు(సిటీ): నెల్లూరు నగరంలోని పలు డివిజన్లలో సుమారు 414 భవనాల ఆస్తి పన్నుపై థర్డ్‌పార్టీ విచారణ జరుగుతోంది. ఏప్రిల్ 1వ తేదీతో మొదలైన నూతన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ భవనాలకు ఆస్తి పన్ను తగ్గింది. ఆ మేరకు డిమాండ్‌ను కార్పొరేషన్ విడుదల చేసింది. దీనిపై విచారణ చేపట్టాలని రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశించడంతో వాస్తవాలను గుర్తించే క్రమంలో థర్డ్‌పార్టీ విచారణ చేపట్టారు. ప్రస్తుతం ఒంగోలు కార్పొరేషన్‌కు సంబంధించిన రెవెన్యూ అధికారులు ఈ భవనాల పన్ను తగ్గింపుపై సమగ్ర విచారణ చేపట్టినట్లు సమాచారం. వారిచ్చే తుది నివేదిక ఆధారంగా తదుపరి పన్ను జారీ ఉంటుందని రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి.



కల్యాణోత్సవంలో పాల్గొన్న వేమిరెడ్డి, మేకపాటి దంపతులు

శ్రీనివాసా గోవిందా..
శ్రీ వేంకటేశా గోవిందా!

● ఉదయగిరిలో వేడుకగా శ్రీవారి కల్యాణం

ఉదయగిరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి రంగనాయకులస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణం కనులపండువగా సాగింది. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా పేలుళ్లు, భక్తుల కోలాట నృత్యప్రదర్శనలు, గోవింద నామస్మరణ చేస్తూ మెయిన్‌బజార్ మీదుగా రంగనాయకులస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కల్యాణవేదిక వద్దకు చేర్చారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి కల్యాణం జరిగింది. భారీగా తరలివచ్చిన భక్తులు గోవింద నామస్మరణతో రెండు చేతులు జోడించి స్వామివారికి నమస్కరిస్తూ పరవశించిపోయారు. గ్రామాల్లో భక్తులు గోటితో వలిచిన వడ్ల బియ్యాన్ని స్వామివార్లకు తలంబ్రాలుగా సమర్పించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, శాంతికుమారి దంపతులు పాల్గొని స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆర్టీసీ నెల్లూరు రీజియన్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్, టీడీపీ, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఉట్టి మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉదయగిరి సీఐ వెంకటరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీను, ఆదిలక్ష్మిలు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



స్వామివారి ఊరేగింపులో భక్తుల కోలాహలం

SUNDAY SPECIAL


పెన్నమ్మ హొయలు..
ప్రకృతి పిలుపులు..

● సోమశిల జలాశయం సొంతం

చుట్టూ కొండలు.. పచ్చిన చెట్లు.. వాటిమధ్యలో పక్షుల కిలకిలరావాలు ఓ పక్క.. పెన్నమ్మను తాకుతూ వీచే చల్లగాలులు మరోవైపు.. సోమశిల జలాశయం సొంతం. పర్యాటకులనే కాదు.. భక్తులను ఆకట్టుకునే డ్యాం పరిసర ప్రాంతం సెలవు రోజులు, ఇతర పర్వదినాలలో రద్దీగా మారుతుంటుంది. రెండు కొండల మధ్య నిర్మించిన ఈ డ్యాంను చూసేందుకు మన జిల్లా నుంచేగాక పొరుగు జిల్లాల నుంచి కూడా వస్తుంటారు.

\- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

ఐదవ పంచవర్ష ప్రణాళికలో భాగంగా సోమశిల డ్యాం ప్రతిపాదనలు జరిగాయి. నెలూరుతోపాటు చెన్నై ప్రజల దాహార్తి తీర్చేలా 1975లో పెన్నానదిపై సోమశిల గ్రామం వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు శిలాఫలకం వేశారు. సుమారు పదేళ్లపాటు ఏకదాటిగా పనులు జరిగాయి. 1985లో నీటి నిల్వ ప్రక్రియ మొదలవగా అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించి జిల్లా ప్రజలకు నీరు ఇచ్చారు.



వరద పోటెత్తి నిండుకుండగా మారిన సోమశిల డ్యాం నుంచి గేట్లను ఎత్తి గంగమ్మను దిగువకు వదిలే సమయంలో సుందర వీక్షణం (ఫైల్)

ఇవి చేస్తే..

ప్రకృతిప్రియులను కట్టిపడేసే సోమశిల జలాశయం వద్ద మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. డ్యాం వద్ద నిరుపయోగంగా ఉన్న డార్మెంటరీని వినియోగంలోకి తేవాలి. అతిథి గృహాలను అందుబాటులోకి తెస్తే బాగుంటుంది. ఖాళీ ప్రదేశాల్లో పార్కులు, రెస్టారెంట్లు, అటవీ అందాలు వీక్షించేలా బోటుషికారు వసతులు కల్పిస్తే ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరుతుంది.



● 5.6 లక్షల ఎకరాల్లో సాగు

సోమశిల ప్రాజెక్టు నిర్మించక ముందు జిల్లా ఎడారిని తలిపించేది. మాగాణి భూమి అయినా ఏడాదికి ఒకకారు మాత్రమే పండేది. సోమశిల జలాశయ నిర్మించాక కండలేరు జలాశయం కూడా అనుసంధానం కాగా కాలువలు అభివృద్ధి చెందాయి. సుమారు 68 టీఎంసీల సామర్థ్యం కలిగిన డ్యాంలో నీటిని నిల్వ చేసి సాగు, తాగునీటికి సరఫరా చేస్తున్నారు. ఇంకేముంది.. మాగాణితోపాటు మెట్టభూములూ పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. అంతేకాదండోయ్... భూమి విలువ పదింతలు పెరిగింది. ప్రస్తుతం జలాశయం పరిధిలో మొదటి పంట కింద 5.60 లక్షలు, రెండవ పంట మరో మూడు లక్షల ఎకరాలు వరి సాగులోకి వస్తుంది. దీంతో సింహపురి కాస్త ధాన్యపుగిరిగా మారింది.

ఇక్కడి చేపలు భలే రుచి!



అరుదైన మత్స్యసంపద సోమశిల డ్యాంకే దక్కుతుంది. ఎర్రగండి, నల్లగండి, శ్రీలావతి, కట్ల, బొచ్చ. రూప్‌చంద్, చందువ, మూస, కొర్రమీను, పంజారం, రొయ్యలు, పీతలు డ్యాంలో లభిస్తాయి. లైసెన్సు కలిగిన జాలర్లు 800 కుటుంబాలకు కూడా ఈ డ్యాం జీవనాధారం. పెన్నాకు ఉపనదులైన కుందూ, పాపాగ్ని, సగిలేరు తదితర పాయల నుంచి నీరు ఈ నదిలో కలుస్తుంటాయి. అందుకేనేమో డ్యాంలో దొరికే చేపలకు మంచి రుచి ఉంటుంది. జిల్లా అవసరాలు తీర్చడంతోపాటు కోల్‌కతా, పూణె, ముంబయి మహానగరాలకూ ఇక్కడి చేపలు ఎగుమతి అవుతాయి. స్థానికంగా కేజీ రూ.110 నుంచి 150 వరకు విక్రయిస్తారు. సోమశిలను సందర్శించే పర్యాటకులు ఇక్కడదొరికే చేపలు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు.

పచ్చదనంతో పెనుశిల కొండలు

జలాశయం చుట్టూ దట్టమైన సుమారు వెయ్యి హెక్టార్ల విస్తీర్ణంలో పెనుశిల కొండలు పచ్చదనం సంతరించుకొన్నాయి. ఈ కొండల్లో చిరుతలు, జింకలు, అడవికుక్కలు, కోళ్లు, పందులు, దుప్పులు, అడవిదున్నలు, ఆవులు, ఎలుగుబంట్లు, ముళ్లపందులు ఉన్నాయి. ఇక ఎర్రచందనం, మామిడి, ఉసిరి తదితర వృక్షాలు ఉన్నాయి. అటవీ సంపద రక్షించేలా చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అడవిలో వెళ్లేందుకు ఎవరికీ అనుమతి లేదు.

20 మెగావాట్స్ విద్యుత్ ఉత్పత్తి



జలాశయం నీటిని వినియోగించుకొంటూ విద్యుత్ ఉత్పతి చేసేలా బాలాజి పవర్ ప్లాంట్ ఉంది. ఇందులో నాలుగు యూనిట్లు ఉండగా, 20 మెగావాట్స్ విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. నీటితో కరెంటు ఉత్పిత్తి విధానం చూడముచ్చటగా ఉంటుంది. అయితే, ఇక్కడకు ఎవరికీ అనుమతి లేదు. నీటితో విద్యుత్ తయారీ అనంతరం ఇదే నీరు డెల్టా, నాన్‌డెల్టాకు తరలిస్తారు.

సోమేశ్వరాలయం విశిష్టత

డ్యాం దిగువన సోమేశ్వరుడి ఆలయం ఉంది. విక్రమాదిత్యుడి కాలంలో ఈ ఆలయం నిర్మించినట్లు పెద్దలు చెబుతారు. జలాశయం నిర్మాణ సమయంలోనే ఆలయానికి ఎలాంటి ముప్పు జరగకుండా జాగ్రత్తలు తీసుకుని డ్యాం కట్టడాలు నిర్మించారు. అయితే 2021, 22 ఏడాదిలో వచ్చిన భారీ వరదకు ఆలయ గాలిగోపురం ధ్వంసమైంది. గత వైసీపీ పాలకులు ఆలయ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆలయ పునఃనిర్మాణ పనులు జరుగుతున్నాయి. రూ.8 కోట్లతో ఆలయాన్ని నిర్మిస్తుండగా గ్రానైట్ పనులు జరుగుతున్నాయి. పవిత్ర పెన్నానదిలో స్నానం చేసి సోమేశ్వరుడిని దర్శించుకొంటే కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. శ్రావణ మాసంలో పూజలు, శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతాయి.



నిర్మాణదశలో సోమేశ్వరుడి ఆలయం

మా ఊరును కాపాడు స్వామీ!

శ్రీవారికి జంగంరెడ్డివాసులు వేడుకోలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జంగం రెడ్డిపల్లి గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో మైనింగ్ (తెల్ల రాయి) తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని కోరుతూ చేపడుతున్న ఆందోళనలో భాగం గా శనివారం ఆందోళనకారులు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యే క పూజలు నిర్వ హించారు. వరికుంటపాడు, జంగంరెడ్డిపల్లి, భాస్కరాపురం గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని మూకుమ్మడిగా పూజల్లో పాల్గొన్నారు. మైనింగ్ మహమ్మారి నుంచి తమతోపాటు తమ గ్రామాలను కాపాడు స్వామి అంటూ వేడుకున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ లేకుంటే చర్యలు

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రతి ప్రైవేట్ ఆసుపత్రికి వైద్య ఆరోగ్యశాఖ అనుమతితో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుం టామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత హెచ్చరించారు. శనివారం ఆమె నెల్లూరు నగరంలోని అపోలో, నారాయణ, ఎనెల్ ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా ఆసుప త్రుల్లో పలు రికార్డులు పరిశీలిం చారు. ఆసుపత్రుల నిర్వాహణ నిబంధనలకు అనుగుణంగా ఉందా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకు తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అల్లోపతి క్లినికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2002 ప్రకారం తప్పనిసరిగా ఆసుపత్రులు వైద్యశాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఒకనెల రోజుల ముందుగానే ఆన్‌లైన్‌లో రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అలా చేసుకోని ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ప్రైవేట్ ఆసుపత్రికి పొల్యూషన్, ఫైర్, బయో మెడికల్ వేస్ట్ అనుమతి పత్రాలు ఉండాలన్నారు. ఆసుపత్రుల్లో అందించే వైద్య సేవల ధరల పట్టిక అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ తనిఖీల్లో డాక్టర్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారికి అభిషేకించిన తులసీదళాలు

పెంచలోరికి లక్ష తులసీ దళార్చన

శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం పెంచలకోన క్షేత్రంలో లక్ష్మీనృసింహుడికి లక్ష తులసీ దళార్చన, కుంకుమార్చన జరిగింది. ఉదయం మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, పూజలు, అనంతరం ప్రత్యేక అర్చనలు, హోమాలు జరిగాయి. శ్రీవారి నందనవనంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి తులసీ దళాలతో అత్యంత వైభవంగా పూజించారు. సాయంత్రం స్వామివారు బంగారు గరుడుడిపై కొలువుదీరి మాడవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దంపతులు ఉభయదాతలుగా పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు అందించినట్లు ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

\- రాపూరు, (ఆంధ్రజ్యోతి)



పాల్గొన్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల దంపతులు

ఏపీఆర్ఎస్ఏ కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యవర్గం ఆదేశాల మేరకు జిల్లాలోని కలెక్టరేట్, కందుకూరు డివిజన్ యూనిట్లకు నగరంలోని ఏపీఆర్ఎస్ఏ భవన్‌లో శనివారం ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. ఈ ఎన్ని కల్లో కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడుగా యడ్ల నాగేశ్వరరావు, కందుకూరు డివిజన్ యూనిట్ అధ్యక్షుడుగా విజయ భాస్కర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలైన కార్యవర్గ సభ్యులకు ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, కార్యదర్శి డానియల్ పీటర్‌రావు, తదితరులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



ఏపీఆర్ఎస్ఏ కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడిగా ఎన్నికైన నాగేశ్వరరావుకు ధ్రువీకరణ పత్రం అందచేస్తున్న ఎన్నికల అధికారి అనిల్‌కుమార్ యాదవ్

మళ్లీ తెరపైకి...!

● ఇనాం భూముల సమస్య ● రీసర్వే జరగని గ్రామాల్లో రిజిస్ట్రేషన్‌కు నో చాన్స్
● ప్రభుత్వాలు మారుతున్నా తొలగని ఇబ్బందులపై ప్రజాగ్రహం

అల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఇనాం భూములపై సమస్యలు నేటికీ రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. రీసర్వే జరిగిన గ్రామాల్లోని ఇనాం భూములు రికార్డుల్లో పట్టా భూములుగా మారాయి. రీసర్వే జరగని గ్రామాల్లోని ఇనాం భూముల పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా ఉంది. పదేళ్ల కిందట ఇనాం భూములు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో పలువురు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇనాం భూముల్లో ఓ కేటగిరీకి చెందిన భూములను మాత్రమే రిజిస్ట్రేషన్‌కు అంగీకరించారు. అయితే ఇటీవల చేపట్టిన రీసర్వే ద్వారా వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఇనాం అనే పదాన్ని తొలగించి పట్టా అని నమోదు చేశారు. దీంతో ఇనాం భూముల సమస్య తీరినట్లేనని రైతులు భావించారు. కానీ కొన్ని గ్రామాలు, పట్టణాల్లో రీసర్వేను నిలిపేయడంతో ఇనాం భూముల సమస్య అలానే ఉంది.


అవసరమైన రైతులు తమ భూములను విక్రయించుకునేందుకు కార్యాలయాలకు వెళ్లిన సమయంలో రిజిస్ట్రేషన్ అధికారులు ఇనాం భూములు రిజిస్ట్రేషన్ చేయటానికి మోకాలడ్డేవారు. కానీ రిజిస్ట్రేషన్‌లో ఒక సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో పీడీఈ (పబ్లిక్ డేటా ఎంట్రీ) అనే ఒక వెబ్‌సైట్ లో అందించే సమాచారంలో ఇనాం భూముల సర్వేనెంబర్లు ప్రతిబింబించకుండా రిజిస్ట్రేషన్ శాఖ చర్యలు చేపట్టింది. దీంతో అసలు సంబంధిత సబ్ రిజిస్ట్రార్లను కూడా అడిగే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 45వేల ఎకరాలకుపైగా ఈ తరహా భూములు ఉండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

● కోర్టుల్లో కేసులు

ఇనాం భూములను పట్టా భూములుగా పరిగణించాలంటూ పలువురు కోర్టుల్లో వేలాది కేసులు వేశారు. వీటిపై వాదనలు కూడా జరిగినా, ఇనాం భూములను రికార్డుల్లో ఉన్న కాలమ్‌లోని ఇనాం పదాన్ని తొలగించేందుకు సాహసం చేసేవారు ఎవరూ లేక ఆ సమస్య నేటికీ వెంటాడు తూనే ఉంది. రీసర్వేతో ఇనాం భూములు పూర్తి పట్టా భూమిగా మార్పు పొందే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.



వెబ్‌ల్యాండ్‌లో భూమి స్వభావం ఇనాం... అని ఉన్న అడంగల్ కాపీ



రైతులకు ఇబ్బందిగా రిజిస్ట్రేషన్ శాఖ చర్యలు

రిజిస్ట్రేషన్ చేయించుకునేం దుకు అసలు పీడీఈలో సర్వేనెంబర్లు ప్రతిబింబించక పోవడం దారుణం. అన్నీ ఇనాంలు ఒకటికావనే విషయం ఉన్నతాధికారులకు తెలియనిది కాదు. అలాంటిది అన్ని పీడీఈలో ఇలా ప్రతిబింబించనీయకపోవడం సరైన పద్ధతి కాదు. దీంతో రైతులకు తీవ్ర ఇబ్బందే.

\- పప్పు సుధాకర్, రైతు, అల్లూరు




అధికారులు రైతులను ఆదుకోవాలి

ఇనాం భూములు రిజిస్ట్రేషన్ చేయకపోవడం పెద్ద సమస్యగా మారింది. గతంలో జమీన్‌దారులు, జాగీరు దారులు తమ ఇష్టానుసారంగా గ్రామాలను ఇనాం గ్రామాలుగా ప్రకటించారు. వెట్టిచారికీ చేసేవారిని ఇనాం గ్రామాల్లో పెట్టి పెత్తనం చలాయించేవారు. బ్రిటీషు కాలం నాటి ఇనాం భూముల సమస్య నేటికీ రైతులను వెంటా డటం దారుణం. దీనిపై రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు ఓ పరిష్కారాన్ని కనుగొని రైతులను ఆదుకోవాలి.

\- పోలిశెట్టి శ్రీనివాసులు, రైతు, ఉలవపాళ్ల, దగదర్తి మండలం

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు అంగడి మహబూబ్ బాషా. ఆయన తల్లి పేరిట బోగోలు మండలం జువ్వలదిన్నెలోని సర్వేనెంబరు 1018, 1019 నంబర్లలో 5.21 ఎకరాల భూమి ఉంది. అతను తన అవసరాల నిమిత్తం కొంత భూమిని అమ్మాడు. కొనుగోలు చేసిన వ్యక్తి రిజిస్ట్రేషన్ కోసం కావలి సబ్‌రిజిస్ట్రారు కార్యాలయానికి వెళ్లాడు. ఇది ఇనాం భూమి కావడంతో రిజిస్ట్రేషన్‌కు వీలుకాదని అధికారులు తేల్చిచెప్పారు. దీంతో బాషాకు కొనుగోలుదారుడికి మధ్య సమస్య తలెత్తింది. దీంతో అతను కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు.